ఆంధ్రభూమి

సంపుటి: 30 · సంచిక: 219 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | మంగళవారం 8 జనవరి, 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం
దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం
తిథి: శుద్ధ విదియ ఉ.9.30
నక్షత్రం: శ్రవణం రా.9.47
వర్జ్యం: రా.2.13 నుండి 3.59 వరకు
దుర్ముహూర్తం: ఉ.08.24 నుండి 09.12 వరకు, తిరిగి రా.10.48 నుండి 11.36 వరకు
రాహుకాలం: మ.3.00 నుండి 4.30 వరకు



మరో ఘనత!

- ఆస్ట్రేలియా గడ్డపై చరిత్ర సృష్టించిన కోహ్లీసేన
- 72 ఏళ్ల చరిత్రలో సిరీస్ విజయం

ఆస్ట్రేలియా గడ్డపై కోహ్లీ సేన చరిత్ర సృష్టించింది.. 72 ఏళ్ల చరిత్రలో కంగారులను వారి సొంతగడ్డపైనే ఓడించి, దిగ్గజాలకు సాధ్యం కాని అరుదైన ఘనతను సాధించింది.. సిరీస్‌లో చివరి టెస్టు వర్షం కారణంగా డ్రా కావడంతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని 2-1తో సగర్వంగా ముద్దాడింది! ఆసియా ఖండంలోని క్రికెట్ జట్లలో ఆస్ట్రేలియాను ఇలా ఓడించిన ఘనత భారత జట్టుకే దక్కింది.. చారిత్రాత్మక సిరీస్ విజయాన్ని సాధించిన టీమిండియాను యావత్ భారత్ ప్రశంసలతో ముంచెత్తింది.



'హోదా'తో సమానంగా నిధులేవీ?

- కేంద్రాన్ని ప్రశ్నించిన టీడీపీ ఎంపీలు
- అమరావతికి సహాయమేది
- కొత్త రైల్వే జోన్ ఏమైంది
- నిలదీసిన సుజనా చౌదరి

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 7: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక రైల్వేజోన్ ఎందుకు ఇవ్వలేదని కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌ను తెలుగుదేశం ఎంపీలు ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారని పీయూష్ గోయెల్ చేసిన వ్యాఖ్యాలను ఖండించారు. ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో కేవలం కృతజ్ఞతలు మాత్రమే తెలిపారని సుజనా చౌదరి పేర్కొన్నారు. అలాగే ఎన్డీయేతో తెలుగుదేశం పార్టీ కలిసి ఉన్నప్పుడు

- మిగతా 6వ పేజీలో

ఫన్‌గామా



రైలు ఎన్ని రోజులు ఆలస్యమైనా.. మీరు మాత్రం ముందే ఉండాలయ్యా..!

అగ్రవర్ణాలకూ రిజర్వేషన్

ఆర్థికంగా వెనుకబడిన ఓసీలకు పదిశాతం కోటా

- వార్షికాదాయ పరిమితి 8 లక్షలు
- ఐదెకరాల కంటే తక్కువ వ్యవసాయ భూమి
- పట్టణాల్లో 200 గజాల కంటే తక్కువ స్థలం ఉన్నవారికి వర్తింపు
- ఆర్టికల్ 15, 16 సవరణకు సమాయత్తం
- నేడు లోక్‌సభలో బిల్లు



ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 7: లోక్‌సభ ఎన్నికలకు మూడు నెలల ముందే ప్రధాని నరేంద్ర మోదీ ట్రంప్ కార్డును ప్రయోగించారు. దేశంలో ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల ప్రజలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించటం ద్వారా ప్రతిపక్షాలను స్వీయరక్షణలో పడవేశారు. నరేంద్ర మోదీ అధ్యక్షతన సోమవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది. వార్షిక ఆదాయం ఎనిమిది లక్షల లోపు ఉండటం.. ఐదెకరాలు అంతకంటే తక్కువ వ్యవసాయ భూమి కలిగివున్నవారు.. మున్సిపాలిటీల్లో రెండు వందల గజాల కంటే తక్కువ నివాస స్థలం ఉన్న అగ్రవర్ణాల వారికి రిజర్వేషన్లు కల్పిస్తారు. అందుకు రాజ్యాంగాన్ని సవరించేందుకు సంబంధించిన బిల్లును శీతాకాల సమావేశాల ఆఖరు రోజైన మంగళవారం లోక్‌సభలో ప్రతిపాదించనున్నారు. అగ్రవర్ణాలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగంలోని 15, 16 ఆర్టికల్స్‌ను సవరించాల్సి ఉంటుంది. ఈ సవరణ బిల్లును ఆమోదించాలంటే పార్లమెంటులో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరమవుతుంది. ప్రస్తుతం బీసీలకు 27 శాతం, ఎస్సీలకు పదిహేను శాతం, ఎస్టీలకు ఏడున్నర శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. దీనికి ఇప్పుడు ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించటం వలన మొత్తం 60 శాతానికి చేరుకుంటాయి. మిగతా నలభై శాతం సీట్లను ప్రతిభ ఆధారంగా కేటాయిస్తారు. ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగాన్ని సవరించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ఈ పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తారు. దేశంలోని కోట్లాది మంది వెనకబడిన కులాలు, ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన రిజర్వేషన్లకు ఎలాంటి భంగం కలగకుండా అగ్రవర్ణాల వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగాన్ని సవరిస్తారు. మండల్ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు కేంద్ర ప్రభుత్వం ఇరవై ఏడు శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడు అగ్రవర్ణాలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేయటం తెలిసిందే. పీవీ నరసింహారావు ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో

- మిగతా 6వ పేజీలో

పోలవరంలో మహాఘట్టం

రెండు అరుదైన రికార్డులు ఆవిష్కృతం
ధ్రువపత్రం అందుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

పోలవరం, జనవరి 7: పోలవరంలో మహాఘట్టం ఆవిష్కృతమైంది. గోదావరి నదిపై పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం వద్ద నిర్మిస్తున్న పోలవరం జాతీయ ప్రాజెక్టుకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. పోలవరం నిర్మాణ సంస్థ నవయుగ సంస్థ ఆధ్వర్యంలో ప్రాజెక్టు కాంక్రీటు పనుల్లో రెండు అరుదైన రికార్డులు సాధించడంతో ఈ స్థానం దక్కింది. 24 గంటలు నిరంతరాయంగా కాంక్రీటు పనులు చేపట్టడం, 24 గంటల్లో 32,315.5 క్యూబిక్ మీటర్ల కాంక్రీటును పోయడం అనే రెండు ప్రపంచ రికార్డులు నవయుగ సంస్థ సొంతమయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం సాయంత్రం గిన్నిస్ బుక్ సంస్థ ప్రతినిధి రిషీనాథ్ చేతుల మీదుగా ఈ ధ్రువపత్రం అందుకున్నారు. గిన్నిస్ రికార్డు సాధించిన సందర్భంగా ఈ మహాక్రతువులో పాలుపంచుకున్న వారందరికీ రెండు నిమిషాలు కరతాళ ధ్వనులతో అభినందనలు తెలపాలని జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ చేసిన సూచనతో ముఖ్యమంత్రి సహా అంతా కరతాళధ్వనులు చేశారు. అంతకుముందు గిన్నిస్ రికార్డు సాధనకు గుర్తుగా ఏర్పాటుచేసిన పైలాన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అలాగే ప్రత్యేక యాగంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవయుగ నిర్మాణ సంస్థ ఎండీ

- మిగతా 6వ పేజీలో



గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధి రిషీనాథ్ నుండి ధ్రువపత్రం అందుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

మోదీకి నాపై కక్ష

- ప్రధాని పదవికి పోటీ వస్తానని అక్కసు
- ఎన్టీఆర్‌ను విమర్శించే హక్కు ఆయనకు లేదు
- రాజధానికి మట్టి, నీళ్లిచ్చి మోసం చేశారు
- పెద్ద నోట్ల రద్దు పిచ్చి తుగ్లక్ చర్య
- నిడదవోలు జన్మభూమి సభలో చంద్రబాబు ధ్వజం

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 7: పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాసం పెట్టినందుకే ప్రధాని మోదీ తనపై కక్ష కట్టారని, ఈ కుట్ర రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. తాను ప్రధాని పదవికి పోటీ వస్తానని తనపై అక్కసుతోనే మోదీ వ్యక్తిగతంగా తనపై విరుచుకుపడుతున్నారన్నారని అన్నారు. తనకు గతంలోనే రెండుసార్లు ప్రధాని అవకాశం వచ్చినా, రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని వదులుకున్నానని తెలుసుకోవాలన్నారు. తనకు ప్రధాని పదవిపై ఏమాత్రం మోజు లేదని చంద్రబాబు స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మోదీకి ఎంతో గౌరవం ఇచ్చానని, కానీ నిలబెట్టుకోలేదన్నారు. చంద్రబాబు నాయుడుపై ప్రధాని మోదీ ఆదివారం చేసిన ఆరోపణలపై పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలులో సోమవారం జరిగిన జన్మభూమి మా ఊరు సభలో చంద్రబాబు దీటుగా స్పందించారు. తనపై బురద జల్లేందుకే జగన్‌పై కోడి కత్తితో జరిగిన దాడి కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించారని ఆరోపించారు. ఇది రాష్ట్రం అంశాల్లో జోక్యం చేసుకోవడమేనని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. విభజన హామీలను తుంగలో తొక్కి, చట్టంలోని ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకుండా ప్రధాని వేధిస్తున్నారని బాబు ఆరోపించారు. రాజధాని శంకుస్థాపనకు మట్టి, నీరు ఇచ్చి మోదీ మనల్ని మోసం చేశారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఎన్డీయేలో చేరానని, కానీ మోదీ నమ్మకద్రోహం చేశారన్నారు. అందుకే పోరాటమే శరణ్యమని ఎన్డీయే నుంచి బయటకొచ్చామని

- మిగతా 6వ పేజీలో



నిడదవోలులో అన్న క్యాంటీన్ ప్రారంభించి, భోజనం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

విద్యుత్ చార్జీలు తగ్గిస్తాం! సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని అధికారులకు సీఎం ఆదేశం 2



పల్లెల్లో ప్రగతి బాటలు

- గ్రామాల్లో సీసీ రోడ్ల మెరుపులు
- దేశంలోనే ప్రథమ స్థానం
- నాలుగున్నరేళ్లలో 23,553 కిలోమీటర్ల రహదార్లు
- పెద్దఎత్తున ఉపాధి నిధుల వినియోగం

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 7: చినుకు పడితే చిత్తడిగా మారే రోడ్లు..కంకర లేచిన గోతులతో కూడిన రహదారులు.. గూడాలు, తండాలకు వెళ్లాలంటే మోకాళ్లలోతు మట్టి.. ఇవీ 2014కు ముందు రాష్ట్రంలో రోడ్ల అధ్వాన్న స్థితి. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తరువాత పల్లెల ముఖచిత్రం మారిపోయింది. నాటి గతుకుల రోడ్లు నేడు ప్రగతికి బాటలుగా మెరిసిపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో దారిలేని ఊరు ఉండకూడదనే ఉద్దేశంతో రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి లోకేష్ ఇందుకోసం కోట్లాది రూపాయలు వెచ్చించి రహదారుల నిర్మాణం చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా రూ 5694.44 కోట్ల ఖర్చుతో 23,553 కిలోమీటర్ల మేర రోడ్లు వేయించారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం నిధులను పక్కదారి పట్టించారు. ఎలాంటి పనులు చేపట్టలేదు. గ్రామ పంచాయతీల దగ్గర ఉన్న కొద్దిపాటి నిధులేమో రహదారుల నిర్మాణానికి సరిపోయేవికావు. ఇలాంటి సమయంలో ఉపాధి నిధులను, పనులను అనుసంధానం చేసి ప్రారంభించిన సిమెంట్

- మిగతా 6వ పేజీలో

ఆర్టీజీఎస్.. ఓ అద్భుతం

- బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ప్రశంస
- క్లౌడ్‌హబ్.. బిగ్ డేటా సెంటర్ల గురించి వివరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 7: ఆంధ్రప్రదేశ్‌లో రియల్ టైం గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) వ్యవస్థ అత్యద్భుతమైనదని బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి టోనీబ్లెయిర్ ప్రశంసించారు. సోమవారం రాత్రి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలసి ఆర్టీజీఎస్ పనితీరును ఆయన పరిశీలించారు. అంతకుముందు గన్నవరం విమానాశ్రయంలో మంత్రి లోకేష్, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సచివాలయానికి చేరుకున్న టోనీబ్లెయిర్‌కు ముఖ్యమంత్రి ఆహ్వానం పలికారు. ఆర్టీజీఎస్ పనితీరుపై ఆధ్యయనం చేసేందుకే తాను రాష్ట్రానికి వచ్చినట్లు టోనీ బ్లెయిర్ తెలిపారు. అనంతరం ఇరువురు ఆర్టీజీఎస్‌ను సందర్శించారు. ఈ వ్యవస్థకు

- మిగతా 6వ పేజీలో



సందర్శకుల పుస్తకంలో సంతకం చేస్తున్న బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్

నేటి నుంచి ఆన్‌లైన్‌లో ఐఐటీ జేఈఈ

- రెండు గంటల ముందే హాజరుకావాలి
- దేశవ్యాప్తంగా 9.5 లక్షల మంది
- తెలుగు రాష్ట్రాల నుండి లక్షన్నర మంది
- 30న ఫలితాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 7: దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీలు, 22 జాతీయ సంస్థల్లో ఇంజనీరింగ్ యూజీ కోర్సుల్లో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ తొలిసారి నిర్వహిస్తున్న ఐఐటీ జేఈఈ ఆన్‌లైన్ పరీక్ష 8వ తేదీ నుండి మొదలు కానుంది. అభ్యర్థుల సంఖ్యను అధికంగా ఊహించుకుని ఈ నెల 6 నుండి 20వ తేదీ వరకూ స్లాట్‌లు ఇవ్వాలని నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ తొలుత భావించినా, అనుకున్న సంఖ్యలో అభ్యర్థులు లేకపోవడంతో 8వ తేదీ నుండి 12వ తేదీ వరకూ ఈ పరీక్షను నిర్వహించబోతోంది. తొలి రోజు ఆర్కిటెక్చర్, ప్లానింగ్ విభాగాలకు పేపర్-2 ఉంటుంది, మిగిలిన రోజుల్లో ఇంజనీరింగ్ విభాగానికి పేపర్-1 నిర్వహిస్తారు. ఐఐటీ జేఈఈ నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ స్కోర్ ప్రాతిపదికగానే ఆరు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ అడ్మిషన్లను చేపడుతున్నారు. అదేవిధంగా 8 జాతీయ స్థాయి వర్సిటీలు, మరో 19 ప్రైవేటు సాంకేతిక విద్యాసంస్థలు ఈ స్కోర్ ఆధారంగానే అడ్మిషన్లు చేపట్టనున్నాయి. ఈ ఏడాది పరీక్ష పర్యవేక్షణకు రీజనల్ కేంద్రాల వారీ, పరీక్ష కేంద్రాల వారీ పర్యవేక్షకులను నియమించింది. ప్రతి పరీక్ష కేంద్రానికీ ముగ్గురు చొప్పున పరిశీలకులను నియమించింది. వారందరికీ ఆరు, ఏడు తేదీల్లో మాక్ టెస్టు ప్రదర్శన ఏర్పాటు చేసింది. ఈసారి నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ రెండు విడతలుగా జేఈఈని నిర్వహిస్తోంది. రెండోవిడత ఏప్రిల్‌లో 6 నుండి 20 వరకూ నిర్వహించనుంది. జనవరి పరీక్షకు 9.65 లక్షల మంది దరఖాస్తు చేశారు.

పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు రెండు గంటల ముందే హాజరుకావాలి. ఉదయం సెషన్ 9.30 నుండి 12.30 వరకూ, మధ్యాహ్నం సెషన్ 2.30 నుండి 5.30 వరకూ జరుగుతుంది. ఉదయం పరీక్ష రాసేవారు 7.30కే పరీక్ష కేంద్రాల్లోకి

- మిగతా 6వ పేజీలో



తాత ఎన్టీఆర్ స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి లోకేష్: చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 7: ప్రధాని మోదీ చౌకబారు రాజకీయాలు చేస్తూ తన కుటుంబాన్ని రోడ్డుకు లాగుతున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరోపించారు. పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులో సోమవారం జరిగిన జన్మభూమి మా ఊరు సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. తన కుమారుడు లోకేష్‌ను తానేమీ రాజకీయాల్లోకి రావాలని కోరలేదని స్పష్టం చేశారు. తనకు రాష్ట్రమంటేనే ప్రేమని, కుటుంబమంటే వ్యామోహం లేదన్నారు. లోకేష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అని, తాతగారి స్ఫూర్తితో తనంతట తానుగానే రాజకీయాల్లోకి వచ్చారన్నారు. 28 సంవత్సరాల క్రితం హెరిటేజ్ అనే సంస్థను స్థాపించి తన భార్యకు అప్పగించానని, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా అమెరికా నుంచి వచ్చిన తర్వాత ఏమి చేస్తావో ఆలోచించుకోవాలని లోకేష్‌కు సూచించానన్నారు. రాజకీయాలైతే రాత్రింబవళ్లు కష్టపడాలని, సుఖంగా వ్యాపారం చేసుకోవాలని కోరానన్నారు. అయితే తన సతీమణి బ్రాహ్మణి వ్యాపారం చూస్తుందని, తాను మాత్రం తాత ఎన్టీఆర్ తరహాలో ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వస్తానని చెప్పాడన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయినందునే ఐటీ శాఖ అప్పగించానని, లోకేష్ కృషి కారణంగానే నేడు పలు సాఫ్ట్‌వేర్ సంస్థలు వస్తున్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. అయితే ప్రధాని మాత్రం తన కుటుంబంపై చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.

అసాధ్యాలను సుసాధ్యం చేస్తున్నాం

• ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

• జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, నోడల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 7: పోలవరం కాంక్రీట్ పనుల్లో ప్రపంచ రికార్డు సాధించాం.. ఇదో చారిత్రక ఘట్టం.. అసాధ్యాలను సుసాధ్యం చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్ఘాటించారు. జన్మభూమి- మావూరు కార్యక్రమంపై సోమవారం జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, నోడల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలవరం ప్రాజెక్ట్ రికార్డు సాధించేందుకు ఆదివారం అర్ధరాత్రికి 21వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేశాం.. 24 గంటల్లో 28 వేల క్యూబిక్ మీటర్ల లక్ష్యంగా నిర్దేశించామన్నారు. లక్ష్యానికి మించి 35వేల క్యూబిక్ మీటర్ల వరకు పనులు జరుగుతున్నాయి. ఈ రికార్డు సాధించటంలో చెమటోడ్చి పనిచేసిన అందరికీ అభినందనలు తెలిపారు. వేలాది మంది కార్మికులు, ఇంజనీర్లు, సాంకేతిక సిబ్బంది కష్టానికి ఇది గుర్తింపు అన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. శరవేగంగా ప్రాజెక్ట్ పనులు చేస్తున్నందుకు సీబీఐపీ అవార్డు సాధించామని గుర్తుచేశారు. ఈ అవార్డు అందుకున్న 4 రోజులకే మరో రికార్డు సృష్టించామన్నారు. ఇది ప్రతి తెలుగు వారికి గర్వ కారణమన్నారు. మూడేళ్లలో ప్రధాన డ్యామ్ పనులు 63.27 శాతం పూర్తిచేశాం.. జెట్ గ్రౌటింగ్ పనులు పూర్తయ్యాయి..డయాఫ్రం వాల్ నూరు శాతం పూర్తిచేశాం.. కుడికాలువ పనులు 90 శాతం..ఎడమ కాలువ పనులు 67 శాతం జరిగాయని వివరించారు. అన్ని రంగాల్లో ఏపీ ముందంజలో ఉందన్నారు. వందల సంఖ్యలో అవార్డులు వస్తున్నాయని అందుకే ఏపీపై అసూయ పెంచుకున్నారని విమర్శించారు. అడుగడుగునా కక్ష సాధిస్తున్నారని ప్రధాని మోదీపై మండిపడ్డారు. ఏపీ పేరు వినబడితే చాలు అక్కసు పెరిగిపోతోందని, రాష్ట్ర పురోగతిని చూసి భరించలేక వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ఆక్షేపించారు. హుందాతనం వదిలేసి మాట్లాడుతున్నారు.. నా కుటుంబం గురించి వ్యాఖ్యలు చేస్తున్నారు.. ఇది అంతా ఊహించిందే అన్నారు. చివరకు రిపబ్లిక్‌డేకు ఏపీ శకటం లేకుండా చేస్తున్నారని ఇది కేంద్రంలోని బీజేపీ కక్షసాధింపునకు పరాకాష్ట అన్నారు. జన్మభూమి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటివరకు 1,75,557 ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవను రూ. 5లక్షలకు పెంచామని 12 లక్షల మందికి రూ 5330 కోట్ల వైద్యసేవలు అందాయని వివరించారు. 7లక్షల మందికి ఎన్టీఆర్ బేబీ కిట్స్ ఇచ్చామన్నారు. రూ. 4848 కోట్లతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించామని 33415 అదనపు తరగతి గదులను నిర్మించామని వివరించారు. డిజిటల్ వర్చ్యువల్ క్లాస్ రూములను అందుబాటులోకి తెచ్చామన్నారు. 35 లక్షల మందికి మధ్యాహ్న భోజనం అందుతోందని, విదేశీ ఉన్నత విద్యకు ఇస్తున్న రూ. 15 లక్షలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 4 లక్షల మందికి నిరుద్యోగ భృతి అందుతోందని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పశుగ్రాస భద్రత కల్పించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయటంతో పాటు రైతులకు సకాలంలో చెల్లింపులు జరపాలని సూచించారు. మన రియల్‌టైమ్ గవర్నెన్స్ ప్రపంచానికే ఓ నమూనాగా రూపుదిద్దుకుందని తెలిపారు. పరిష్కార వేదికకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని, సకాలంలో ఎప్పటికప్పుడు ఫిర్యాదుల పరిష్కారంతో పాటు జనాభిప్రాయ సేకరణ, నిజమైన ప్రజాస్వామ్యం సాధ్యపడిందన్నారు. ఆర్టీజీఎస్ వ్యవస్థను అధ్యయనం చేసేందుకు బ్రిటన్ మాజీ ప్రధాని టోనీబ్లెయిర్ రాష్ట్రానికి రావడం గర్వకారణమన్నారు.

ఏపీకి మోదీ వెన్నుపోటు

• బీజేపీ, వైసీపీ ఓట్లడిగితే నిలదీయాలి

• వచ్చే ఎన్నికల్లో 25 ఎంపీ సీట్లు మావే: లోకేష్

ఆంధ్రభూమి బ్యూరో



జన్మభూమి సభలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్


అమరావతి, జనవరి 7: రాష్ట్ర విభజనతో పూర్తిగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్రమోదీ వెన్నుపోటు పొడిచారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేష్ ఆరోపించారు. అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ఏపీని తన కుట్రలు, కుతంత్రాలు ఏమీ చేయలేకపోవటంతో వ్యక్తిగత ఆరోపణలకు దిగుతున్నారని ఆక్షేపించారు. సోమవారం కృష్ణాజిల్లా తిరువూరు నియోజకవర్గం ముష్టికుంట్ల జన్మభూమి గ్రామసభలో పాల్గొన్న లోకేష్ తనపై ప్రధాని చేసిన వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించారు. కృష్ణాజిల్లా మనవడిని, అల్లుడ్ని.. అంటూ ప్రసంగం ప్రారంభించి 'ఊహ తెలిసే సరికి మా తాత విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, మహానాయకుడు నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నారని, తాను నిక్కర్లు వేసుకునే సమయంలోనే తన తండ్రి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఏపీని ప్రపంచ చిత్రపటంలో నిలిపారని గుర్తుచేశారు. తాత ఆశయం, తండ్రి అడుగుజాడల్లో ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి ప్రవేశించి గ్రామాలను అభివృద్ధి చేయటం తప్పా అని ప్రశ్నించారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూసేలా ప్రగతి మార్గంలో పయనింపచేయటం తాను చేసిన నేరమా అని నిలదీశారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చే సమయంలో అవినీతిపరుల భరతం పడతానని ప్రగల్భాలు పలికారని, అయితే నేడు అలాంటివారినే చంకనెత్తుకుని అభివృద్ధి కారకులే లక్ష్యంగా దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. మోదీ అవినీతి పరుల్ని అరెస్టు చేయాలంటే జగన్‌ను ముందుగా అరెస్టు చేయాల్సి ఉందని, అయితే ఆయన తన పక్కనే ఉన్నా మోదీ ఎందుకు స్పందించటంలేదో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కుటుంబంపై నిందలు మోపుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీసే పని మానుకుని జగన్ డ్రామాలాడుతున్నారని విమర్శించారు. కోడి కత్తి కేసును ఎన్ఐఏకు అప్పగించడంతో మోదీ, షాలతో కలసి నడుపుతున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఇక ఆవు, అంబులెన్స్ డ్రామాతో జగన్ అభాసుపాలయ్యారని విమర్శించారు. కుల, మత, ప్రాంతాల పేరుతో ఏపీలో చిచ్చు రగిలించేందుకు ఢిల్లీ పెద్దలతో కలసి పన్నుతున్న కుతంత్రాలు తెలుగువారి ఐక్యత ముందు కొట్టుకుపోతాయని హెచ్చరించారు. ప్రత్యేక హోదా కోసం టీడీపీ ఎంపీలు పోరాడుతుంటే కేసులు, ఐటీ, ఈడీ దాడులతో బెదిరిస్తున్నారని, ఇలాంటి దాడులకు బెదిరే ప్రసక్తే లేదన్నారు. ఎస్పీ, బీఎస్పీ పొత్తు ఖరారైన నేపథ్యంలో అఖిలేష్ యాదవ్‌పై సీబీఐ కేసులు బనాయించారని ఆరోపించారు. సోము వీర్రాజుతో ముఖ్యమంత్రి చంద్రబాబును తెలుగులో తిట్టించి హిందీలో అనువదించుకుని మోదీ రాక్షసానందం పొందుతున్నారని మండిపడ్డారు. మోదీ కుట్రలు తెలుగువారి ఎదుట సాగవన్నారు. వచ్చే ఎన్నికల్లోబీజేపీ, వైసీపీ నేతలు ఓట్లడిగేందుకు వస్తే వారిని సాదరంగా ఆహ్వానించి భోజనం పెట్టి ఏపీకి ప్రత్యేక హోదా ఎప్పుడిస్తారని నిలదీయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏపీలో 25 ఎంపీ సీట్లు తెలుగుదేశం పార్టీ గెలుచుకునేలా కృషి చేస్తే దేశ ప్రధానిని సీఎం చంద్రబాబు నిర్దేశిస్తారని ఏపీకి హోదాతో పాటు హామీలన్నీ సాధిస్తారని స్పష్టం చేశారు.

అన్ని రాష్ట్రాలు అనుసరించే స్థాయికి ఏపీ

కేంద్రం తక్షణం డీపీఆర్ ఆమోదించి, నిధులివ్వాలి

• మార్చిలో పోలవరం రికార్డును తిరగరాద్దాం • ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

పోలవరం, జనవరి 7: గతంలో పశ్చిమ బంగ రాష్ట్రం ఈ రోజు ఒక ఆలోచన చేస్తే, రేపు దేశం అదే ఆలోచన చేస్తుందనే నానుడి ఉండేదని, అయితే ఆంధ్రప్రదేశ్ ఈ రోజు ఏంచేస్తే రేపు దేశంలోని అన్ని రాష్ట్రాలు అనుసరించే స్థాయికి రాష్ట్రం చేరుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రస్తుతం పోలవరంలో సాధించిన గిన్నిస్ రికార్డును తిరగరాసి మార్చిలో 65వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు వేసే విధంగా కృషిచేయాలని కాంట్రాక్టు సంస్థకు సూచించారు. జాతి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పోలవరం ప్రాజెక్టు సవరించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను తక్షణం కేంద్రం ఆమోదించి, నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని చంద్రబాబు డిమాండుచేశారు. పోలవరం ప్రాజెక్టుకు గిన్నిస్ బుక్‌లో స్థానం లభించిన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో ఏర్పాటుచేసిన బహిరంగసభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. అందరి సహకారం, సమిష్టి కృషితోనే ఈ రికార్డు సాధ్యమయ్యిందన్నారు. రెండు ప్రపంచ రికార్డులు సాధించిన అరుదైన మహా క్రతువులో భాగస్వాములయ్యే అవకాశం లభించడం చాలా అరుదుగా లభిస్తుందన్నారు. వారందరినీ అభినందిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్రానికి 670 అవార్డులు వచ్చాయని, అయినా పోలవరం అవార్డు ఇచ్చినంత ఆనందం మరేదీ ఇవ్వలేదన్నారు. దీన్నిబట్టి ఈ ప్రాజెక్టుపై తనకు ఎంత ప్రేమ ఉందో అర్థంచేసుకోవచ్చన్నారు. ఇది రైతుల ప్రాజెక్టని, రాష్ట్రానికి జీవనాడి అయిన ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రంలో కరవు ఉండదన్నారు. 2015 నుండి సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని, 84సార్లు వర్చువల్ ఇన్‌స్పెక్షన్స్ చేశానని, 30వ సారి ప్రత్యక్షంగా పోలవరంలో పర్యటించినట్టు చెప్పారు. ప్రాజెక్టు పనులు నెమ్మదిగా జరుగుతుండడంతో కోపం వచ్చిందని, ఆ కోపాన్ని కసిగా మార్చుకుని అన్ని చర్యలు తీసుకోవడంతో పనుల వేగం పెరిగిందన్నారు.పట్టిసీమ ఎత్తిపోతల పథకం కారణంగా కృష్ణాజిల్లాలో రూ.44 వేల కోట్ల విలువైన పంటలు ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచిందన్నారు. అలాగే కృష్ణాలో మిగులు జలాలను రాయలసీమకు అందించడంవల్ల అనంతపురం జిల్లాలో వ్యవసాయం అభివృద్ధి చెందిందని, అలాగే ఆ జిల్లాకు కియో మోటార్స్ ఫ్యాక్టరీ కూడ వచ్చిందన్నారు. ఈ ఏడాదిలోనే కియో తొలి కారు రోడ్డుపైకి రానుందన్నారు. ఇప్పటివరకు తమ ప్రభుత్వం 62 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిందని, 17 ఇప్పటికే ప్రారంభించామని, ఏడు ప్రాజెక్టులు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. ఈ ఏడాది జూన్ నాటికి గ్రావిటీ ద్వారా పోలవరం కుడి, ఎడమ కాలువల ద్వారా నీరందిస్తామని, ఈ ఏడాది ఆఖరుకు ప్రాజెక్టులో అన్ని విభాగాలు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వం డీపీఆర్‌ను ఆమోదించి నిధులు ఇవ్వాలని డిమాండుచేస్తున్నామని, కేంద్రం సహకరించకపోయినా నిర్మాణంలో ముందుకు వెళతామన్నారు. భవిష్యత్తులో వడ్డీతో సహా ఈ నిధులు వసూలుచేస్తామని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు.



గిన్నిస్ రికార్డు స్థాపన పైలాన్ ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం 'ఎన్టీఆర్'

• గౌతమీపుత్ర శాతకర్ణితో తల్లి రుణం తీర్చుకున్నా

• ఇప్పుడు తండ్రి రుణం తీర్చుకుంటున్నా

• నిమ్మకూరులో సినీ నటుడు నందమూరి బాలకృష్ణ



నిమ్మకూరులో మాట్లాడుతున్న బాలకృష్ణ, పక్కన నటి విద్యాబాలన్, ఉపసభాపతి బుద్ధప్రసాద్

పామర్రు, జనవరి 7: చరిత్రకు సాక్షీభూతుడైన దివంగత నందమూరి తారక రామారావు జీవితంపై తాను తీసిన ఎన్టీఆర్ చిత్రం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం కాగలదని ప్రముఖ సినీ నటుడు, హిందూపురం శాసనసభ్యుడు, ఎన్టీఆర్ తనయుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. ఎన్టీఆర్ జీవితచరిత్రలో తొలి భాగంగా కథానాయకుడు సినిమా ఈ నెల 9వతేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం ఎన్టీఆర్ స్వగ్రామమైన కృష్ణాజిల్లా పామర్రు మండలం నిమ్మకూరు గ్రామానికి బాలకృష్ణ వచ్చారు. తొలుత గ్రామంలోని తన తల్లిదండ్రులైన ఎన్టీఆర్, బసవ తారకం విగ్రహాలకు పూలమాలలు వేసి ఎన్టీఆర్ బయోపిక్ చిత్ర స్క్రిప్ట్‌ను వారి పాదాల చెంతన పెట్టి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం టీటీడీ దత్తత దేవాలయమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ పాత్రికేయులతో మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర రంగంతో పాటు రాజకీయ రంగంలో ఎన్టీఆర్ చరిత్ర సృష్టించారన్నారు. అటువంటి మహనీయుడు ఎన్టీఆర్‌కు ఎవ్వరూ సాటి రారన్నారు. ఆయనకు ఆయనే సాటి అన్నారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణకు నిలువుటద్దం ఎన్టీఆర్ అన్నారు. భారతదేశాన్ని ఏకఛత్రాధిపత్యంగా పాలించిన గౌతమీపుత్ర శాతకర్ణి చిత్రంతో తల్లి రుణం తీర్చుకున్న తాను ఎన్టీఆర్ బయోపిక్‌తో తన దేవుడైన తండ్రి రుణాన్ని తీర్చుకోవడం జరుగుతుందన్నారు. రెండు భాగాలుగా తీసిన ఎన్టీఆర్ కథానాయకుడు, ఎన్టీఆర్ మహానాయకుడు చిత్రాలు భవిష్యత్తుకు దిక్సూచిగా ఉంటాయన్నారు. క్రీస్తు పూర్వం, క్రీస్తు శకంలా రాజకీయ రంగంలో ఎన్టీఆర్‌కు ముందు, ఎన్టీఆర్ తర్వాత అనే రాజకీయ శకం అవిర్భవించిందన్నారు. బసవతారకం పాత్ర పోషించిన నటి విద్యాబాలన్ మాట్లాడుతూ తెలుగు చిత్ర పరిశ్రమకు ఆరాధ్యుడైన ఎన్టీఆర్ సతీమణి పాత్ర చేయడం తన పూర్వ జన్మ సుకృతమన్నారు. దివంగత నందమూరి హరికృష్ణ పాత్రదారుడైన నందమూరి కల్యాణ్‌రామ్, దివంగత మాజీ మంత్రి, గాంధేయవాది మండలి వెంకట కృష్ణారావు పాత్ర ధారుడైన శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్, దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కరరెడ్డి పాత్రదారుడైన ఆర్టీసీ చైర్మన్ వర్ల రామయ్య మాట్లాడుతూ ఈ చిత్రంలో తాము నటించడం దైవకృపగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ శాసనసభ్యురాలు ఉప్పులేటి కల్పన తదితరులు పాల్గొన్నారు.

వీధి నాయకుడి తీరులో మోదీ విమర్శలు

• టీడీపీ అధికార ప్రతినిధి యామినీ శర్మ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 7: ముఖ్యమంత్రి చంద్రబాబుని ఉద్దేశించి ప్రధాని మాట్లాడిన మాటలు చూస్తుంటే ఆయనకు బుద్ధి మాంద్యం ఉందేమోనన్న అనుమానం కలుగుతోందని, ఆయన చేస్తున్న వ్యాఖ్యలు ఒక వీధి నాయకుడి మాటల కన్నా దారుణంగా ఉన్నాయని టీడీపీ అధికార ప్రతినిధి యామినీ శర్మ మండిపడ్డారు. విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో ఆమె విలేఖర్లతో మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్స్‌ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వంపై, సీఎం చంద్రబాబు నాయకత్వంపై దిగజారుడు ఆరోపణలు చేయడం ప్రధాని స్థాయి వ్యక్తికి తగదని హితవు పలికారు. దేశంలోనే ఉత్తమ పనితీరు కనబర్చిన ఏపీకి కేంద్రమే 630కి పైగా అవార్డులు ఇచ్చిందని, అవేవీ గమనించకుండా రాష్ట్రంలో ఏమీ జరగడం లేదనడం ఆయనలోని మానసిక జాడ్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.

హోదాపై జగన్ డ్రామాలు

• పీసీసీ ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 7: ఆంధ్రప్రదేశ్‌కు సంజీవని లాంటి ప్రత్యేక హోదాపై వైకాపా అధ్యక్షులు జగన్ డ్రామాలు ఆడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ప్రజల చెవుల్లో పూలు పెట్టాలని ప్రయత్నం చేయడం శోచనీయం, దురదృష్టకరమని పీసీసీ ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి ధ్వజమెత్తారు. ఆంధ్రరత్న భవన్‌లో సోమవారం మీడియాతో మాట్లాడారు. ఒకవైపు ప్రత్యేక హోదా ఇస్తామంటున్న కాంగ్రెస్‌ను జగన్ విమర్శిస్తాడు. మరోకవైపు ప్రత్యేకహోదా ముగిసిన అధ్యాయమని చెప్పేసిన బీజేపీని పల్లెత్తు మాట అనడని ఎద్దేవా చేశారు. అనంతపురం, గుంటూరు, కర్నూలు, హైదరాబాద్‌ల్లో జరిగిన సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఫైల్‌పై మొదటి సంతకమని రాహుల్ స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు.

నగర పంచాయతీ, పురపాలక సంఘాల ఏర్పాటుకు మార్గదర్శకాలు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 7: రాష్ట్రంలో కొత్తగా నగర పంచాయతీలు, పురపాలక సంఘాల ఏర్పాటుకు మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం జారీ చేసింది. నగర పంచాయతీల ఏర్పాటుకు 20 -40 వేల మంది జనాభా, చదరపు కిలోమీటరుకు 400 మంది జన సాంద్రత, 40 లక్షల రూపాయల వార్షికాదాయం ఉండాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పురపాలక సంఘాలకు సంబంధించి 40 వేల నుంచి 3లక్షల మంది జనాభా, చదరపు కిలోమీటరుకు 500 జనాభా, 60 లక్షల రూపాయల పైబడి ఆదాయం ఉంటే వాటిని పురపాలక సంఘాలుగా ప్రకటించే వీలుంటుంది. ఈ ప్రక్రియలో జిల్లా కలెక్టర్లు, పురపాలక శాఖ, పంచాయతీరాజ్‌శాఖకు కొన్ని అనుమతుల మంజూరు అధికారాలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఆరుగురు డీఎస్పీల బదిలీ

విజయవాడ (క్రైం), జనవరి 7: రాష్ట్రంలో మరో ఆరుగురు డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న బీ శ్రీభవానీ హర్షకు తిరుపతి ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్‌లో పోస్టింగ్ కల్పించారు. తిరుపతి స్పెషల్ బ్రాంచీ డీఎస్పీ రవి మనోహరాచారిని కడప ఎస్‌బీ డీఎస్పీగా బదిలీ చేశారు. చిత్తూరు సీసీఎస్-2 డీఎస్పీ వీ అల్లాభక్షును తిరుపతి ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్ డీఎస్పీగా బదిలీ చేశారు. నెల్లూరు ఎస్సీ, ఎస్టీ సెల్-2 డీఎస్పీ కే శ్రీనివాసాచారిని ఒంగోలు ఎస్సీ ఎస్టీ సెల్‌కు బదిలీ చేశారు. ఒంగోలు డీసీఆర్‌బీ డీఎస్పీ మరియదాసును నెల్లూరు ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా బదిలీ చేశారు. చిత్తూరు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ నారాయణ స్వామి రెడ్డిని గుంతకల్ రైల్వే డీఎస్పీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

భవిష్యత్తులో విద్యుత్ చార్జీల తగ్గింపు

• సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సీఎం ఆదేశం

• నేడు కర్నూలు అల్ట్రా మెగా సోలార్ పార్క్ జాతికి అంకితం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 7: ఇంధన వనరుల సామర్థ్యం పెంపు, మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రంగా రూపుదిద్దుకున్న ఏపీ, భవిష్యత్తులో విద్యుత్ చార్జీలను తగ్గించే అంశంపై దృష్టి సారించింది. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంధన శాఖ అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించారు. కర్నూలు జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ప్రపంచంలోనే 3వ అతిపెద్ద సోలార్ ప్రాజెక్టును మంగళవారం ముఖ్యమంత్రి జాతికి అంకితం చేయనున్నారు. కర్నూల్ అల్ట్రా మెగా సోలార్ పార్క్ ద్వారా వెయ్యి 0 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. ఈ సందర్భంగా ఇంధన శాఖ అధికారులతో ఆయన సోమవారం టెలీకాన్ఫరెన్సులో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సుస్థిర విద్యుత్ సరఫరా, స్థిర విద్యుత్ చార్జీలను రాష్ట్రంలో అమలు చేసేందుకు వీలుగా ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రానున్న 5 నుంచి 10 సంవత్సరాల్లో విద్యుత్ చార్జీల పెంపు లేకుండా చూడాలన్నారు. దీని వల్ల 1.6 కోట్ల మంది విద్యుత్ వినియోగదారులకు మేలు జరగడమే కాకుండా, పారిశ్రామిక ప్రగతి వేగం పుంజుకుంటుందన్నారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, ఇంధన సామర్థ్యం పెంపు, సరఫరా, పంపిణీలో నష్టాలను గణనీయంగా తగ్గడం వంటి వివిధ చర్యల ద్వారా విద్యుత్ ఉత్పత్తి పెరిగిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెరగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రెన్యూవబుల్ ఎనర్జీలో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉందని, 7 గిగా వాట్ల సామర్థ్యాన్ని సమకూర్చుకుందన్నారు. వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన రెండో దశ విద్యుత్ సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా అదనపు భారం మోపకుండా 1.6 కోట్ల మందికి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెంచుకూడదన్న లక్ష్యంతో రెండో విడత సంస్కరణలు చేపట్టానని గుర్తుచేశారు. విద్యుత్ చార్జీలు పెంచాలని కేంద్రం ఒత్తిడి తీసుకువచ్చినా అందుకు తలొగ్గలేదని ఆయన స్పష్టం చేశారు.రెన్యూవల్ ఎనర్జీ, విద్యుత్ సరఫరా, పంపిణీల్లో నష్టాలను తగ్గించడం వంటి అంశాలపై దృష్టి సారించడం ద్వారా నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేయగలుగుతున్నామన్నారు. గత నాలుగు సంవత్సరాల్లో విద్యుత్ చార్జీలను పెంచలేదని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఒకపైసా కూడా పెంచలేదని గుర్తు చేశారు. దేశంలోనే ఏపీ ఈ విషయంలో చరిత్ర సృష్టించిందన్నారు. అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా వల్ల ప్రజల్లో సంతోషం వ్యక్తం అవుతోందని, ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను కూడా పెంచిందన్నారు. భవిష్యత్తులో విద్యుత్ చార్జీలను తగ్గించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. రెన్యూవబుల్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇచ్చానని, 2014లోనే సౌర విద్యుత్ యూనిట్ ధర 6 నుంచి 2 రూపాయలకు తగ్గుతుందని అంచనా వేశానన్నారు. తన అంచనా నిజమైందన్నారు. ఇప్పటికే 1900 మెగావాట్ల మేర సౌర విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని, 2020 నాటికి మరో 2100 మెగావాట్ల సౌర విద్యుత్ అందుబాటులోకి వస్తుందన్నారు. విద్యుత్ వినియోగదారులకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటున్న ఏపీఈఆర్‌సీని అభినందించారు.

1000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి 7143 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. 24 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల సంవత్సరానికి కర్బన ఉద్గారాల ఉత్పత్తి పరిమాణం 19.92 లక్షల టన్నుల మేర తగ్గుతుంది. 940 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుందని ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి కళా వెంకటరావు, చీఫ్ సెక్రటరీ అనిల్ చంద్ర పునేఠా, ఇంధన శాఖ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'జలధార'!

• రూ. 22 వేల కోట్లతో ఇంటింటికీ సురక్షిత నీరు

• కోస్గిలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 7: గ్రామాల్లోని ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీటిని సరఫరా చేసే జలధార ప్రాజెక్టు మంగళవారం ప్రారంభం కానుంది. దీంతో గ్రామాల్లో మంచినీటి సమస్య ఉండదు. వేసవిలోనూ ఇకపై నీటి ఎద్దడి సమస్య లేకుండా ఇళ్లకే నీరు సరఫరా కానుంది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి లోకేష్ ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టును రూ.22,300 కోట్ల రూపాయలతో చేపట్టారు. దీనిని కర్నూల్ జిల్లా కోస్గి గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని 48,363 నివాస ప్రాంతాలకు మంచినీరు అందించేందుకు వాటర్ గ్రిడ్‌ను ఈ జలధార ప్రాజెక్టు కింద చేపడుతున్నారు. ఇప్పటికే ప్రతి ఇంటికీ నీరు అందించేందుకు వీలుగా టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా, పనులు ప్రారంభమయ్యాయి. సంక్రాంతి తరువాత మొదటి దశలో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయి ద్వారా మంచినీరు అందించే పనులు యుద్ధప్రాతిపదికన అధికార యంత్రాంగం చేపడుతోంది. 10 జిల్లాలకు టెండర్లను ఇప్పటికే పిలిచారు. చిత్తూరు, తూర్పు గోదావరి, శ్రీకాకుళం జిల్లాలకు ఇంకా టెండర్లు పిలవాల్సి ఉంది. టెండర్లు పూర్తయిన జిల్లాల్లో వచ్చే వేసవి నాటికి నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏపీలో దాదాపు 70శాతం గ్రామీణ ప్రాంతాలే. కొన్ని జిల్లాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంటోంది. దీనికి శాశ్వత పరిష్కారమే జలధార ప్రాజెక్టు. వాటర్ గ్రిడ్ ఏర్పాటు ద్వారా ఈ సమస్యలను అధిగమించవచ్చని భావించి ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి, మొదటి దశ పనులను రూ.15 వేల కోట్లతో చేపట్టారు. 2040 నాటి జనాభా అవసరాలను పరిగణలోకి తీసుకుని ప్రాజెక్టును రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల గ్రామాల్లోని నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

'మా ఊరి బాట'ను ప్రారంభించనున్న సీఎం

250 మంది జనాభా ఉన్న ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యాన్ని మా ఊరి బాట కింద రాష్ట్ర ప్రభుత్వం కల్పించనుంది. నాణ్యమైన రహదారులు, వంతెనల నిర్మాణం ద్వారా రహదారుల కోసం ప్రజల ఇబ్బందులను అధిగమించేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టారు. 4324 కోట్ల రూపాయలతో ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టుమెంట్ బ్యాంక్ రుణంతో అంతర్జాతీయ ప్రమాణాలతో మా ఊరి బాట కార్యక్రమాన్ని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం చేపట్టింది. ఇప్పటి వరకూ 3711 కోట్ల రూపాయలతో 3278 గ్రామాలకు పక్కా రహదారులు నిర్మించారు. 2360 కిలోమీటర్ల మేర తారు రోడ్లు, 21 వంతెనలు నిర్మించారు. కర్నూలు జిల్లా కోస్గిలో గ్రామంలోనే ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు.



విన్యాసాలను ప్రారంభిస్తున్న ఈఎన్‌సీ చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ పవార్

రక్షణ దళాల సంయుక్త నావికా విన్యాసాలు

వారం రోజుల పాటు నిర్వహణ

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 7: రక్షణ శాఖకు చెందిన ఎయిర్ డిఫెన్స్, తూర్పు నౌకాదళం సంయుక్తంగా నావికా విన్యాసాలను తూర్పు నౌకాదళం చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ ఎంఎస్ పవార్ ఆదివారం ప్రారంభించారు. వారం రోజుల పాటు జరిగే ఈ నావికా విన్యాసాల్లో ఒక అధికారితో పాటు ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ కళాశాలకు చెందిన 28వ ఎయిర్ డిఫెన్స్ రెజిమెంట్ నుంచి ముగ్గురు, తూర్పునౌకాదళం నుంచి ఇద్దరు పాల్గొంటున్నారు. రక్షణ శాఖలో సిబ్బంది ఉద్యోగుల శరీర దారుఢ్యం పెంపు, వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎదురయ్యే సవాళ్లను దీటుగా ఎదుర్కొనే విధంగా తీర్చిదిద్దేందుకు ఈ విన్యాసాలు దోహదం చేయనున్నాయి. ఈ విన్యాసాల్లో భాగంగా ఆరుగురు సభ్యుల బృందం ఏడు రోజుల పాటు జే-24 పడవలో విశాఖలో బయలుదేరి 484 కిలోమీటర్ల మేర ప్రయాణం చేస్తారు. ఈ నెల 9న ఒడిశా రాష్ట్రం గోపాల్‌పూర్ తీరానికి చేరుకుంటారు. ఒక రోజు విశ్రాంతి అనంతరం తిరిగి 10వ తేదీన బయలుదేరుతారు. తిరుగు ప్రయాణంలో ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ లెఫ్టినెంట్ జనరల్ శైలేంద్ర సింగ్ ప్రారంభిస్తారు.

బ్రాహ్మణ సొసైటీని బ్యాంకుగా తీర్చిదిద్దుతాం

★ ఏబీసీసీఎస్ ద్వారా రూ.32 కోట్ల రుణం

★ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మైలవరపు బాలసుబ్రహ్మణ్య శర్మ వెల్లడి

తిరుపతి, జనవరి 7: ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో ప్రస్తుతం 45వేల మంది సభ్యులున్నారని దీనిని లక్షకు పెంచి సొసైటీని బ్రాహ్మణ బ్యాంకుగా తీర్చిదిద్దేదిశగా కృషి చేస్తున్నట్లు సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు మైలవరపు బాలసుబ్రహ్మణ్య శర్మ చెప్పారు. సోమవారం తిరుపతిలో ఏపీబీసీసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమ సంస్థను, కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీని ఏర్పాటు చేసిందన్నారు. వీటి ద్వారా బ్రాహ్మణ విద్యార్థులకు ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు వివిధ పథకాల కింద రుణాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా సొసైటీ అందిస్తున్న పథకాల గురించి క్షేత్రస్థాయిలో వివరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 200 మంది స్వయం సేవకులను ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక యాప్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. బ్రాహ్మణులు ఆర్థికంగా స్థిరపడాలన్న సంకల్పంతో సొసైటీ ద్వారా సొంత వాహనాలను సమకూర్చుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 30 మంది లబ్ధిదారులకు మారుతీ స్విఫ్ట్ డిజైర్ కార్లు సబ్సిడీపై పంపిణీ చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11,300 మంది లబ్ధిదారులకు ఇప్పటి వరకు రూ. 32కోట్లు రుణాలను అందించామన్నారు.

జన్మభూమి అధికారులకు నిరసనల సెగ

గార్లదిన్నె, జనవరి 7: చెరువుకు నీరివ్వాలంటూ జన్మభూమి అధికారులను ముకుందాపురం గ్రామస్తులు అడ్డుకున్నారు. అధికారులు గ్రామంలోకి రాకుండా రోడ్డుపై ముళ్లకంప వేసి నిరసన తెలిపారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ముకుందాపురంలో సోమవారం జన్మభూమి కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు రాగా శివారులోనే ప్రజలు అడ్డుకున్నారు. రోడ్డుకు అడ్డంగా ముళ్లకంప వేసి బైఠాయించారు. చెరువుకు నీరిస్తామని హామీ ఇస్తేనే ఊళ్లోకి రానిస్తామని భీష్మించారు. దీంతో ఎట్టకేలకు హెచ్చెల్సీ డిఇ కుమారస్వామి అక్కడికి చేరుకుని ఈనెల 10 నుంచి నీరు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు ఆందోళన విరమించారు.

హైదరాబాద్‌లో శ్రీనివాస కల్యాణం రద్దు

అక్రమ వసూళ్లకు, శ్రీనివాసం కల్యాణం

ట్రస్టుకు ఎలాంటి సంబంధం లేదు

తిరుపతి, జనవరి 7: టీటీడీ శ్రీనివాస కల్యాణం ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించతలపెట్టిన శ్రీనివాస కల్యాణాన్ని రద్దు చేస్తున్నట్లు టీటీడీ పిఆర్వో డాక్టర్ రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీటీడీ 2018, అక్టోబర్ 28న ఆర్గనైజర్ కేటగిరి కింద శ్రీ దత్తగిరి మహరాజ్ ఛారిటుబల్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం నిర్వహించాలని నిర్ణయించింది. ఆ తరువాత స్వామివారి కల్యాణం ఫిబ్రవరి 17వ తేదీకి వాయిదాపడింది. ఈ క్రమంలో భక్తుల నుండి విరాళాలను ఆహ్వానిస్తూ శ్రీ శ్రీనివాస కల్యాణం ట్రస్టు కార్యదర్శి బి.కృష్ణంరాజు పేరుతో కరపత్రాలు, లేఖలను ముద్రించడం టీటీడీ దృష్టికి వచ్చింది. విరాళాలందించిన వారికి తిరుమలలో ఎల్ 1 దర్శనం కల్పించడంతోపాటు ప్రసాదాలు, శేషవస్త్రం, అమ్మవారి వస్త్రం, పట్టుపంచ అందిస్తామని కరపత్రాల్లో పేర్కొన్నారు. దాతలందరినీ కల్యాణం జరిగే వేదికపై కూర్చోబెడతామని తెలిపారు. శ్రీనివాస కల్యాణం నిబంధనలను సదరు ఆర్గనైజర్ అతిక్రమించడంతో ఫిబ్రవరి 17న కల్యాణాన్ని టీటీడీ రద్దు చేసినట్లు తెలిపారు. శ్రీనివాస కల్యాణాల సందర్భంగా భక్తుల నుంచి ఎలాంటి విరాళాలు స్వీకరించడం లేదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. శ్రీనివాస కల్యాణం ట్రస్టుకు భక్తులు అందించే విరాళాలతో టీటీడీకి ఎలాంటి సంబంధం లేదని తెలియజేశారు.

వ్యవస్థలను నిర్వీర్యం చేసిన మోదీ

★ దేశవ్యాప్త సమ్మెకు సహకరించాలి

★ ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి

గుంటూరు, జనవరి 7: కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రజా వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని, కార్పొరేట్ శక్తులకు మేలు చేస్తూ కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయుసి) జాతీయ అధ్యక్షుడు జీ సంజీవరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం గుంటూరులోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో సంజీవరెడ్డి మాట్లాడుతూ మోదీ సర్కార్ అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 8,9 తేదీల్లో దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామని తెలిపారు. సార్వత్రిక సమ్మెలో 12 కేంద్ర కార్మిక సంఘాలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. కనీస వేతనాలను తక్షణమే సవరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వ, కార్మిక వ్యతిరేక విధానాలను మార్చుకోకపోతే దేశవ్యాప్తంగా ఉన్న కార్మిక, ఉద్యోగవర్గాలు రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని సంజీవరెడ్డి విజ్ఞప్తిచేశారు. విలేఖర్ల సమావేశంలో ఐఎన్‌టీయుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విస్సా క్రాంతికుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి సిహెచ్ జయరాంబాబు, ఏఐటీయుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి రాధాకృష్ణ, సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి


డిస్కంల ప్రతిపాదనలు పరిశీలిస్తాం

★ వినియోగదారులకు ఇబ్బందులు రానీయం ★ ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ భవానీప్రసాద్

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 7: విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీ ఆర్‌ఈసీ) చైర్మన్ జస్టిస్ జీ.భవానీప్రసాద్ అన్నారు. విద్యుత్ చార్జీలు, 2019-20 సంవత్సరానికి సంబంధించి రీటైల్ సరఫరా వ్యాపారానికి సంబంధించి సమగ్ర ఆదాయ ఆవశ్యకత, చార్జీల ప్రతిపాదనలపై ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన ముఖ్య ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు ఎటువంటి భారం లేకుండా చూస్తామని, డిస్ట్రిబ్యూషన్ కంపెనీల సమస్యలకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీనిచ్చారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలోనే విశాఖలోనే తొలి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

తరువాత విజయవాడ, హైదరాబాద్‌లో నిర్వహిస్తామన్నారు. వ్యక్తిగత సంబంధాలు చాలా తక్కువగా ఉండే న్యాయ వ్యవస్థ నుంచి నిత్యం ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండే విద్యుత్ వ్యవస్థకు సంబంధించిన బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి గత నాలుగున్నరేళ్లలో తనపట్ల చూపిన ఆదరాభిమానులకు ముగ్ధుడినవుతున్నానన్నారు. తాను చేసిన పనిని తప్పుబట్టారని, నిజాయితీ, నిబద్ధత గురించి ప్రశ్నించలేదన్నారు. ప్రకృతి ఎదురుతిరిగి ఆర్థిక వనరులు తక్కువై వ్యవస్థ సతమతమైనపుడు స్థైర్యాన్ని కోల్పోకుండా విద్యుత్ ఉద్యోగులు చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. హుదూద్, తిత్లీ, పెథాయ్ తుపాన్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న ఉద్యోగుల సేవలు ఎంత ప్రశంసించినా తక్కువేనన్నారు. తన పదవీ కాలం ఈ ప్రజాభిప్రాయసేకరణే చివరది అవుతుందన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ భవానీ ప్రసాద్

విద్యుత్ వ్యవస్థకు సంబంధించి తనకు ఎటువంటి అనుభవం లేదని, అయినా ఇంధన ముఖ్యకారదర్శి చేసిన సిఫారసులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనకు ఈ అవకాశం కల్పించారన్నారు. ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్ హెచ్‌వై దొర మాట్లాడుతూ తమ సంస్థ పరిధిలో 75 లక్షల ఎల్ఇడీ బల్బులను పంపిణీ చేయగా, ఇందులో ఐదు నుంచి ఆరు శాతం మేర బల్బులు మాత్రమే దెబ్బతిన్నాయన్నారు. వీటిని కూడా మార్పు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో పది లక్షల మేర ఎల్ఇడీ బల్బుల పంపిణీ చేశామన్నారు. సింగిల్ బల్బు కనెక్షన్ల విధానమనేది లేదని వినియోగదారులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మండలాల వారీగా బల్బుల మార్పు జరుగుతుందన్నారు. విద్యుత్ చౌర్యం తక్కువగానే ఉందని, దీని నష్టాలు సైతం 5.13 శాతానికి తగ్గాయన్నారు. ఏపీ విద్యుత్ నియంత్రణమండలి సభ్యులు పీ రామ్మోహన్, పి.రఘు పలు స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలు, కార్మిక సంఘాల ప్రతినిధులు ఇచ్చిన వినతులను స్వీకరించారు.

:: బెల్లం రైతుల నిరసనలతో ఆరంభం

బెల్లం తయారీ, విక్రయ కేంద్రం అనకాపల్లి బెల్లం రైతుల నిరసనలతో ప్రజాభిప్రాయసేకరణ మొదలైంది. అయితే నియంత్రణమండలి వీరందర్ని లోపలకు అనుమతించడం, వారి నుంచి వినతులు స్వీకరించడంతో సమస్య సద్దుమణిగింది. బెల్లం క్రషర్లకు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేయాలని ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు.

క్రియాశీల రాజకీయాల్లోకి వస్తా

★ మూడు ప్రధాన పార్టీల నుంచి ఆహ్వానం ఉంది

★ సినీ, రాజకీయ విశ్లేషకుడు కత్తి మహేష్

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, జనవరి 7: రానున్న ఎన్నికల్లో ఏదో ఒక రాజకీయ పార్టీ తరపున క్రియాశీల రాజకీయాల్లోకి వస్తానని సినీ, రాజకీయ విశ్లేషకుడు కత్తి మహేష్ స్పష్టం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు రాజకీయాలలో ఆసక్తిగా ఉన్నానని, ఇకపై క్రియాశీలక రాజకీయాల్లో ఉండాలని భావిస్తున్నానన్నారు. మూడు ప్రధాన పార్టీల నుంచి తనకు ఆహ్వానం ఉందన్నారు. తన వాచాలత్వాన్ని ఎవరు ఆహ్వానిస్తారో చూస్తున్నానన్నారు. గత ఆరు నెలలుగా తాను నగర బహిష్కరణను అనుభవిస్తున్నానని అన్నారు. అందుకే విజయనగరం, శ్రీకాకుళం మినహాయించి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో తిరిగానని, ప్రజలతో మమేకమైయ్యానన్నారు. దీంతో తనకు రాజకీయ పరంగా మరింత జ్ఞానం కలిగిందన్నారు. నా అభిరుచికి అనుగుణంగా ఉండే పార్టీలో చేరుతానని ఈ మాసాంతానికి ఒక నిర్ణయానికి వస్తానని చెప్పారు. మీలాంటి వారు దళితులగురించి పట్టించుకోరా అన్న ప్రశ్నకు మందకృష్ణ మాదిగ, అంబేద్కర్ పేరుతో ఏర్పడిన పార్టీలకు ఆర్థిక బలం లేకుండా తమ భావాలను ప్రచారం చేసుకోలేకపోతున్నారని భావిస్తున్నానన్నారు. ప్రస్తుతం ఎన్నికలకు తక్కువ సమయం ఉండటంతో ప్రయోగాలు చేయలేనన్నారు. అధికార పార్టీలో చేరుతారా అన్న ప్రశ్నకు, లేదని స్పష్టం చేశారు. ఎందుకంటే గత నాలుగు సంవత్సరాల్లో తెలుగుదేశం పార్టీ అభివృద్ధిని అరచేతిలో చూపించిందన్నారు. కాంగ్రెస్, టీడీపీ పొత్తుల గురించి మహేష్ ప్రస్తావిస్తూ రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించింది కాంగ్రెస్ అన్నారు. అందుకే ప్రజలు ఆంధ్ర, తెలంగాణాల్లో కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేశారన్నారు. అలాంటి పార్టీతో టీడీపీ పొత్తుపెట్టుకోవడం సరికాదని తన అభిప్రాయమన్నారు. 2019 రాష్ట్ర ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడంపై టీడీపీ నేత పునరాలోచిస్తారన్న నమ్మకం తనకు ఉందన్నారు. కాంగ్రెస్ కూడా టీడీపీ పొత్తుకు సంబంధించి పునరాలోచించే అవకాశం లేకపోలేదన్నారు. రాష్ట్రంలో దళిత పార్టీలు ప్రధాన రాజకీయ పార్టీలుగా లేవని, 2024 నాటికి వాటి ప్రాధాన్యత పెరుగుతుందని ఆయన అన్నారు. హక్కులను అణచివేసి మతాన్ని రక్షించుకోవాలన్న దోరణి సరికాదన్నారు. అయ్యప్ప స్వామి దర్శనం విషయంలో మహిళల హక్కులపై సుప్రీం కోర్టు సానుకూలంగా స్పందించిందని తెలిపారు. శబరిమలైలో ప్రశాంత వాతావరణం నెలకొనాలని తాను భావిస్తున్నానని, ఘర్షణ వాతావరణంలో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ప్రశాంతత ఉంటేనే భక్తుడు భగవంతుని దర్శించుకోగలడన్నారు. సుప్రీం కోర్టు తీర్పుపై కేరళ ప్రభుత్వం రివ్యూ పిటీషన్ వేసే అవకాశం లేదని, మహిళల ప్రవేశాన్ని నిరసిస్తూ, పవిత్రత దెబ్బతిందని భావిస్తున్న ఆధ్యాత్మిక సంస్థలైనా రివ్యూ పిటీషన్ వేయవచ్చని కత్తి మహేష్ తెలిపారు. టీటీడీ వంటి ఆధ్యాత్మిక సంస్థలో కళాకారులపట్ల వివక్ష తగదన్నారు.

సినీ నిర్మాత రాఘవేంద్రరావు వంటి వారి చిత్రాల నిర్మాణానికి కోట్లు ఇస్తూ, సామాన్య కళాకారులకు కనీస వసతులు కల్పించకపోవడం సరికాదన్నారు. దీనికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నదే తన ఉద్దేశ్యమని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు అన్యాయం చేస్తూనే ఉందని, కళాకారులను పట్టించుకోకుండా వ్యవహరిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

బాబును చూస్తే మోదీకి వణుకు

అవినీతి పుస్తకాన్ని జగన్ ఆవిష్కరించడం విడ్డూరం ★ మంత్రి నక్కా ఆనందబాబు

గుంటూరు, జనవరి 7: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని చూస్తే ప్రధాని నరేంద్రమోదీ భయంతో వణుకుతున్నారని, అందుకే ఇష్టానుసారం మాట్లాడుతున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఎన్డీయేతర పార్టీలను ఏకం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాన భూమికను పోషిస్తున్నారన్న అక్కస్సుతో మోదీ అర్థరహిత వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సోమవారం గుంటూరులోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాలివాటంలో మోదీ ప్రధాని అయ్యారని, రాష్ట్రానికి ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలకు తీరని ద్రోహం తలపెట్టారని విమర్శించారు. అసలు ఏపీ అభివృద్ధిపైనా, చంద్రబాబుపైనా విమర్శలు చేసే నైతిక హక్కు మోదీకి లేదన్నారు. 2014లో టీడీపీతో పొత్తుపెట్టుకోవడం వల్లనే ఏపీలో కార్యకర్తలే లేని బీజేపీ తరపున ఇద్దరు ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యేలు గెలిచారని గుర్తుచేశారు. బీజేపీ స్వార్థ ప్రయోజనాల కోసం అవినీతిపరుడైన జగన్‌తో అపవిత్రమైన పొత్తు పెట్టుకుని కాపురం చేస్తున్నారని విమర్శించారు. తమ పార్టీ వెన్నుపోటు పార్టీ అయినప్పుడు 1999, 2014లో ఎందుకు పొత్తు పెట్టుకున్నారంటూ నిలదీశారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు మరెక్కడా జరగడం లేదని, వ్యవసాయరంగంలో దేశ వృద్ధిరేటు కన్నా రాష్ట్ర వృద్ధిరేటు నాలుగు రెట్లు అధికంగా ఉందన్నారు. గుజరాత్‌కు మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న మోదీ ఏం వెలగబెట్టారంటూ ప్రశ్నించారు. బీజేపీకి దమ్ముంటే జగన్మోహనరెడ్డి కేసులను వేగంగా దర్యాప్తు చేయించాలని సవాల్ విసిరారు.



దొంగే దొంగ అన్నట్లుంది

అవినీతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నానంటూ జగన్మోహనరెడ్డి ప్రకటించడం దొంగే దొంగ అన్నంత విడ్డూరంగా ఉందని ఎద్దేవాచేశారు. ప్రతిపక్ష నేతకు ఆర్థికశాస్త్రంపై కనీస అవగాహన కూడా లేదని, నాలుగున్నరేళ్లలో రాష్ట్ర బడ్జెట్ ఎంత, అవినీతి జరిగిందని జగన్మోహనరెడ్డి చెబుతున్న మొత్తం ఎంత అంటూ నిలదీశారు. బెంగళూరులో 35 ఎకరాల్లో ప్యాలెస్, ఇడుపులపాయలో 1000 ఎకరాల్లో భవంతులు ఎలా కట్టారని నిలదీశారు. 2004లో రూ.73 లక్షలు ఉన్న జగన్ ఆస్తులు 2014 నాటికి వేల కోట్లకు ఎలా ఎగబాకాయని ప్రశ్నించారు. ఇంత తక్కువ సమయంలో ఇన్ని ఆస్తులు కూడగట్టడం అంబానీకి కూడా సాధ్యం కాలేదంటూ మంత్రి ఆనందబాబు ఎద్దేవా చేశారు.

17 నుంచి 20 వరకు అరకులో

సాహస పర్యటన నిర్వాహకుల సదస్సు

★ ముఖ్యఅతిథిగా హాజరుకానున్న సీఎం చంద్రబాబు

★ పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 7: సాహస పర్యటన నిర్వాహకుల సదస్సుకు ఆంధ్రప్రదేశ్ వేదిక కాబోతుంది. ఆంధ్రా ఊటీగా ప్రసిద్ధిగాంచిన అరకు ఇందుకు సిద్ధం అవుతుండగా, పర్యాటక రంగానికి విశేష ప్రోత్సాహం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు ప్రత్యేక సహకారాన్ని అందిస్తోంది. జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అగ్రస్థానంలో నిలపాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు అకాంక్షల మేరకు పర్యాటక శాఖ చేస్తున్న కసరత్తు వేగవంతమయింది. సంక్రాంతి వేడుకల తదుపరి ఈ నెల 17 నుండి 20వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరగనుండగా, ఇది రాష్ట్ర పర్యాటక రంగానికి మరింత ఊపును తీసుకురానుందని పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. సోమవారం సచివాలయంలో సదస్సు కార్యాచరణకు సంబంధించి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఏపీటీడీసీ ఎండి, ఏపీటీఏ సీఈఓ హిమాన్షు శుక్లా, సదస్సు సహ చైర్మన్ శేఖర్‌బాబు తదితరులు ఈ సమీక్షలో పాల్గొనగా, కార్యక్రమానికి స్వయంగా ముఖ్యమంత్రి హాజరయ్యే అవకాశం ఉన్నందున నిర్వహణకు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని మీనా అధికారులను ఆదేశించారు. మూడు రోజులు కార్యక్రమాల నేపథ్యంలో పారా మోటరింగ్, వాటర్ రోలర్, హాట్ ఎయిర్ బెలూనింగ్, కయాకింగ్, సైకిలింగ్, హైక్స్, జార్బ్ తదితర సాహస పర్యాటక అంశాల ప్రదర్శన ఉంటుందన్నారు. రోప్ యాక్టివిటీ, జీప్‌లైన్ వంటివి సదస్సు ప్రాంగణంనే జరగనుండగా మిగిలిన అంశాలు బహిరంగ ప్రదేశాల్లో నిర్వహిస్తారని మీనా వివరించారు. కడప జిల్లాలోని గండికోట రాష్ట్రానికి ప్రధాన సాహస పర్యాటక ప్రాంతం కాగా, హార్సీ హిల్స్, తలకోన, ఓర్వకల్లు, మహానంది, అరకు, మారేడుమిల్లి ప్రాంతాలు భూగోళపరమైన సాహస పర్యాటకానికి అనువైనవన్నారు. జల అధారిత సాహస క్రీడలకు అమరావతిలోని ఎన్టీఆర్ సాగర్, తాడిపత్రి రిజర్వాయర్, గోదావరి జలాలు అనువుగా ఉన్నాయని మీనా వివరించారు.

అన్నిరంగాల్లో మోదీ విఫలం

★ ప్రజలతో నేరుగా మాట్లాడ లేకే వీడియో కాన్ఫరెన్సుల డ్రామా

★ నల్లధనం వెలికితీస్తామని చతికిలపడ్డారు

★ ఆర్థిక నేరగాళ్లను విదేశాలకు సాగనంపారు

★ ఎన్టీఆర్ కుటుంబం గురించి మాట్లాడే నైతిక అర్హత ఆయనకు లేదు

★ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ధ్వజం

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 7: ప్రజలతో నేరుగా మాట్లాడే ధైర్యం ప్రధాని నరేంద్రమోదీకి లేదని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు విమర్శించారు. జనం నిరసనలకు భయపడి గుంటూరు పర్యటన రద్దు చేసుకున్నారని వ్యాఖ్యానించారు. దీంతో దొడ్డిదారిన కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్‌ల డ్రామా ఆడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి వచ్చేందుకు ముఖం చెల్లకే ఈ డ్రామాలాడుతున్నారని దుయ్యబట్టారు. రాఫెల్ కుంభకోణం నుంచి దేశప్రజల దృష్టిని మళ్లించేందుకు మోదీ ఎత్తుగడ వేస్తున్నారని సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు.

రూ 43వేల కోట్ల రాఫెల్ స్కామ్‌పై మోదీ మౌనం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. అవినీతి రహిత రాష్ట్రాల్లో ఏపీ 3వ స్థానంలో ఉందని గుర్తుచేశారు. గుజరాత్‌తో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాలు ఏ స్థానంలో ఉన్నాయో వాటి గురించి మాట్లాడకుండా ఏపీ అవినీతి గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడే మోదీ అవినీతి గురించి వివరించారని, రాఫెల్ కుంభకోణంపై మోదీ స్పందించాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ పేరెత్తే యోగ్యత మోదీకి లేదన్నారు. ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. 'సన్‌రైజ్' స్టేట్ అనేదానికి కూడా వక్రభాష్యాలు చేయటం దుర్మార్గమన్నారు. సూర్యోదయ రాష్ట్రంపై నరేంద్రమోదీ అపహాస్యం చేస్తున్నారని ఆక్షేపించారు. బీజేపీ నీచ రాజకీయ ధోరణికి ఇది తార్కాణమన్నారు. నిధులు ఇవ్వకుండా ఏపీని దొంగదెబ్బ తీశారని, రాష్ట్ర మనుగడ దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. నరేగాలో గతంలో రూ 1300 కోట్ల బకాయిలు పెట్టారని ఇప్పుడు మరో 1200 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు.

పోలవరానికి మరో 3500 కోట్లు మంజూరు కావాలన్నారు. తొలి ఏడాది ఆర్థిక లోటుకు కూడా రూ 12వేల కోట్లు ఇవ్వకుండా ఎగనామం పెట్టారని ఆరోపించారు. దేశ ప్రధానిగా మోదీ విఫలమయ్యారని విమర్శించారు. ఐదు రాష్ట్రాల్లో చిత్తుగా ఓడటమే మోదీ వైఫల్యానికి నిదర్శనమన్నారు. అసహనంతోనే ఆయన చంద్రబాబు కుటుంబంపై నిందలు మోపుతున్నారని మండిపడ్డారు. అభద్రత.. భయంతోనే అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని ఖండించారు. నల్లధనం విదేశాల నుంచి తరలించలేక చతికిలపడ్డారని విమర్శించారు. ఆర్థిక నేరగాళ్లను రెడ్‌కార్పెట్‌తో విదేశాలకు పంపారని ఆరోపించారు. రాష్ట్రాల్లో ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు కుట్రలు చేస్తున్నారని ఇందులో భాగంగా కేరళలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు.

ఉత్తరప్రదేశ్‌లో తప్పుడు కేసులు బనాయిస్తూ ఏపీని అభివృద్ధిలో వెనక్కు నెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. గుజరాత్‌ను మించి అభివృద్ధి జరుగుతోందనే అక్కసుతోనే కక్ష కట్టారన్నారు. రాష్ట్రాన్ని చంద్రబాబు వెనక్కు తీసుకువెళితే 650 అవార్డులు ఎలా వచ్చాయని నిలదీశారు. రూ 24వేల కోట్ల రుణమాఫీ చేయటం వెనక్కి నెట్టటమా అని ప్రశ్నించారు. యువతకు పదిలక్షల ఉద్యోగాలు కల్పించడం, 8లక్షల పంటకుంటలు, 36 లక్షల మరుగుదొడ్ల నిర్మాణం మోదీ తెలుసుకోవాలన్నారు. వెనుకబడిన జిల్లాలకు అధికంగా నిధులిచ్చామని మోదీ ప్రకటించటం పచ్చి అబద్ధమన్నారు. ఏడాదికి ఒక్కో జిల్లాలకు రూ 50 కోట్లు మాత్రమే ఇచ్చారని, 23వేల కోట్లు అడిగితే కేవలం రూ 1050 కోట్లు విదిలించి అందులో 350 కోట్లు వెనక్కు తీసుకున్న చరిత్ర మోదీదే అన్నారు.

అవినీతిపై జగన్ పుస్తకమా?

అవినీతిపై పుస్తకాలను అవినీతిపరులే రూపొందిస్తున్నారని జగన్‌పై మండిపడ్డారు. అవినీతి కేసుల్లో కోర్టుల చుట్టూ తిరిగేవాళ్లు పుస్తకాలు వేయటం దెయ్యాలు వేదాలు వల్లించిన తీరుగా ఉందన్నారు.

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మంచి మాటలు మాట్లాడారని కితాబిస్తున్నారు.. కేసీఆర్‌ను స్వాగతించాలని చెప్తున్నారు.. వైసీపీ, టీఆర్ఎస్ లాలూచీకి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలన్నారు. వైసీపీ కార్యకర్తలు టీఆర్ఎస్‌కు ఓటేశారని తెలిపారు. దుష్టశక్తులన్నీ టీడీపీకి వ్యతిరేకమయ్యాయని ప్రజలే వారికి తగిన గుణపాఠం చెప్తారని స్పష్టం చేశారు.

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

మంగళవారం, 8 జనవరి 2019

రాజకీయం.. రాజ్యాంగం!

కేంద్ర ప్రభుత్వ నిర్వాహక పక్షమైన 'భారతీయ జనతాపార్టీ' సోమవారం సంధించిన 'రాజ్యాంగ' వ్యూహానికి, వివిధ విపక్షాలు రూపకల్పన చేస్తున్న 'రాజకీయ' అస్త్రశస్త్ర సమాహారం సమీప నేపథ్యం! నాలుగు నెలలలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికలలో 'భాజపా'ను గద్దెదించడం లక్ష్యంగా వివిధ ప్రతిపక్షాలు వివిధ వ్యూహాలను విరచించాయి, విరచిస్తున్నాయి. పొత్తు, సీట్ల నిష్పత్తి, వివిధ ప్రాతిపదికలపై వోటర్ల సమీకరణ అధికార, విపక్షాల విభిన్న, విరుద్ధ వ్యూహాల మధ్య నెలకొని ఉన్న 'విచిత్ర సమానత్వ'మన్నది నిరాకరింపజాలని నిజం. రాజకీయ పక్షానికి సమీప లక్ష్యం అధికారాన్ని కైవసం చేసుకోవడం. తదుపరి లక్ష్యం అధికారాన్ని- జారిపోకుండా- నిలబెట్టుకోవడం! పదవీచ్యుతికి గురి అయిన పక్షాలు మళ్లీ అధికారాన్ని పొందడానికి యత్నించడం.. ఇదీ మన దేశంలో కాని వివిధ దేశాలలో కాని కొనసాగుతున్న ప్రజాస్వామ్య 'క్రీడ' స్వభావం! అధికారం చేపట్టడం లక్ష్యం కావడం నిజానికి ప్రజాస్వామ్య రాజ్యాంగ ప్రక్రియ నిర్దేశిస్తున్న శాశ్వత సూత్రం.. అధికారం చేపట్టడం, ప్రభుత్వాన్ని నిర్వహించడం ప్రజాస్వామ్య ప్రక్రియలో కేవలం మాధ్యమం..! లక్ష్యం సర్వజనహిత సాధన! కాని 'మాధ్యమం' లక్ష్యంగా మారిపోయి ఉండడం అధికారిక రాజకీయ పక్షాల ప్రవృత్తిగా ప్రస్ఫుటిస్తోంది! అందువల్ల లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో 'భాజపా'ను గద్దెదింపడం ఏకైక లక్ష్యంగా ప్రతిపక్షాల పొత్తుల రాజకీయం ఊపందుకుంది! ఉత్తరప్రదేశ్‌లో 'బహుజన సమాజ్ పార్టీ'కి, 'సమాజ్‌వాదీ పార్టీ'కి మధ్య పొత్తు కుదరడం 'భాజపా'కు వ్యతిరేకంగా సంభవిస్తున్న రాజకీయ పరిణామక్రమంలో అత్యంత ప్రధానమైనది! 'ప్రధానమైనది..' అన్న ప్రచారం ఉద్ధృతంగా నడుస్తోంది. మొత్తం లోక్‌సభ నియోజకవర్గాలు- 543-లో పదిహేను శాతం-80- ఉత్తరప్రదేశ్‌లో నెలకొని ఉండడం ఈ ప్రాధాన్యానికి ప్రాతిపదిక! కాంగ్రెస్ పార్టీకి, జాతీయతా కాంగ్రెస్ పార్టీకి మధ్య మహారాష్ట్రలో సైతం పొత్తు కుదిరింది! ఇదంతా 'భాజపా'కు వ్యతిరేకంగా రూపుకడుతున్న పొత్తుల ప్రహసనం! ఉత్తరప్రదేశ్‌లో 'సమాజ్‌వాదీ పార్టీ'- 'సపా'- బహుజన సమాజ్‌వాదీ పార్టీ- బసపా- కలసికట్టుగా పోటీచేసినట్టయితే అత్యధిక స్థానాలలో 'భాజపా' ఓడిపోతుందన్నది జరుగుతున్న ప్రచారం. 2014లో జరిగిన ఎన్నికలలో 'భాజపా'కు లోక్‌సభలో 'సంఖ్యా బాహుళ్యం'- మెజారిటీ- పొందడానికి కారణం ఉత్తరప్రదేశ్‌లోని ఎనభయి స్థానాలలో ఆ పార్టీకి డెబ్బయి మూడు లభించడం! అందువల్ల ఉత్తరప్రదేశ్‌లో భారీగా నష్టపోయినట్టయితే 'భాజపా'కు, లోక్‌సభలో 'సంఖ్యా బాహుళ్యం' సిద్ధించదు. అందువల్ల 'భాజపా' నాయకత్వంలోని 'జాతీయ ప్రజాస్వామ్య సంఘటన'-నేషనల్ డెమొక్రాటిక్ అలయెన్స్- ఎన్‌డిఏ-లోని ప్రాంతీయ పక్షాల ప్రాబల్యం పెరుగుతుంది. మిశ్రమ మంత్రివర్గ, సంకీర్ణ రాజకీయ చరిత్ర మళ్లీ మొదలైపోతుంది. ఆర్థికంగా వెనుకబడిన కులాల- ఎకనమికల్లీ బాక్‌వర్డ్ కాస్ట్స్- వారికి ప్రభుత్వ ఉద్యోగాలలోను, విద్యాసంస్థలలోను పదిశాతం 'ఆరక్షణలు' కల్పించాలన్న సోమవారం నాటి కేంద్ర మంత్రివర్గ నిర్ణయం ఈ 'సంకీర్ణ' రాజకీయాన్ని నిరోధించడానికై బహుశా 'భాజపా' సంధించిన రాజ్యాంగ శస్త్రం..

'ఆరక్షణలు' అనేవి అట్టడుగు స్థాయివరకు అభ్యుదయం వికేంద్రీకృతం కావడానికి దోహదం చేయాలన్నది రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించిన లక్ష్యం! కానీ వివిధ రాజకీయ పక్షాలు ఈ ఆరక్షణల- రిజర్వేషన్‌ల-ను కులాల వోట్లను మూక ఉమ్మడిగా కొల్లగొట్టడానికి మాత్రమే ఉపయోగించుకొంటుండడం నడుస్తున్న చరిత్ర. ఉత్తరప్రదేశ్‌లోను బిహార్‌లోను 'కుల సమీకరణలు' ప్రధానంగా వివిధ రాజకీయ పక్షాల గెలుపోటములను నిర్ధారిస్తున్నాయి. 2007 వరకూ అగ్ర కులాలను ద్వేషిస్తూ ప్రసంగాలు చేసిన 'బహుజన సమాజ్ పార్టీ'- బసపా- అధినేత్రి మాయావతి 2007 నాటి ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల సందర్భంగా వ్యూహం మార్చడం చరిత్ర. 'తిలక్'- బ్రాహ్మణ-, 'తల్‌వార్-' క్షత్రియ-, 'తరాజ్'- వైశ్య- కులాల ''ఆగడాలను''అంతవరకూ ఎండగట్టిన మాయావతి 2007లో ''బ్రాహ్మణ్ జోడో''అన్న ఉద్యమాన్ని ఆరంభించింది. తమ పార్టీలో విరివిగా బ్రాహ్మణులను చేర్చుకుని వారిని ఎన్నికలలో అభ్యర్థులుగా నిలబెట్టింది. ఆ ఎన్నికలలో ఆమె ఘన విజయం సాధించింది. కానీ ఐదేళ్ల తరువాత ఈ ''కులవ్యూహం'' బెడిసి కొట్టింది! అయినప్పటికీ బాహాటంగా కులాలను సమీకరించడానికి వివిధ పక్షాలు చేస్తున్న యత్నాలు విస్తరిస్తూనే ఉన్నాయి. 'లింగాయత్‌ల'ను కూడగట్టడానికి కర్నాటకలో కాంగ్రెస్ చేసిన యత్నం కుల రాజకీయాలకు మతం రంగును సైతం పులిమింది. ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లో 'సమాజ్‌వాదీ పార్టీ'- సపా- అధినేత మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ ప్రచారం చేస్తున్న ''గణాంకాల''- అర్థమెటిక్- ప్రాధాన్యంలో కూడ కులాల సమీకరణ ప్రస్ఫుటిస్తోంది! ఆర్థికంగా వెనుకబడిన కులాల వారికి 'ఆరక్షణలు' కల్పించాలన్న 'భాజపా' వ్యూహం ప్రత్యర్థుల వ్యూహానికి బహుశా ప్రతివ్యూహం కావచ్చు!!

కుల ప్రాధాన్యం ప్రాతిపదికగా మాత్రమే కాక ప్రాంతీయ ప్రాధాన్యం ప్రాతిపదికగాను, మత ప్రాతిపదికగాను సంకీర్ణ రాజకీయం మరోసారి పుంజుకుంటోంది! 1989లో కేంద్రంలో మొదలైన రాజకీయ చరిత్ర 2014వరకూ పాతికేళ్లు కొనసాగింది! ఈ పాతికేళ్ల కాలంలో రాజ్యాంగ ప్రక్రియ కంటె రాజకీయ ప్రహసనం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆర్థిక వాణిజ్య రక్షణ రంగాలలో అస్థిరత నెలకొనడం ఈ పాతికేళ్ల రాజకీయ ప్రహసనం ఫలితం! సాంస్కృతిక రంగంలో సైతం వైపరీత్యాలు చోటుచేసుకొనడం ఆ పాతికేళ్ల చరిత్ర! 'ప్రపంచీకరణ' మన నెత్తికెక్కి 'భారతీయత'ను దిగమింగడం ఈ పాతికేళ్ల వైపరీత్యం! ప్రాంతీయ పార్టీలు, చిన్న చిన్న పార్టీలు జాతీయ పక్షాలను ఆడించాయి, పీడించాయి, ఒత్తిడి తెచ్చాయి! 1998లో ఏర్పడిన అటల్ బిహారీ వాజ్‌పాయి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏడాది తరువాత కూలిపోవడం సంకీర్ణ రాజకీయాల వైపరీత్యానికి పరాకాష్ఠ! అప్పటి 'అన్నా డిఎమ్‌కె' అధినేత్రి జయలలిత అనూహ్య ప్రవర్తన ఈ కూలిపోవడానికి కారణం! 2004వ 2014వ సంవత్సరాల మధ్య మన్‌మోహన్‌సింగ్ నాయకత్వంలోని ప్రభుత్వం అవినీతి ప్రహసనాలకు ఆలవాలం కావడానికి ఒక ప్రధాన కారణం సంకీర్ణ రాజకీయం. అతి పెద్ద అవినీతి ప్రహసనాలు- ద్వితీయశ్రేణి దూరవాణి తరంగాల అమ్మకంలో అక్రమాలు, బొగ్గు బొరియల కేటాయింపులో అక్రమాలు- ఈ సమయంలోనే పుట్టలు పగిలాయి! రక్షణ రంగంలో 'తాత్రా' శకటాల కొనుగోలు అవినీతి, అగస్టా గగన శకటాల కొనుగోలు అవినీతి బద్దలయింది! తమ పార్టీ ప్రభుత్వం హయాంలో ఇన్ని అవినీతి కలాపాలు జరిగాయన్నది రాహుల్ గాంధీకి తెలిసిన నిజం. అందువల్లనే కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రస్తుత ప్రభుత్వం 'రాఫెల్' యుద్ధ విమానాల కొనుగోళ్లలో అవినీతికి పాల్పడినట్టు ప్రచారం చేస్తున్నాడు! ఈ ప్రచారాన్ని ప్రతిఘటించడానికై 'భాజపా' చేస్తున్న యత్నంలో భాగం బహుశా సోమవారం నాటి నిర్ణయం..

శతాబ్దుల పాటు దమనకాండకు గురి అయిన అనుసూచిత కులాల వారికి, అనుసూచిత వన సముదాయాల వారికి ఆరక్షణలు కల్పించడం సామాజిక సమానత్వ సాధనలో భాగం! ఈ శతాబ్దుల కాలంలో విదేశీయ దురాక్రమణకు, బీభత్సపాలనకు బలి అయిన మొత్తం భారత జాతి దళిత..! ఈ కులాలవారు, ఈ వనవాసీ ప్రజలు మరింతగా దళితులు! అందువల్ల రాజ్యాంగ నిర్మాతలు ఈ దళితులు ప్రగతి ప్రక్రియలో సమాన భాగస్వాములు కావడానికి వీలుగా 'ఆరక్షణల'ను ఏర్పాటు చేశారు! కానీ ఈ 'ఆరక్షణ'ల ఫలితాలను నిజమైన దళితులకు దక్కకుండా ''నకిలీ దళితులు'' బొక్కడం కూడ దశాబ్దుల వైపరీత్యం! క్రమంగా 'ఆరక్షణల' పేరుతో 'వోటు బ్యాంకుల'ను నిర్మించుకొనడానికి రాజకీయ పక్షాలు యత్నించడం, యత్నిస్తుండడం రాజ్యాంగ స్ఫూర్తిని నీరుకార్చుతున్న రాజకీయం! మతం పేరుతో 1947లో అఖండ భారత్ విభజన జరిగింది. ఈ చరిత్ర నుంచి పాఠం నేర్చుకొనడానికి సిద్ధంగా లేని రాజకీయ పక్షాలు కొన్ని మతం పేరుతో 'ఆరక్షణలు' కల్పించడానికి యత్నిస్తున్నాయి! ఆర్థిక ప్రాతిపదికగా పది శాతం 'రిజర్వేషన్లు' కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి ఇదంతా నేపథ్యం! అందువల్ల ఈ నిర్ణయం కూడ భిన్నభిన్న విశ్లేషణలకు గురికావడం ఖాయం! ''మాకు ఆరక్షణలు వద్దు..''- అని దేశ ప్రజలందరూ చెప్పగల రోజు రావాలన్నది 2007లో సర్వోన్నత న్యాయస్థానం చెప్పిన మాట..

'రాఫెల్ రచ్చ'తో సభాపర్వం వృథా!

ఢిల్లీ కబుర్లు

కె.కైలాష్ 98115 73262

రాజకీయ పార్టీలు నేడు ఓటుబ్యాంకు కోణంలో పార్లమెంటును బలి తీసుకుంటున్నాయి. కాంగ్రెస్, అన్నా డీఎంకే, డీఎంకే, తెలుగుదేశం సహా మరి కొన్ని ప్రతిపక్షాలు తమ స్వార్థ రాజకీయాల కోసం పార్లమెంటు సమావేశాలను స్తంభింపజేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నాయి. ప్రజా సంక్షేమం పేరుతో పార్టీ ప్రయోజనాలు, అధికారం కోసం పార్లమెంటును దుర్వినియోగం చేస్తున్నాయి. కాంగ్రెస్‌తో పాటు మరికొన్ని విపక్ష పార్టీలు అసాధ్యమైన, అసంబద్ధమైన అంశాలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఉభయ సభలను స్తంభింపజేస్తున్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు అంశంపై లోక్‌సభలో గందరగోళం సృష్టించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో అవినీతి చోటుచేసుకున్నదంటూ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఆరోపణలు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ అంశాన్ని దేశ ప్రజలకు భూతద్దంలో చూపించటం ద్వారా రాజకీయ ప్రయోజనం సాధించేందుకు ఆయన పెద్దఎత్తున ప్రయత్నించారు. దేశ భద్రత, సైనిక దళాలకు నష్టం కలుగుతుందనే విషయాలను సైతం పట్టించుకోకుండా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'రాఫెల్ ఒప్పందం'లో అవినీతికి పాల్పడ్డాడంటూ కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేందుకు రాహుల్ ప్రయత్నం చేస్తున్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ గతంలో ఒకానొక సందర్భంగా తనను తాను 'చౌకీదారు' (కాపలాదారు)గా అభివర్ణించుకోటం తెలిసిందే. రాహుల్ గాంధీ మాత్రం పట్టువిడవకుండా 'చౌకీదార్.. చోర్ హై' (కాపలాదారే దొంగ) అంటూ మోదీని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తునే ఉన్నారు. ఏదోఒక వంకతో ప్రధాని మోదీని దొంగ అని సంబోధించటం ద్వారా ప్రజల దృష్టిలో చులకన చేసేందుకు రాహుల్ తపన పడుతున్నారు. రాఫెల్ వ్యవహారంలో మోదీ అవినీతికి పాల్పడ్డారనే అభిప్రాయం కలిగించేందుకు రాహుల్ చేయని ప్రయత్నం లేదు. అయితే ఆయన తన ప్రయత్నంలో విజయం సాధించిన సూచనలు కనిపించటం లేదు. రాఫెల్ ఆఫ్‌సెట్ ఒప్పందాన్ని రిలయన్స్ సంస్థ అధినేత అనిల్ అంబానీకి ఇప్పించటం ద్వారా ముప్పై వేల కోట్ల లాభం కలిగించారని రాహుల్ గాంధీ ప్రధాన మంత్రిపై దుమ్మెత్తిపోస్తున్నారు.

గతంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం రాఫెల్ యుద్ధ విమానాన్ని 560 కోట్ల రూపాయల చొప్పున కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకోగా, మోదీ ప్రతి విమానం ధరను 1,600 వందల కోట్లకు పెంచారంటూ ఆరోపిస్తున్నారు. 18కి బదులు 36 యుద్ధ విమానాలను ఫ్రాన్స్ నుండి కొనుగోలు చేయటంతోపాటు ఆఫ్‌సెట్ ఒప్పందాన్ని అనిల్ అంబానీకి ఇప్పించటం ద్వారా హిందుస్తాన్ ఏయిరోనాటిక్స్ సంస్థకు అన్యాయం చేశారని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాహుల్ సహా ఇతర ప్రతిపక్ష నాయకులు, యశ్వంత్ సిన్హా లాంటి భాజపా అసమ్మతి వాదులు చేసిన ఆరోపణలను సుప్రీం కోర్టు కొట్టివేసింది. రాఫెల్ ఒప్పందంలో అవినీతి జరిగినట్లు తమకు ఎక్కడా కనిపించలేదంటూ తీర్పు ఇవ్వటం ద్వారా మోదీ ప్రభుత్వంపై వచ్చిన ఆరోపణలను ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. సుప్రీం కోర్టు ఇంత స్పష్టంగా తీర్పు ఇచ్చిన తరువాత కూడా రాహుల్ గాంధీ-



రాహుల్ గాంధీ మాత్రం ఈ వివరాలేవీ పట్టించుకోకుండా రాఫెల్ ఒప్పందం అంశాన్ని రాజకీయం చేశారు. విమానం ధరలను వెల్లడించాలంటూ రాద్ధాంతం చేయటం వల్ల శత్రుదేశాలకు ప్రయోజనం కలుగుతుందనే అవగాహన కూడా లేకపోవడం శోచనీయం. హెచ్ఏఎల్ విషయంలో నిర్మలా సీతారామన్ ఇచ్చిన వివరణ కూడా సమర్థనీయమే.

రాఫెల్ ఒప్పందంలో అక్రమాలు జరిగాయని, చౌకీదార్ చోర్ హై, ముప్పైవేల కోట్ల ప్రజాధనాన్ని అనిల్ అంబానీ జేబులో పోశారంటూ ఆరోపణలు కురిపించారు.

రాహుల్ గాంధీ లోక్‌సభలో చేసిన ఈ ఆరోపణలకు ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ సుదీర్ఘమైన వివరణ ఇచ్చారు. రాహుల్ చేసిన ఏ ఒక్క ఆరోపణలోనూ నిజం లేదని అంకెలతో ఆయన నిరూపించారు. రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కూడా లోక్‌సభలో రెండున్నర గంటల పాటు గుక్కతిప్పుకోకుండా సమాధానం ఇస్తూ రాహుల్ ఆరోపణలను చీల్చి చెండాడారు. రాఫెల్ యుద్ధ విమానం షెల్ ధర, ఆయుధాలతో కూడిన ధరలపై ఆమె ఇచ్చిన వివరణ రాహుల్ ఆరోపణలలోని డొల్లతనాన్ని ప్రజల ముందు పెట్టింది. యూపీఏ ప్రభుత్వం యుద్ధ విమానం ధరను 520 కోట్లుగా ఒప్పందం చేసుకున్నట్టు ఎక్కడా లేదని ఆమె ప్రకటించారు. యూపీఏ ప్రభుత్వం నిర్ణయించిన విమానం ధర 737 కోట్లు. దీంతో పోలిస్తే తమ ప్రభుత్వం తొమ్మిది శాతం తక్కువ ధర అంటే 672 కోట్లకు కొనుగోలు చేస్తోందని చెప్పటం ద్వారా రాహుల్ ఇంతకాలం చేస్తున్న ధరల బండారాన్ని ఆమె బహిర్గతం చేశారు. ఆయుధాలతో కూడిన రాఫెల్ యుద్ధ విమానం ధరను వెల్లడించేందుకు ఆమె నిరాకరించారు. ఆ వివరాలను బహిరంగ పరచడం అంటే దేశభద్రతకు ముప్పు తెచ్చినట్లేనని ఆమె స్పష్టం చేశారు.

అటల్ బిహారీ వాజపేయి ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు 2001లో యుద్ధ విమానాల కొనుగోలు ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించింది. శత్రు దేశాలైన చైనా, పాకిస్తాన్‌లతో పోలిస్తే మన వద్ద అతి తక్కువ యుద్ధ విమానాలు, అందునా ఆధునిక యుద్ధ విమానాలు చాలా తక్కువగా ఉన్నాయి. వీటి సంఖ్యను వెంటనే పెంచుకోకపోతే దేశ భద్రత ప్రమాదంలో పడిపోతుందని రక్షణ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేయటంతో యుద్ధ విమానాల కొనుగోలు అనివార్యమైంది. అందుకే వాజపేయి యుద్ధ విమానాల కొనుగోలుకు ఆమోదం తెలిపారు. ఆయన తరువాత అధికారంలోకి వచ్చిన యూపీఏ ప్రభుత్వం ఫ్రాన్స్‌కు చెందిన దస్సాల్ట్ సంస్థ నుండి యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలనే నిర్ణయానికి వచ్చింది. 18 యుద్ధ విమానాలను 'ఫ్లైవే' అంటే యుద్ధానికి సిద్ధంగా ఉండే విమానలను కొనుగోలు చేసి మిగతా 126 యుద్ధ విమానాలను స్వదేశంలో తయారు చేయాలనే ఒప్పందానికి వచ్చినా అంతుపట్టని కారణాల మూలంగా పది సంవత్సరాల పాటు ఆ ఒప్పందాన్ని ఖరారు చేయలేకపోయింది. 2014లో నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి పదవిని చేపట్టిన తరువాత యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారం ఊపందుకొంది.

మన వాయుసేన 2001లో యుద్ధ విమానాలు కావాలని కోరితే పద్నాలుగు సంవత్సరాల తరువాత కూడా వాటిని కొనుగోలు చేయడం సాధ్యం కాలేదంటే- రక్షణ రంగంలో మన బలం ఏ స్థాయిలో తగ్గిపోయిందో అంచనా వేసుకోవచ్చు. ఈ మధ్య కాలంలో శత్రుదేశాలతో యుద్ధం జరిగి ఉంటే ఏం జరిగేదనేది ఎవరైనా ఊహించుకోవచ్చు. వాయుసేన సామర్థ్యాన్ని యుద్ధ ప్రాతిపదికపైన పెంచేందుకు 38 యుద్ధ విమానాలను ఫ్లైవే స్థితిలో కొనుగోలు చేసి మిగతా 90 యుద్ధ విమానాలను మన దేశంలోనే ఉత్పత్తి చేయాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. రాహుల్ గాంధీ మాత్రం ఈ వివరాలేవీ పట్టించుకోకుండా రాఫెల్ ఒప్పందం అంశాన్ని రాజకీయం చేశారు. విమానం ధరలను వెల్లడించాలంటూ రాద్ధాంతం చేయటం వల్ల శత్రుదేశాలకు ప్రయోజనం కలుగుతుందనే అవగాహన కూడా లేకపోవడం శోచనీయం. హెచ్ఏఎల్ విషయంలో నిర్మలా సీతారామన్ ఇచ్చిన వివరణ కూడా సమర్థనీయమే. హెచ్ఏఎల్ విషయంలో కాంగ్రెస్ పార్టీ మొసలి కన్నీరు కార్చేబదులు దాని పటిష్టతపై దృష్టి పెడితే బాగుండేది. కాంగ్రెస్ సభ్యులు లోక్‌సభలో స్పీకర్ పోడియం వద్ద గొడవ చేస్తూ చిన్నపిల్లల మాదిరిగా పేపర్ విమానాలు చేసి విసిరివేయటం సిగ్గు చేటు. తమ పార్టీ సభ్యులను సోనియా గాంధీ వారిని వారించకపోవటం 120 సంవత్సరాల ఘన చరిత్ర ఉన్న కాంగ్రెస్‌కు పట్టిన దుర్గతికి అద్దం పడుతోంది.

లోక్‌సభలో ఐదురోజుల పాటు సస్పెండైన అన్నా డిఎంకే సభ్యులు వ్యవహరించిన తీరు గర్హనీయం. వారి వ్యవహారాన్ని ఎంత కఠిన పదజాలంతో విమర్శించినా తక్కువే. ఇద్దరు అన్నా డిఎంకే సభ్యులు సీట్లపైకి ఎక్కి గొడవ చేయటం, కాగితాలు చింపి గాలిలోకి ఎగురవేయటం ఎంత మాత్రం సమర్థనీయం కాదు. కర్నాటక ప్రభుత్వం కావేరీ నదిపై నిర్మిస్తున్న నీటిపారుదల ప్రాజెక్టును ఆపాలన్న వారి డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం ఎలా తీర్చగలదు? రేపుకర్నాటక ఎంపీలు లోక్‌సభలో స్పీకర్ పోడియం వద్దకు వచ్చి తమిళనాడులో చేపట్టిన ఏదైనా పథకాన్ని ఆపేయాలంటూ వత్తిడి తెస్తే కేంద్రం ఆమోదించాలా? రాష్ట్రాలకు సంబంధించిన వ్యవహారాల్లో కేంద్రాన్ని జోక్యం చేసుకోమనటం రాజకీయం కాదా? ఇక తెలుగుదేశం ఎంపీలు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ రోజూ గొడవ చేయటం ఎంతవరకూ సమంజసం? ప్రత్యేక హోదా ఇవ్వటం అనేది ఇప్పుడు మూసిన పుస్తకం లాంటిది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ లోక్‌సభలో గొడవ చేయటం వెనక రాజకీయం తప్ప మరొకటి లేదు. రాజ్యసభ అధ్యక్షుడు, ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు చెప్పినట్లు- పార్లమెంటులో ఎంపీలు అనవసరంగా గొడవ చేయటం పట్ల దేశ ప్రజలు నవ్వుకుంటున్నారు. ప్రజల దృష్టిలో ఎంపీలు నవ్వుల పాలవుతున్నారని వెంకయ్య నెత్తీనోరూ బాదుకుని చెప్పినా మన రాజకీయ పార్టీలకు మాత్రం జ్ఞానోదయం కావటం లేదు.

★

అశాస్త్రీయ విజ్ఞానం హానికరం..

దారి తెలియని అజ్ఞానం కన్నా దారితప్పిన విజ్ఞానమే ఎక్కువ నష్టం కలిగిస్తుంది. సమాజంలో అసలైన విజ్ఞానం, శాస్త్రీయ దృక్పథం పెరిగేలా విస్తృత కృషి జరగాలి. విద్యాధికులు అందుకు ముందుండాలి. బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్నవాళ్లు మరింత శ్రద్ధగా ఆ పని చేయాలి. ఇప్పటికే మూఢ నమ్మకాలతో దిగజారుతున్న మన సమాజానికి మరిన్ని మూఢ నమ్మకాల్ని పరిచయం చేస్తూ ఇంకా గందరగోళ పర్చరాదు. జలంధర్ పట్టణంలో ప్రతిష్టాత్మక భారత సైన్స్ కాంగ్రెస్ 106వ సమావేశాల్లో ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.నాగేశ్వర రావు చేసిన ప్రసంగం శాస్త్రీయ స్ఫూర్తికి విరుద్ధం. ఆయన భారతంలో కౌరవుల జననానికి కారణం స్టెమ్‌సెల్ పరిజ్ఞానమంటూ, అలాగే అప్పటి బాణాలు మిస్సైల్ టెక్నాలజీ అంటూ సరికొత్త థియరీలు చెప్పారు. శాస్త్రవేత్తలు, శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తిఉన్న విద్యార్థులు, ఆ సమావేశాలవైపు చూస్తున్న దేశ ప్రజలకు ఒక విశ్వవిద్యాలయ పెద్ద చెప్పవలసిన మాటలా అవి? పురాణాల్ని, చరిత్రనీ, సంస్కృతినీ సైన్స్‌తో కలగలిపి వక్రభాష్యాలు చెప్పడంలో ఏ ప్రయోజనం వుంది? మన పూర్వీకులు గొప్పవారని చెప్పాలనుకొంటే చెప్పగలిగిన దృష్టాంతాలు చరిత్రలో కోకొల్లలు. ఆర్యభట్ట, సుశ్రుతుడు, నలంద, తక్షశిల వంటి విషయాలెన్నో ఉన్నాయి. పురాణాల్లో ఉదంతాల్ని సృజనాత్మకతకి దర్పణంగా వర్ణించవచ్చు. తప్పుడు భాష్యాలు, నమ్మకాలూ కొంపముంచుతాయి. దక్షిణ ఆఫ్రికాలో (ఎంబెకే అధ్యక్షుడుగా ఉన్న కాలంలో) హెచ్ఐవీతో ఎయిడ్స్ వ్యాధి రాదు అని తప్పుడుగా ప్రభుత్వం నమ్మి ఏ చర్యలూ తీసుకోకపోవడంతో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. తరువాత తప్పు దిద్దుకొన్నారనుకోండి. సమకాలీనంగా కూడా దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకువెళ్తోంది. ఇలాంటి నేపథ్యంలో ఒక మంచి వేదికని అశాస్త్రీయ విజ్ఞాన వేదికగా మార్చడం, అదీ బాధ్యతాయుత స్థానంలో ఉండీ చెయ్యడం తప్పు. దేశంలో పరిశోధన రంగం బలపడాల్సిన అవసరం ఎంతోఉంది. పరిశోధనలకు, నూతన ఆవిష్కరణలకు, పరిశోధనా పత్రాలకు ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే పరిస్థితిలో ప్రస్తుతం దేశం లేదు. ఆ వాతావరణం కల్పించడానికి ఎంతో కృషిజరగాల్సి ఉంది. మరోవైపు మూఢ నమ్మకాలు ప్రబలి ఆర్థికంగా దేశం నష్టపోతోంది. ప్రభుత్వం కన్నా, విధానకర్తలు కన్నా శాస్త్రీయ దృక్పథం పెంచడంలో విద్యాధికుల పాత్ర ఎక్కువ. అవసరమనుకొంటే ప్రభుత్వాన్ని నిలదీయాలి. శాస్త్రజ్ఞానం వైపు నిలవాలి. ఇప్పటికైనా తన భాష్యం పొరపాటని ఏయూ వైస్ చాన్సలర్ ప్రకటించాలి.

- డా. డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

ఉత్తరాయణం

ద్వంద్వ వైఖరి తగునా?

'తెలంగాణ ముఖ్యమంత్రి, తెరాస అధినేత కేసీఆర్ రాష్ట్ర రాజకీయాల నుంచి తప్పుకొని కేంద్ర రాజకీయాల్లో రాణించాలని చూస్తున్నాడు. అందుకే పలు రాష్ట్రాలు పర్యటిస్తూ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాడు. తన కుమారుడు కేటీఆర్‌ను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టాలన్నది ఆయన లక్ష్యం..'- అంటూ ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి విమర్శిస్తున్నారు. చిత్రంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెదేపా అధినేత చంద్రబాబు కూడా చేస్తున్నది అదే. చంద్రబాబుని ఆలింగనం చేసుకొని, కేసీఆర్‌ని విమర్శించడం రఘువీరుని ద్వంద్వ ప్రవృత్తికి నిదర్శనం కాదా? మరి తాను ప్రధాన మంత్రి కావాలన్న ఉద్దేశంతోనే కదా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ విపక్ష నేతల్ని కలుస్తున్నది? రాజకీయాల్లో రఘువీరునికి ఇవన్నీ కొత్త కాదుకదా. ఒకర్ని పొగడుతూ ఇంకొకర్ని విమర్శించనేల?

- శాండీ, కాకినాడ

యువనాయకత్వం ఎక్కడ?

ఒకనాడు కమ్యూనిస్టు ఉద్యమాలకు కంచుకోట అయిన ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో వామపక్షాలు నేడు ఒంటరిగా బరిలోకి దిగి గెలువలేని దుస్థితి నెలకొంది. నేడు రాజకీయాలలో యువత ప్రాధాన్యత పెరగటంలో ఇతర పార్టీలపై యువ నాయకత్వంపై ఆకర్షితులవుతున్నారు. కాంగ్రెస్, టిఆర్ఎస్, టిడిపి, వైఎస్ఆర్ కాంగ్రెస్, జనసేన పార్టీలపై యువత ఆకర్షితులవుతున్నారు. చాలాకాలంగా కమ్యూనిస్టు పార్టీలలో యువ నాయకత్వం కొరవడిందనే చెప్పాలి. మంచి నాయకులు ఉన్నా వయోభారం పైన పడడంతో వారు అంత చురుగ్గా రాజకీయాల్లో పాల్గొనలేని పరిస్థితి ఉంది. గెలుపు ఓటములను నియంత్రించే సత్తా వామపక్షాలకు ఉంది. కాని గెలుపొందే వీలులేని పరిస్థితి కొనసాగుతూనే ఉంది. వామపక్షాలు చెరో దారిలో పయనించటం కూడా ఇందుకు ఒక కారణం. మళ్ళీ కమ్యూనిస్టు పార్టీలు గత వైభవం సంతరించుకోవాలంటే యువ నాయకత్వం అడుగిడాల్సిన అవరం ఎంతైనా వుంది.

- ఎ.ఆర్.ఆర్.ఆర్, ఖమ్మం

ఆర్టీసీ సిబ్బందికీ పోస్టల్ బ్యాలెట్

ఇటీవల తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో పోలింగ్ జరిగిన రోజున ఆర్టీసీ సిబ్బందిని ఉపయోగించుకున్న ఎన్నికల సంఘం అధికారులు వారిని ఓటుకు దూరంగా ఉంచడం అన్యాయం. పోలింగ్ ముందు రోజు నుండే పోలింగ్ సామాగ్రిని, సిబ్బందిని తరలించడం లాంటి పనులతో బిజీగా ఉన్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లను అభినందించాల్సిందే. పోలింగ్ రోజు ఓటువేయడానికి సొంత గ్రామాలకు వెళ్ళే సామాన్య ప్రజలను తరలించడానికి కూడా ఆర్టీసీ బస్సులను నడిపారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగడానికి సహకరిస్తున్న ఆర్టీసీ సిబ్బంది మాత్రం ఓటు హక్కు వినియోగించుకోలేక పోయారు. ఇలాంటి పరిస్థితుల్లో వారికి పోస్టల్ బ్యాలట్ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పోలింగ్ విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులకు మాత్రం పోస్టల్ బ్యాలట్ సౌకర్యం కల్పించారు. మిగతా ఉద్యోగుల మాదిరి ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లకు కూడా భవిష్యత్‌లో జరిగే ఎన్నికలలో పోస్టల్ బ్యాలట్ సౌకర్యం కల్పించాలి. పోలింగ్ శాతం పెరగడానికి ప్రచారం కల్పిస్తున్న ఎన్నికల సంఘం అధికారులు చర్యలు తీసుకోవాలి.

- జి.అశోక్, గోధూర్ (జగిత్యాల జిల్లా)

పనిచేసే నేతకు
ప్రజల కూలి ఎంత?

కష్టపడిన వ్యక్తికి ఆ పనికి తగ్గ కూలి ఇవ్వటం సర్వసాధారణం. సమాజంలో అది కనీస ధర్మం కూడా. కూలి ఇవ్వని పక్షంలో పని చేయించుకున్న వ్యక్తి లేదా యజమాని క్షమార్హుడు కాడు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగున్నరేళ్ళ పరిపాలనలో తన కష్టానికి రాబోయే 2019 ఎన్నికల్లో తగిన కూలి ఇవ్వాలని జన్మభూమి గ్రామసభల్లో ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ కోసం చేసిన పనులు ఏమిటి? ఆయన పనిదినాలు ఎన్ని? ఏయే పనులను ఆయన చేపట్టారు? ఎన్ని పనులను పూర్తిచేశారు? ఇంకెన్ని పనులను ప్రస్తుతం చేస్తున్నారు? అనే ప్రశ్నలకు జవాబులను ఆంధ్రా ప్రజలే నిర్ణయించాల్సి ఉంది. చేసిన ఆయా పనులను బట్టి సీఎంకు ఎంత కూలి ఇవ్వాలో కూడా సీమాంధ్రులే నిర్ణయించాల్సిన అంశం. గత నాలుగున్నరేళ్ళ కాలంలో చంద్రబాబు చేసిన, చేస్తున్న పనులను ఒకసారి పరిశీలిద్దాం.

2014 జూన్ 2వ తేదీన రాష్ట్రపతి ఆమోదంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధికారికంగా విడిపోయింది. జూన్ 8వ తేదీన చంద్రబాబు తన క్యాబినెట్ మంత్రులతో కలిసి విడిపోయిన నవ్యాంధ్రకు తొలి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందే పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రధాన అవరోధంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలోని 7 మండలాలను ఆంధ్రాలో కలిపేలా కేంద్ర ప్రభుత్వంచే ఆర్డినెన్స్ ఇప్పించారు. దీంతో పోలవరం నిర్మాణానికి సంబంధించిన ముఖ్యమైన అడ్డంకి తొలగింది. వందేళ్ళ నాటి పోలవరం నిర్మాణ కలకు శ్రీకారం జరిగింది.

16వేల కోట్ల రూపాయల లోటు బడ్జెట్‌తో పాలనా పగ్గాలు చేపట్టిన చంద్రబాబు విజయవాడలో ఒక చెట్టు కింద బస్సులో ఉంటూ తొలి పాలనకు శ్రీకారం చుట్టారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన ఋణమాఫీ హామీ కోసం రూ. 24,500 కోట్ల ఋణాలను 5 విడతలుగా మాఫీ చేసేందుకు నడుం కట్టారు. ఇప్పటికి 3 విడతల్లో దాదాపు 15,038 కోట్లను ఋణమాఫీ క్రింద 57.21 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశారు. మరో 8 వేల కోట్ల రూపాయలను 2 విడతల్లో చెల్లించేందుకు సంసిద్ధతను ప్రకటించారు. 86.40 లక్షల మంది ఆడపడుచులకు పసుపు కుంకుమ కింద రూ. 10 వేల కోట్లు చెల్లించారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, నేత కార్మికులు, గీత కార్మికులు వంటివారికి పింఛన్లను 5 రెట్లు పెంచారు. వీరితో పాటు చేతివృత్తులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, డయాలసిస్ రోగులు, ట్రాన్స్‌జండర్‌లకు మొత్తం 51 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా నెలకు రూ. 1,000, రూ. 1,500, రూ. 2,500 వరకు ప్రతినెల మొదటి తారీఖు ఠంచనుగా చెల్లించటం గమనార్హం. రాష్ట్రంలో దాదాపు 54 లక్షల మందికి ఏటా రూ. 6 వేల కోట్లు పింఛన్లుగా అందించటం జరుగుతోంది.

ముఖ్యమంత్రి యువనేస్తం పథకంతో 4,01,008 యువతకు నెలకు రూ. 1,000 నిరుద్యోగ భృతితో పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా కేవలం 5 రూపాయలకు అల్పాహారం, భోజన సదుపాయం కల్పించారు. 35 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. బీసీ కులాల సంక్షేమానికి రూ.40 వేల కోట్లు కేటాయించి, దేశంలోనే తొలిసారిగా బిసి సబ్‌ప్లాన్, ఆదరణ-2 పథకం, 90% రాయితీతో ఆధునిక యంత్రాలు, పనిముట్లు అందచేస్తున్నారు. ఎస్సీల సంక్షేమానికి రూ.42,254 కోట్లు, ఎస్టీలకు రూ. 14,210 కోట్లు బడ్జెట్ కేటాయింపులు చేశారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఉపకార వేతనాలు, ఫీజుల చెల్లింపు జరుగుతోంది. కాపు కార్పొరేషన్‌కు గత 4 ఏళ్ళలో రూ.3,100 కోట్లు కేటాయించారు. ఎన్టీఆర్ విదేశీ విద్య, జాబ్‌మేళా, ఋణమేళాలు, నైపుణ్య శిక్షణ, కాపు భవనాల నిర్మాణం, కాపు రిజర్వేషన్ల కోసం రిజర్వేషన్ బిల్లు ఆమోదం వంటి పనులను చేశారు. 213 కోట్లతో చంద్రన్న పెళ్ళి కానుకలు ఇచ్చారు. బీసీలకు 35 వేలు, ఎస్టీలకు 45 వేలు, ఎస్సీలకు 50 వేలు, ముస్లింలకు దుల్హన్ పథకం కింద మరో 50 వేలు ఇస్తున్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు గత 4 ఏళ్ళలో 285 కోట్లు కేటాయించారు. పేద బ్రాహ్మణులకు చదువు, ఉపాధితో ఆర్థిక సాయం, పింఛన్లు, స్వయం ఉపాధి కల్పించారు. 18 లక్షల ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ, వికలాంగుల విద్యార్థులకు రూ. 11,342 కోట్లు స్కాలర్‌షిప్‌లుగా అందించారు. ఎన్టీఆర్ వైద్యసేవల ద్వారా 17.14 లక్షల మంది పేదలకు రూ. 4,758 కోట్లతో ఉచిత వైద్య సేవలు అందించారు. 2.5 కోట్ల అసంఘటిత కార్మికులకు 2 లక్షల నుండి 5 లక్షల వరకు చంద్రన్న బీమా భరోసా కల్పించారు. ఇప్పటికి 2 వేల కోట్లు చంద్రన్న బీమా క్లెయిమ్స్‌గా చెల్లించారు.

రాష్ట్రంలో ప్రతిగ్రామానికి సిసి రోడ్లు వేయాలనే లక్ష్యంతో రాష్ట్రం మొత్తం 24 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించారు. క్రిస్టియన్, సంక్రాంతి, రంజాన్ పండుగల కానుకలను పెద్దఎత్తున అందచేశారు. ఎన్టీఆర్ హౌసింగ్ క్రింద 80 వేల కోట్లతో 30 లక్షల ఇళ్ళ నిర్మాణం చేపట్టి, ఇప్పటికి 10 లక్షల ఇళ్ళ నిర్మాణం పూర్తిచేశారు. పట్టణ ప్రాంతాల్లో జి+3 ఇళ్ళను నిర్మిస్తూ ప్రభుత్వ, పోరంబోకు స్థలాల్లో లబ్ధిదారులకు ఇళ్ళ స్థలాలను మంజూరు చేశారు. కృష్ణాజలాలు సకాలంలో రాకపోవటంతో 2016లోనే రూ. 1,600 కోట్ల వ్యయంతో పట్టిసీమ ప్రాజెక్టు నిర్మాణాన్ని నిర్ణీత గడువులోపే పూర్తి చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా - గోదావరి నదులను అనుసంధానం చేశారు. రెండు ప్రధాన నదులు అనుసంధానం కావటం దేశంలో ఇదే మొదటిసారి. పట్టిసీమ ద్వారా గోదావరి నీళ్ళను కృష్ణాడెల్టాలోని 13 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఇచ్చి, శ్రీశైలం నుండి కృష్ణాజల్లాలను పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమకు అందించారు. దీంతో కృష్ణాడెల్టాలో దాదాపు 10వేల కోట్ల పంట దిగుబడులను కాపాడారు. కరువు సీమలోని రైతుల కన్నీళ్ళను తుడవగలిగారు.

మరోవైపు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను కూడా 64% పూర్తి చేశారు. ఇప్పటికి రూ. 10,500 కోట్లు ఖర్చు చేశారు. విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాల్సి ఉన్నా, ఆ నిధులను సక్రమంగా ఇవ్వకపోవటంతో రాష్ట్ర బడ్జెట్ నుండే నిధులను కేటాయించి, ప్రాజెక్టు పనులలో వేగం పెంచారు. రాష్ట్ర ప్రభుత్వం పోలవరం కోసం ఖర్చుపెట్టిన ఖర్చులో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికి 3 వేల కోట్లు బకాయిగా చెల్లించాల్సి ఉంది. స్పిల్‌వే పనులను కూడా పూర్తి చేసి 550 టన్నుల బరువు కలిగిన తొలి గేటును కూడా సిఎం చేతుల మీదుగా అమర్చారు. మరోప్రక్క ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. అమరావతి ప్రాంతంలోని రైతులు అత్యంత ఖరీదైన 34 వేల ఎకరాల భూములను ఒక్క రూపాయి ఆశించకుండా రాజధాని నిర్మాణానికి ఇచ్చారు. ఇంతటి అమూల్యమైన కానుకను రైతులు ఇవ్వటానికి ఉన్న ఏకైక కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దక్షత, పరిపాలనా సమర్థత ఒక్కటే. పదేళ్ళపాటు ఏపికి కూడా హైదరాబాద్ రాజధానిగా ఉన్నా, తొలి అసెంబ్లీ సమావేశాలను కూడా హైదరాబాదులో కాకుండా ఎపి నుండే చంద్రబాబు మొదలుపెట్టారు. 2 ఏళ్ళలోనే తాత్కాలిక శాసనసభ నిర్మాణాన్ని పూర్తి చేసి అసెంబ్లీ సమావేశాలను రాజధాని అమరావతిలో ఏర్పాటు చేశారు. ఇప్పుడు సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం వంటి నిర్మాణాలను వందల అడుగుల ఎత్తులో ప్రపంచం గుర్తించేలా పనులను చేపట్టారు. వీటితో పాటు కృష్ణానదిపై పవిత్ర సంగమం దగ్గర 1300 కోట్లతో కూచిపూడి నాట్య భంగిమతో ఐకాన్ బ్రిడ్జి, మరో2,200 కోట్లతో దాములూరు-వైకుంఠపురం వద్ద మరో బ్రిడ్జి పనులను చేపట్టారు. కనకదుర్గ ఫ్లైఓవర్ పనులను 90 శాతం పూర్తి చేశారు. విజయవాడ ప్రజలకు ఇసుమంత ఇబ్బంది లేకుండా ఫ్లైఓవర్ పనులను సక్సెస్ చేశారు. కియా మోటార్స్, హీరో, అపోలో టైర్స్, ఇసుజు, అశోక్ లేల్యాండ్‌వంటి దేశ విదేశీ కంపెనీల స్థాపనకు కృషి చేశారు. తద్వారా లక్షల ఉద్యోగాలకు మార్గం సుగమం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను 43% పెంచారు. కృష్ణ, గోదావరి నదుల పుష్కరాలను ఘనంగా నిర్వహించారు.

ఇవన్నీ ఒక ఎత్తైతే వీటన్నింటికి మించిన ధీరోదాత్తమైన యుద్ధాన్ని కూడా చంద్రబాబు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసగించిన మోదీ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి తిరగబడ్డారు. విభజన చట్టంలోని ప్రతి హామీని నెరవేర్చాలని, తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలని పోరుబాటలో నడిచేందుకు సంకల్పం చేపట్టారు. 5 కోట్ల ఆంధ్ర ప్రజల భవిష్యత్తు కోసం 11 ధర్మపోరాట దీక్షలు చేశారు. ఇటు రాష్ట్రంలోను, అటు కేంద్రంలోను నవ్యాంధ్ర అభివృద్ధే లక్ష్యంగా రోజుకు 18 గంటలు పనిచేశారు. ఇన్ని పనులు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎంత కూలీ ఇవ్వాలి? అనే నిర్ణయాధికారం సీమాంధ్ర ఓటరు మహాశయులదే. పనిచేసిన వ్యక్తి కూలి అడగటం ఎంత ధర్మమో, పనికి తగ్గ గుర్తింపు, గౌరవం ఇవ్వటం కూడా ప్రజలకు అంతే ధర్మం.

-పోతుల బాలకోటయ్య 98497 92124



ద్వైపాక్షిక సహకారం, అంతర్జాతీయ సమస్యలపై
మోదీ, పుతిన్ టెలిఫోన్ సంభాషణ



న్యూఢిల్లీ, జనవరి 7: భారత్-రష్యా దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని ఇచ్చిపుచ్చుకోవడంతోపాటు, టెర్రరిజం, అంతర్జాతీయంగా నెలకొన్న పలు సమస్యల పరిష్కారంలో ముందడుగు వేసేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నిర్ణయించారు.

ఈ మేరకు వారిద్దరూ టెలిఫోన్ ద్వారా సంభాషించినట్టు ఉభయ దేశాల దౌత్యవర్గాలు తెలిపాయి. ఈ ఏడాది భారత్‌లో జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో నరేంద్ర మోదీ విజయం సాధించాలని రష్యా అధ్యక్షుడు అభిలషించినట్టు ఆ వర్గాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తున్న ఉగ్రవాదంపై సమష్టిగా పోరాడేందుకు, ప్రపంచవ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యల పరిష్కారానికి పరస్పర సహకారాన్ని అందిపుచ్చుకోవాలని ఇరు దేశాల నేతలు ఒక అంగీకారానికి వచ్చినట్టు ఆ వర్గాలు తెలిపాయి. ప్రధానంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారంతోపాటు, అంతర్జాతీయంగా నెలకొన్న పలు కీలక అంశాలపై మోదీ, పుతిన్ దృష్టి సారించినట్టు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లో వ్లాడివోస్టాక్‌లో నిర్వహించే ఈస్టర్న్ ఎకనామిక్ ఫోరమ్‌లో పాల్గొనాలని భారత ప్రధాని మోదీని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆహ్వానించినట్టు ఆ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఇరు దేశాల నేతలు ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నట్టు ఆ వర్గాలు స్పష్టం చేశాయి.

కోటా ఎన్నికల ఎత్తుగడే

*** ఓటమి భయంతోనే ఈ బుజ్జగింపు యత్నం**
*** మోదీ సర్కారుపై కాంగ్రెస్ నిప్పులు**

న్యూఢిల్లీ, జనవరి 7: సాధారణ కేటగిరీలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్వరంతో ధ్వజమెత్తింది. ప్రజలను మోసగించే ఎన్నికల జిమ్మిక్కుగా ఈ నిర్ణయాన్ని అభివర్ణించింది. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కడ ఓడిపోతామోనన్న భయంతోనే మోదీ సర్కారు ఈ కోటా ఎత్తు వేసిందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వి ఆరోపించారు. ఇందుకు సంబంధించిన రాజ్యాంగ సవరణలను పార్లమెంటులో ఆమోదించుకునే సత్తా లేకపోవడం వల్లే మోదీ ప్రజలను తప్పుదోవ పట్టించే ఈ చర్యలకు పాల్పడ్డారని సింఘ్వి అన్నారు.



కేంద్రంలో అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాల ఎనిమిది నెలల కాలంలో తీసుకోని ఈ కోటా నిర్ణయాన్ని ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చేపట్టడాన్ని ఆయన ప్రశ్నించారు. మరో మూడు నెలల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే ఈ రిజర్వేషన్ల నిర్ణయం చేపట్టలేం కాబట్టే మోదీ ప్రభుత్వం ఈ రాజకీయ జిమ్మిక్కుకు పాల్పడిందని అన్నారు. పైగా ఎట్టిపరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న నిబంధన ఉందని, అయితే, కేంద్రం తీసుకున్న ఈ తాజా నిర్ణయంలో అంతరార్థం 'రిజర్వేషన్ కల్పించడానికి మేము ప్రయత్నించాం' అని చెప్పుకోవడానికేనని సింఘ్వి అన్నారు. ఈ నిర్ణయం ద్వారా ఇటు ప్రజలను, అటు దేశాన్ని తప్పుదోవ పట్టించడానికి, మోసగించడానికి ప్రభుత్వం పాల్పడిందని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పటికి కూడా గరిష్ఠస్థాయిలో 50 శాతానికి మించి రిజర్వేషన్లు మించకూడదన్న బాలాజీ చట్టంగా అమల్లో ఉందని ఆయన ఉద్ఘాటించారు. అయితే, ఈ విషయంలో తమిళనాడుకు మినహాయింపు ఉందని, అందుకు కారణం అక్కడ కోటాకు సంబంధించిన కేసు ఇంకా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండడమేనని ఆయన అన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించడాన్ని కోర్టు కొట్టివేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ప్రాథమిక సమానత్వ ప్రాతిపదికన రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న బాలాజీ తీర్పు స్పష్టం చేస్తోందని, ఇదే విషయం ఇందిరా సాహ్నీ కేసులోనూ మరోసారి రుజువైందని ఆయన తెలిపారు. ఇటీవల జరిగిన నాగరాజు సమీక్షలో కూడా ఈ ప్రాథమిక సిద్ధాంతాన్ని మార్చలేదన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.



ఈవీఎంలపై అనుమానం అక్కర్లేదు

*** అవి ట్యాంపర్డ్ ప్రూఫ్ * మరోసారి నిర్ధారణ**
*** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సునీల్ అరోరా స్పష్టీకరణ**

చండీగఢ్, జనవరి 7: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎంలు) ట్యాంపర్డ్ ప్రూఫ్ అని తేలిందని, వాటి పనితీరును పరిశీలించడానికి ఏర్పాటైన నిపుణుల కమిటీ ఈ విషయాన్ని నిర్ధారించిందని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సునీల్ అరోరా చెప్పారు. పోస్టు గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి (పీజీఐఎంఈఆర్) నూతన అకాడమిక్ విభాగ ప్రారంభ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈవీఎంల పనితీరు గురించి మనం అనుమానించాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని స్పష్టం చేశారు. ఎంతో మంది టెక్నోక్రాట్లు హాజరైన ఈ కార్యక్రమంలో దాని గొప్పతనాన్ని మరోసారి వివరిస్తున్నానని, పలువురు అత్యున్నత సాంకేతిక నిపుణులతో కూడిన కమిటీ ఈవీఎంల మొత్తం పనితీరును క్షుణ్ణంగా పరిశీలించిందని, అవి నూరు శాతం లోపరహితమని నిర్ధారణ అయ్యాయని తెలిపారు.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఈవీఎంలు ట్యాంపరింగ్ అయ్యాయని, ఎవరు ఓటు వేసినా అవి ఒక పార్టీకి అనుకూలంగా నమోదయ్యేలా మార్పులు చేస్తున్నారని కొన్ని పార్టీల వారు చేసిన విమర్శలను ఆయన ప్రస్తావిస్తూ దీనిని ట్యాంపరింగ్ చేయడానికి ఇది మిషన్ ఎంతమాత్రం కాదన్న విషయం ప్రతిపౌరుడు తెలుసుకోవాలని ఉద్ఘాటించారు. ట్యాంపరింగ్‌కు, సరిగ్గా పనిచేయకపోవడానికి తేడా ఉందని, ఏ మిషన్ అయినా సరిగ్గా పనిచేకపోవచ్చునని అన్నారు. మీరు ఒక కారు కొంటారు.. అది వారంలోనే సరిగ్గా పనిచేయకపోవచ్చునని ఆయన తెలిపారు. 2014 నుంచి ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నామని, అప్పటి నుంచి దీనిపై కొందరు నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారని అన్నారు. 2014లో జరిగిన ఎన్నికల్లో ఎక్స్‌అనే పార్టీకి అనుకూలంగా ఫలితాలు వచ్చాయనుకుందాం.. తర్వాత ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో వై అనే పార్టీకి అనుకూలంగా, ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పలు పార్టీలకు అనుకూలంగా వచ్చాయని అనుకుందాం.. అయితే ఇక్కడ ఎక్స్‌కు అనుకూలంగా ట్యాంపరింగ్ జరిగిందా, లేదా వైకు అనుకూలంగా ట్యారింగ్ చేశారా? ఐదు రాష్ట్రాల్లో వివిధ రకాలుగా ట్యాంపరింగ్ చేశారా? ఆయా పార్టీల ఓటమికి ఈవీఎంల ట్యాంపరింగ్ కారణమా అని ఆయన ప్రశ్నించారు. భారత ఎన్నికల కమిషన్ ప్రపంచంలోనే పెద్దదని, ప్రజాస్వామ్య విధానాలను పరిరక్షిస్తూ స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేస్తుందని అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల ఎన్నికల కమిషన్‌కు పెద్దసవాలని, దీనిని సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రయత్నిస్తామని సునీల్ అరోరా తెలిపారు.

రాబర్ట్ వాద్రాపై మనీ లాండరింగ్ కేసు

క్రిమినల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఈడీ

న్యూఢిల్లీ, జనవరి 7: కాంగ్రెస్ నేత సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా మరో చిక్కుల్లో పడ్డాడు. హర్యానాలోని గుర్గావ్‌లో భూమి వ్యవహారాల్లో అతనికి సంబంధించిన సంస్థలో ఆర్థిక, ఇతర అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వాద్రాపై ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీలాండరింగ్ కేసును నమోదు చేసింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఈ కేంద్ర దర్యాప్తు సంస్థ అతనిపై క్రిమినల్ ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసిందని అధికారులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి వాద్రాతో సంబంధం ఉన్న ముగ్గురు వ్యక్తుల ఇళ్లు, కార్యాలయాల్లో గత ఏడాది డిసెంబర్‌లో ఈడీ సోదాలు నిర్వహించిన అనంతరం వాద్రాపై తాజాగా ఈ కేసు నమోదు చేసినట్టు చెప్పారు. కొందరు అనుమానితుల నుంచి రక్షణపరమైన ఒప్పందాలకు సంబంధించి కమీషన్లు ముట్టాయని, విదేశాల్లో అక్రమంగా ఆస్తులు కూడబెట్టారని వచ్చిన సమాచారం మేరకు తాము ఈ సోదాలు నిర్వహించినట్టు తెలిపారు.



వాద్రాకు చెందిన సంస్థగా భావిస్తున్న స్కైలైట్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ 2008లో గుర్గావ్‌లోని సెక్టార్ 83లో ఓంకారేశ్వర్ ప్రాపర్టీస్ నుంచి 3.5 ఎకరాల భూమిని 7.50 కోట్లకు కొనుగోలు చేసింది. ఆ సమయంలో హర్యానాలో కాంగ్రెస్‌కు చెందిన భూపేందర్ సింగ్ హూడా ముఖ్యమంత్రిగా ఉన్నారు. అంతేకాకుండా ఆయనే టౌన్, కౌంటీ ప్లానింగ్ శాఖకు మంత్రిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఆ భూమిని అభివృద్ధి చేసేందుకు హూడా సహకారంతో కమర్షియల్ లైసెన్స్ కూడా పొందిన స్కైలైన్ ఆ భూమిని రియల్‌ఎస్టేట్ దిగ్గజం డిఎల్‌ఎఫ్‌కు 58 కోట్ల రూపాయలకు అమ్మేసింది. అంటే ఆ కంపెనీకి 50 కోట్ల రూపాయల లాభం చేకూరింది. అనంతరం హర్యానా రాష్ట్ర ప్రభుత్వం గుర్గావ్‌లోని వజీరాబాద్‌లో 350 ఎకరాల భూమిని నిబంధనలకు వ్యతిరేకంగా డీఎల్‌ఎఫ్‌కు కట్టబెట్టింది. ఈ వ్యవహారంలో రాబర్ట్ వాద్రా, డిఎల్‌ఎఫ్ మధ్య క్విడ్ ప్రో క్యూయో (నీకది, నాకిది) జరిగిందని, ఐదు వేల కోట్లరూపాయలు చేతులు మారాయని ఆరోపిస్తూ హర్యానా పోలీసులు స్కైలైట్‌పై ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. దీనిపై ఈడీ సైతం విచారణ చేపట్టింది. రాజస్థాన్‌లోని బికనీర్‌లో భూమి వివాదానికి సంబంధించి, ఆయుధాల డీలర్ సంజయ్ భండారితో సంబంధాలు, విదేశాల్లో అక్రమంగా ఆస్తులు కూడబెట్టడం ఆరోపణలపై దాఖలైన రెండు పీఎంఎల్‌ఏ కేసులకు సంబంధించి వాద్రాను విచారించింది. అంతేకాకుండా గుర్గావ్‌లోని మనేసర్ ప్రాంతంలో జరిగిన ఇదేవిధమైన భూమి వ్యవహారానికి సంబంధించి మాజీ సీఎం హూడా పాత్రపై సైతం ఈడీ విచారణ జరుపుతోంది.

అంగన్‌వాడీల్లో దొంగలు

*** కేంద్ర మంత్రి మేనకాగాంధీ వ్యాఖ్య * అవార్డుల కార్యక్రమంలో కలకలం * తమను అవమానించారని కార్యకర్తల ఆవేదన**

న్యూఢిల్లీ, జనవరి 7: దేశ వ్యాప్తంగా అంగన్‌వాడీల్లో జరుగుతున్న అకవతవకలపై కేంద్ర మహిళ, శిశు సంక్షేమశాఖ మంత్రి మేనకాగాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల్లో బోగస్ లబ్ధిదారులున్నట్టు వచ్చిన కథనాలపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'పిల్లల నోటివద్ద తిండి దొంగిలించడం దేశద్రోహం కంటే ప్రమాదకరం'అని ఆమె తీవ్రంగా హెచ్చరించారు. విశేష సేవలందించిన 97 మంది అంగన్‌వాడీలకు కేంద్ర మహిళా, అభివృద్ధి మంత్రిత్వ శాఖ అవార్డులు ప్రదానం చేసింది. అవార్డుల ప్రదాన కార్యక్రమంలో మంత్రి మేనకాగాంధీ మాట్లాడుతూ ఎవరి కోసం పథకం ప్రవేశపెట్టారో వారికి ఆ ఫలాలు అందకపోతే నిష్ప్రయోజనం అవుతుందనని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి తీవ్ర నష్టమే కాకుండా పిల్లలూ పోషకాహారానికి దూరమవుతారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరేళ్ల లోపుబాలబాలికలకు పౌష్టిహారం అందించే బాధ్యత అంగన్‌వాదీలపై ఉంది. ఓ పక్క అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రశంసిస్తూ విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని ఆమె పిలుపునిచ్చారు. అక్రమాలను అరికట్టి నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు ఆధార్ అనుసంధానం అమల్లోకి తీసుకొచ్చినట్టుమేనకాగాంధీ స్పష్టం చేశారు. అస్సాంలో మూడు లక్షలు, జార్ఖండ్‌లో లక్ష, యూపీలో 14 లక్షలు బోగస్ లబ్ధిదారులను మంత్రిత్వశాఖ గుర్తించినట్టు ఆమె తెలిపారు. ఒక చిన్నారిపై రోజుకు 10 రూపాయలు ఖర్చుపెడుతున్నామనుకుంటే అస్సాంలో 30 లక్షల రూపాయలు, యూపీలో 1.4 కోట్ల రూపాయలు రోజులు దోపిడీ జరుగుతున్నట్టు మేనకా చెప్పారు. అవార్డులు బాధ్యతలను మరింత పెంచుతాయన్న మంత్రి ' అక్రమాలు మీ దృష్టికి వస్తే పై అధికారులకు తెలపండి. నిధులు స్వద్వినియోగం అయ్యేలా సహకరించండి. ఆహారపుదొంగలపై ఓ కన్నేసి ఉంచండి'అని పిలుపునిచ్చారు.

అవార్డుల కార్యక్రమంలో మంత్రి చేసిన వ్యాఖ్యలు అంగన్‌వాడీల్లో కలకలం రేపాయి. 'మేం ఎంతో కష్టపడుతున్నాం. మా జీవితాన్ని ధారబోసి పనిచేస్తున్నాం. అలాంటిది మంత్రి కించపరిచేలా మాట్లాడడం ఎంతో బాధకలిగించింది'అని కార్యక్రమానికి హాజరైన ఓ అంగన్‌వాడీ వర్కర్ వాపోయింది. మంత్రి ఆధార్ గురించి మాట్లాడుతున్నారని, ఎంత మంది పిల్లలకు ఆధార్ కార్డులున్నాయని ఆమె ప్రశ్నించింది. ఆధార్ కార్డులేదని లబ్ధిదారుల జాబితాను వారి పేర్లను తీసివేయలేం కదా? అని అంగన్‌వాడీ వర్కర్ వాపోయింది. యూపీ నుంచి ఎంతో శ్రమకోర్చి ఇక్కడకు వస్తే మంత్రి మేనకాగాంధీ మాటలను బాధించాయని,తమను దొంగల్లా మాట్లాడడం దారుణమని మరో కార్యకర్త ఆందోళన వ్యక్తం చేసింది. సర్వేలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన ఉండదని లక్నో నుంచి వచ్చిన ఓ ఐసీడీఎస్ అధికారి స్పష్టం చేశారు. ఒక్కడైన జాబితాలో ఒకరి అరా పొరపాటు ఉండొచ్చని అంత మాత్రం చేత అంగన్‌వాడీలందరూ దొంగలు అని అనడం అన్యాయమని కార్యకర్తలు వాపోయారు.



2017-18 సంవత్సరానికి గాను నిరుపమాన ఫలితాలు సాధించిన ఓ అంగన్‌వాడీ కార్యకర్తకు సోమవారం ఢిల్లీలో జాతీయ అవార్డును ప్రదానం చేస్తున్న కేంద్ర మహిళా శిశు వికాస మంత్రి మేనకాగాంధీ

తెలుగు రాష్ట్రాల అంగన్‌వాడీలకు అవార్డులు

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 7: తెలుగు రాష్ట్రాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన అంగన్‌వాడీ కార్యకర్తలకు జాతీయస్థాయిలో పురస్కారాలు లభించాయి. ఢిల్లీలో కేంద్ర శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన కార్యకర్తలకు సోమవారం ఆ శాఖ మంత్రి మేనకా గాంధీ పురస్కారాలను అందజేశారు.

తెలంగాణ నుంచి ఖమ్మం జిల్లాలోని ఎన్కూర్‌కు చెందిన బండ్ల సుశీల, వికారాబాద్ జిల్లా సిద్ధులూరుకు చెందిన జె.విజయలక్ష్మికి అవార్డులు లభించాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ అమలాపురానికి చెందిన ఎంసీ పద్మావతికి, అనంతపురానికి చెందిన జె.రమాదేవికి, కృష్ణా జిల్లాకు చెందిన నుండాది సువర్ణలత, గద్దల వెంకట్రావమ్మలకు అవార్డులు లభించాయి.

ఇది రాజకీయ కక్ష సాధింపే

అఖిలేష్‌కు అండగా నిలుస్తాం * బీఎస్పీ, కాంగ్రెస్, ఆప్ ప్రకటన

లక్నో/న్యూఢిల్లీ, జనవరి 7: అక్రమ మైనింగ్ కేసులో ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌ను సీబీఐ విచారించనున్నదన్న నేపథ్యంలో ఆయనకు భారీగానే రాజకీయ మద్దతు లభిస్తోంది. బీఎస్పీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఈ కేసుకు సంబంధించి అఖిలేష్‌కు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. అంతేకాదు, కేంద్రంలోని బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఈ పార్టీల నేతలు ఆరోపించారు. లోక్‌సభలో కూడా ఈ వ్యవహారం ప్రకంపనలు పుట్టించింది. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు కాగితాలు చింపి స్పీకర్ వేదికపైకి విసిరారు. అయితే, ఈ అక్రమ మైనింగ్‌కు సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, అఖిలేష్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు అతని కార్యాలయం ఒకెరోజు 13 ప్రాజెక్టులను ఆమోదించిందని సీబీఐ అధికారులు చెబుతున్నారు. ముఖ్యమంత్రిగానే కాకుండా గనుల మంత్రిగా కూడా పోర్టుపోలియో నిర్వహించిన అఖిలేష్ 14 లీజులను ఆమోదించారని, వాటిలో 2013 ఫిబ్రవరి 17న 13 ప్రాజెక్టులకు అధికారికంగా అనుమతి లభించిందని సీబీఐ తెలిపింది. ఇదంతా కూడా ఈ-టెండరింగ్ ప్రక్రియకు విరుద్ధంగానే జరిగిందని అధికారులు స్పష్టం చేశారు. కాగా, ఇటీవలే సమాజవాది పార్టీతో ఎన్నికల పొత్తు కుదుర్చుకున్న బీఎస్పీ అధినేత్రి మాయావతి అఖిలేష్‌కు ఫోన్ చేసి తన మద్దతు తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీ మాదిరిగానే ఇప్పుడు బీజేపీ కూడా సీబీఐని రాజకీయ కక్షసాధింపు చర్యలకు ఉపయోగించుకుంటోందని మాయావతి అన్నారు.

జీడీపీ వృద్ధికి ఊతం

*** 7.2 శాతానికి పెరిగే అవకాశం**

న్యూఢిల్లీ, జనవరి 7: వ్యవసాయ ఉత్పాదక రంగాలు గణనీయమైన ప్రగతిని సాధించిన నేపథ్యంలో కొత్త ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7.2 శాతానికి పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన వ్యవసాయ, తయారీ రంగాలు అద్భుతమైన పురోగతిని సాధించాయని, వీటి ప్రభావం ఫలితంగానే 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వృద్ధిరేటు 7.2 శాతానికి పెరిగే అవకాశం ఉందని కేంద్ర గణాంకాల కార్యాలయం సోమవారం తెలిపింది. 2017-18 సంవత్సరంలో 6.7 శాతం ఉన్న జీడీపీ వృద్ధిరేటు కొత్త ఆర్థిక సంవత్సరంలో 7.2 శాతానికి పెరిగే అవకాశాలు గణనీయంగా కన్పిస్తున్నాయని తెలిపింది. ఆర్థికవేత్తల అంచనాల ప్రకారం దేశంలో వృద్ధిరేటు క్రమానుగతంగా పెరుగుతోందని కేంద్ర గణాంకాల కార్యాలయం తన నివేదికలో స్పష్టం చేసింది.



స్టీల్ కంచెకు ఓకే

మెట్టుదిగిన ట్రంప్ * త్వరలో షట్‌డౌన్ ఎత్తివేస్తామని ప్రకటన

వాషింగ్టన్, జనవరి 7: సరిహద్దు వద్ద కాంక్రీట్ గోడను నిర్మించి తీరాలని ఇంతకాలం పట్టుబడుతూ వస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మెట్టు దిగారు. మెక్సికోసరిహద్దులో కాంక్రీట్ గోడకు బదులుగా స్టీల్ కంచెను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. సరిహద్దులో గోడ నిర్మాణానికి నిధులు విడుదల చేసేందుకు డెమోక్రాట్లు అంగీకరిస్తేనే ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదిస్తామని ట్రంప్ ప్రకటించడం, దానికి డెమోక్రాట్లు నో అనడంతో దేశంలో పాక్షిక షట్‌డౌన్ కొనసాగుతోంది. గోడ నిర్మాణానికి అంగీకరించాలని, లేకపోతే పాక్షిక షట్‌డౌన్ కొనసాగుతుందని భీష్మించిన ట్రంప్ గోడ కాకపోయినా ఉక్కు కంచెనైనా ఏర్పాటు చేయాలని కోరారు. అమెరికా-మెక్సికో సరిహద్దు వద్ద గోడ నిర్మాణానికి ఐదు వేల యూఎస్ డాలర్ల నిధులు ఇవ్వడానికి డెమోక్రాట్లు అంగీకారం తెలపకపోవడంతో గత ఏడాది డిసెంబర్ 22 నుంచి అమెరికాలో పాక్షిక షట్‌డౌన్ కొనసాగుతోంది. సరిహద్దు భద్రతకు సంబంధించి 1.3 మిలియన్ డాలర్లు మాత్రమే విడుదల చేయాలని సభలో మెజారిటీ సభ్యులున్న డెమోక్రాట్లు పట్టుబడుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్ ప్రెసిడెంట్ మైక్ పీన్స్, స్పీకర్ నాన్సి పిలోసి, సెనేట్ మైనారిటీ నేత చుక్ స్కమ్మర్‌తో ట్రంప్ ఆదివారం చర్చలు జరిపిన అనంతరం మాట్లాడుతూ తమ చర్చలు ఫలప్రదంగా ముగిసాయని చెప్పారు. మెక్సికో సరిహద్దులో కాంక్రీటు గోడ స్థానంలో ఉక్కు కంచెను ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని, ఇది పటిష్టంగా ఉండటమే కాక అక్రమ వలసదారులను నిరోధిస్తుందని అన్నారు. షట్‌డౌన్ మూడోవారంలోకి ప్రవేశించినందున డెమోక్రాట్లతో జరిపిన నిర్మాణాత్మకమైన సమావేశంలో పలు అంశాలను చర్చించామని, త్వరలోనే దీనిని ఎత్తివేస్తామని అన్నారు. సరిహద్దు భద్రత, అక్కడ ఏర్పాట్లు తదితర అంశాలు చర్చకు రాగా, సరిహద్దులో ఉక్కు కంచె ఏర్పాటు చేయాలని తాను ప్రతిపాదించానన్నారు. సరిహద్దులో గోడను నిర్మించడాన్ని డెమోక్రాట్లు వ్యతిరేకిస్తున్నందున తాను ఈ అంశాన్ని వారికి వివరించినట్టు ట్రంప్ తెలిపారు. అమెరికాలో షట్‌డౌన్ ఈనెల 12తో 22వ రోజుకు చేరుకుంటుందని, ఇది కొత్త రికార్డని, గతంలో క్లింటన్ హయాంలో 21 రోజులు కొనసాగిందని, ప్రస్తుతం పాక్షిక షట్‌డౌన్ కారణంగా దేశంలోని 8 లక్షల మంది ఉద్యోగులు పనికి హాజరుకాకపోవడం లేదా వేతనం లేకుండా పనిచేయడమో చేయాల్సి వస్తోందని ట్రంప్ తెలిపారు.

ఆ సెక్షన్ కింద ఇంకా శిక్షలు విధిస్తున్నారా?

రద్దు చేసిన 66ఎ చట్టం అమలు చేస్తుండటంపై సుప్రీం దిగ్భ్రాంతి * అమలు చేస్తున్న అధికారులను ఎందుకు జైలుకు పంపరాదని నిలదీత


న్యూఢిల్లీ, జనవరి 7: తాము ఎప్పుడో రద్దు చేసిన ఐటీ యాక్టులోని 66ఎ చట్టాన్ని ప్రయోగించి ఇంకా ప్రజలకు శిక్షలు విధించడం పట్ల సుప్రీం కోర్టు సోమవారం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. తాము 2015లోనే రద్దు చేసిన ఈ చట్టాన్ని ప్రయోగిస్తూ తమ ఆజ్ఞలు ఉల్లంఘిస్తున్న అధికారులను ఎందుకు జైలుకు పంపరాదో తెలియజేయాలని పేర్కొంటూ, దీనిపై తమ వివరణ ఇవ్వాలంటూ కేంద్రాన్ని ఆదేశించింది. ఈ చటాన్ని రద్దు చేస్తూ తాము ఇచ్చిన ఆదేశాలు అమలు చేయకుండా అమాయకులకు ఎందుకు శిక్ష విధిస్తున్నారో నాలుగు వివరాల్లోగా తమకు సమాధానం ఇవ్వాలని జస్టిస్‌లు ఆర్‌ఎఫ్ నారిమన్, వినీత్ శరణ్‌లతో కూడిన ధర్మాసనం కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది. స్వచ్ఛంద సంస్థ పియుసీఎల్ తరఫున హాజరైన న్యాయవాది సంజయ్ పారిక్ సోమవారం తన వాదన వినిపిస్తూ ఎప్పుడో మూడేళ్ల క్రితం సుప్రీం కోర్టు రద్దు చేసిన 66 ఎ చట్టాన్ని అమాయకులపై ప్రయోగిస్తూ పలువురికి శిక్షలు సైతం విధిస్తున్నారని తెలిపారు. దీనిని రద్దు చేసిన తర్వాత ఇప్పటివరకు 22 మందికి శిక్షలు అమలు చేశారని చెప్పారు. దీనిద్వారా ప్రజలకు ఉండే భావవ్యక్తీకరణ హక్కును కాలరాస్తున్నారని ఆయన తెలిపారు.



ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ యాక్టు 66ఎ అమలును సవాల్ చేస్తూ 2012లో ఒక న్యాయ విద్యార్థి పిటిషన్ దాఖలు చేశారు. వ్యక్తుల భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను హరించే చట్టాన్ని సవరించాలని విద్యార్థిని శ్రేయాసింఘాల్ కోర్టును కోరారు. శివసేన అధినేత బాలఠాకరే మృతితో ముంబయిలో బంద్ పాటించడాన్ని వ్యతిరేకిస్తూ వాఖ్యలు చేసినందుకు, ఆ వ్యాఖ్యలను సమర్థించినందుకు ఇద్దరు బాలికలు షాహీన్ దాదా, రిను శ్రీనివాసన్‌లను అరెస్టు చేయడం తగదంటూ ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. భావస్వేచ్ఛను హరించే ఐటీ యాక్టు 66ఎను వెంటనే సవరించాలని ఆమె కోరారు. తర్వాత ఈ చట్టం రాజ్యాంగబద్ధతను ప్రశ్నిస్తూ మరో కేసు దాఖలైంది. దీంతో ఈ చట్టాన్ని రద్దు చేస్తూ 2015లో సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే సుప్రీం ఈ చట్టాన్ని రద్దు చేసినా ఆ సెక్షన్ కింద కేసులు నమోదు అవుతూనే ఉన్నాయని, ఈ సెక్షన్ కింద ఇప్పటివరకు 22 మంది అమాయకులకు శిక్షలు పడ్డాయని దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ఇంకా ఈ సెక్షన్ కింద శిక్షలు పడ్తున్నాయని తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ప్రాథమిక హక్కులను కాలరాసే ఈ చట్టాన్ని ఇంకా ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించింది. దీనిపై సమాధానం ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది.

ఎవరికీ బెదిరేది లేదు

*** కేరళ హింసపై ముఖ్యమంత్రి విజయన్**
*** చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిక**



తిరువనంతపురం, జనవరి 7: శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశానికి సంబంధించి బీజేపీ, ఆరెస్సెస్‌లపై కేరళ ముఖ్యమంత్రి విజయన్ తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వాన్ని ఎవరూ బెదిరించలేరని, ఎవరికీ తలవంచే ప్రసక్తే లేదని ఆయన తెగేసి చెప్పారు. సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడిన విజయన్ గత రెండు రోజులుగా హర్తాళ్ పేరుతో రాష్ట్రంలో హింస, విధ్వంసకాండలను సృష్టించిన బీజేపీ, ఆరెస్సెస్ కార్యకర్తలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. హర్తాళ్ల సమయంలో ప్రైవేటు ఆస్తులకు నష్టం కలగకుండా నిరోధించేందుకు ఒక రక్షణ ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని తమ కేబినెట్ నిర్ణయించిందని అన్నారు. కేరళలో ప్రశాంతతను దెబ్బతీయడమే లక్ష్యంగా బీజేపీ సారథ్యంలో సంఘ్ పరివార్ శక్తులు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్న ఆయన ఉత్తరాదిలో మాదిరిగానే కేరళలో తమ ఆటలు సాగుతాయని ఈ కూటమి భావిస్తే ఎంతమాత్రం కుదరదు అని స్పష్టం చేశారు. ఒక పథకం ప్రకారమే రాష్ట్రంలో హింసాకాండను సృష్టిస్తున్నారని, అశాంతిని రేపుతున్నారని అన్నారు. మిగతా రాష్ట్రాల్లో బీజేపీ, ఆరెస్సెస్ హింసాకాండను సృష్టించినా అక్కడ వాటిపై చర్యలు తీసుకోకుండా ఉండకపోవచ్చునేమోనని, కేరళలో వారి పప్పులు ఉడకవని విజయన్ తెగేసి చెప్పారు.

టీడీపీ, వైసీపీకి ప్రత్యామ్నాయం మేమే

ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్


విలేఖర్లతో మాట్లాడుతున్న పాల్

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 7: రాష్ట్రంలో టీడీపీ, వైసీపీకి తమ పార్టీయే ప్రత్యామ్నాయమని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ కేఏ పాల్ అన్నారు. అవినీతి నిర్మూలనకు, అన్ని వర్గాల అభివృద్ధికి, బడుగు బలహీన వర్గాల శ్రేయస్సుకు ప్రజాశాంతి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ఆయన కోరారు. ప్రజాశాంతి పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ హిప్నో కమలాకర్, అద్దంకి దయాకర్ తదితరులతో కలసి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కొత్తగా హామీలు ఇస్తే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. కేంద్రంలో నరేంద్రమోదీకి వ్యతిరేకంగా ప్రజాశాంతి పార్టీ పనిచేస్తుందన్నారు. ఏ పార్టీతో పొత్తు లేకుండా, కలసివచ్చే పార్టీలను కలుపుకుని వెళ్తామన్నారు. ఢిల్లీలో కేజ్రీవాల్‌ని గెలిపించినట్టు ఇక్కడ ప్రజాశాంతి పార్టీని గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామన్నారు. దేశంలో లౌకికవాదం నిలబడడానికి మోదీకి వ్యతిరేకంగా అన్ని పార్టీలతో కలిసి పోరాటం చేస్తున్నామన్నారు. ప్రతీ నియోజకవర్గానికి రూ.100 కోట్ల చొప్పున ప్రతీ ఏటా వెచ్చిస్తామన్నారు. మార్చిలో తమ పార్టీ టిక్కెట్లు ప్రకటిస్తామన్నారు. నియోజకవర్గాల్లో రూ.100 సభ్యత్వ రుసుముతో 10వేల మంది క్రియాశీల కార్యకర్తలను చేర్పించే వారికి టిక్కెట్ ఖరారుచేస్తామన్నారు. రాష్ట్రంలో ఏడుగురు రాష్ట్ర కో-ఆర్డినేటర్లను నియమించాలని, అందులో హిప్నో కమలాకర్ చురుగ్గా పని చేస్తున్నారని పాల్ అభినందించారు. 30 రోజుల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో అన్ని నియోజకవర్గాల కో ఆర్డినేటర్లను ప్రకటిస్తామన్నారు. ఫిబ్రవరిలో బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు.

సన్‌రైజ్‌నూ అపహాస్యం చేస్తారా?

ప్రధాని వ్యాఖ్యలపై మంత్రి యనమల మండిపాటు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి యనమల

రామచంద్రపురం, జనవరి 7: ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ రాష్ట్రం పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్న ప్రధాని మోదీ చివరకు 'సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్' అంశాన్ని కూడా అపహాస్యం చేయడం దారుణమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా కె గంగవరం మండలం కోటిపల్లిలో సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. ఉదయిస్తున్న సూర్యుని మాదిరిగా సూర్యకాంతిలో నవ్యాంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలన్న ఆకాంక్షతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్‌ను ప్రస్తావించగా మోదీ మరో రాజకీయ కోణంలో విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్రంపై ప్రధానికి గల వ్యతిరేక భావనకు అద్దం పడుతోందన్నారు. విభజన కష్టాల నుండి రాష్ట్రాన్ని బయటకు తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో విశేష కృషిచేస్తుంటే ప్రధాని మోదీ అడుగడుగునా అడ్డుకుంటున్నారన్నారు. ఈ అంశాన్ని ముందుగానే గుర్తించి టీడీపీ బీజేపీ వలయం నుండి బయటకు వచ్చిందన్నారు. అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అభివృద్ధి, సంక్షేమంలో అభివృద్ధి చెందిందని పేర్కొంటూ నీతి ఆయోగ్ సంస్థ నాలుగో ర్యాంకు ఇచ్చిందని, తెలంగాణ ఆరో ర్యాంకులో ఉందని చెప్పిన విషయాన్ని వెల్లడిస్తూ రాష్ట్రం, ప్రజలు అన్ని విధాల నష్టపోవాలనే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ప్రధానిగా దేశానికి సేవలందిస్తూ, అన్ని రాష్ట్రాల అభివృద్ధిని కాంక్షించాల్సి ఉండగా, బీజేపీయేతర పాలనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను అణగదొక్కాలనే ఏకైక లక్ష్యంతో మోదీ వ్యవహరిస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి కేంద్రం రాష్ట్రానికి రూ.1300 కోట్లు చెల్లించాల్సి ఉందని, గతంలో రాష్ట్రం ముందుగా చెల్లింపులు చేసి అనంతరం కేంద్ర నిధులు సర్దుబాటు చేసుకునేదని, ప్రస్తుతం కేంద్రం చేపట్టిన వివక్ష కారణంగా కాంట్రాక్టర్లు, కూలీలకు అందాల్సిన సొమ్ములు అందడం లేదన్నారు. 2019లో జరుగబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఎన్డీఏకు వ్యతిరేకంగా ఏర్పడిన ప్రజా కూటమి, ప్రాంతీయ పార్టీల హవా నడుస్తుందని, బీజేపీ, మోదీ తిరిగి అధికారంలోకి రారని మంత్రి యనమల జోస్యం చెప్పారు. విలేఖర్ల సమావేశంలో సమావేశంలో ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు, బీజేపీ నాయకులు కర్రి చిట్టిబాబు, జడ్పీటీసీ మేడిశెట్టి రవికుమార్, అల్లూరి దొరబాబు, రేవు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాలుగు కార్పొరేషన్లకు చైర్మన్లు

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 7: రాష్ట్రంలోని నాలుగు కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయించారు. రాష్ట్ర క్రిస్టియన్ (మైనారిటీస్)ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా మద్దిరాల జోసఫ్ ఇమ్మాన్యుయేల్, సాహిత్య అకాడమీ చైర్మన్‌గా ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్, సంగీత నృత్య అకాడమీ చైర్మన్‌గా వందేమాతరం శ్రీనివాస్, జానపద కళలు, సృజనాత్మక అకాడమీ (ఫోక్ అండ్ క్రియేటివ్ అకాడమీ) చైర్మన్‌గా పొట్లూరి హరికృష్ణకు అవకాశం లభించింది. మంగళ, బుధ వారాల్లో ఇందుకు సంబంధించి జీవో విడుదల కానుంది.

కాకినాడ బీజేపి నేతలపై పోలీసు కేసులు

కాకినాడ సిటీ, జనవరి 7: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాన్వాయ్‌ను అడ్డుకున్నారనే అభియోగంపై భారతీయ జనతాపార్టీ నాయకులు, మహిళా కార్పొరేటర్లపై తూర్పు గోదావరి జిల్లా సర్పవరం పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. ఈ నెల 4వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మభూమి-మవూరు కార్యక్రమంలో పాల్గొనడానికి కాకినాడ వచ్చారు. ముఖ్యమంత్రి కాన్వాయ్‌లో వెళ్తుండగా భారతీయ జనతాపార్టీటి చెందిన వారు అడ్డగించి, బెదిరింపులకు పాల్పడినట్లుగా సర్పవరం పోలీసులు ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు కేసు నమోదుచేశారు. బీజేపికి చెందిన రాంబట్ల వెంకటేశ్వరరావు, చిట్నీడి శ్రీనివాసరావు, దువ్వూరి సుబ్రహ్మణ్యం, ఎం సురేష్, కొక్కిలిగడ్డ గంగరాజు, సాలిగ్రామ లక్ష్మీప్రసన్న, కోరాడ లక్ష్మీతులసి, ఎస్ గోపాలకృష్ణ, కరెడ్ల చెక్కారావ, యేడిద కృష్ణ, నల్లబిల్లి సుజాతలపై 341, 283, 506 సెక్షన్ల కింద సర్పవరం ఎస్సై బి తమ్మినాయుడు కేసు నమోదుచేశారు. కాగా బీజేపీ మహిళా కార్పొరేటర్ సాలిగ్రామ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం సాయంత్రం సర్పవరం పోలీసులకు ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఫిర్యాదుచేశారు. ఈఫిర్యాదుపై ఏచర్యలు తీసుకున్నారనే విషయాన్ని సర్పవరం పోలీసులు వెల్లడించలేదు.తాజాగా సర్పవరం పోలీసులు తమపై కేసు నమోదు చేసినట్లు తెలుసుకున్న బీజేపి నాయకులు ప్రభుత్వం, పోలీసులు తీరును తీవ్రంగా ఖండిస్తున్నారు.

గుడ్డు కోసం వెళితే పిండాన్నే చిదిమేశారు

★ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణిపై దాడి, గర్భస్రావం


కొత్తగూడెం వైద్యశాలలో చికిత్స పొందుతున్న పద్మ

టేకులపల్లి, జనవరి 7: గుడ్డు కోసం వెళ్లిన ఆరు నెలల గర్భిణిపై అంగన్‌వాడీలో పనిచేస్తున్న ఆయా దాడి చేయడంతో గర్భస్రావం జరిగి, తీవ్ర రక్తస్రావంతో ఆసుపత్రి పాలయింది. ఈ దారుణ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం మద్దిరాల తండా అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. అంగన్‌వాడీ కేంద్రంలో తన చిన్న పాపకు ఇచ్చే గుడ్డు కోసం వెళ్లిన గర్భిణిపై దాడి చేయడంతో అక్కడికక్కడే రోడ్డుపై గర్భస్రావం జరగడంతో రక్తస్రావం ఎక్కువై చావుబతుకుల మధ్య చికిత్స పొందుతోంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిరాల తండా గ్రామానికి చెందిన బాదావత్ పద్మ ఆరు నెలల గర్భవతి. ఇద్దరు పిల్లలు ఇంతకు ముందే ఉండటంతో చిన్న కూతురు కోసం అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే కోడిగుడ్డు కోసం సోమవారం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. ఆ అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లు సక్రమంగా అందించడం లేదని, కేంద్రంలో పనిచేస్తున్న ఆయా మాళోతు నీలను నిలదీయడంతో వారిద్దరి మధ్య ఘర్షణ తలెత్తింది. అంగన్‌వాడీ టీచర్ ఇస్లావత్ జ్యోతి సర్ది చెప్పే ప్రయత్నం చేసింది.

దీంతో ఆయా నీల తన భర్త ఈరుని పిలిచి ఇద్దరూ కలిసి పద్మపై దాడి చేశారు. పద్మ కడుపు మీద కాలితో తన్నటంతో రోడ్డుపైనే గర్భస్రావం జరిగి ఆరు నెలల పసిగుడ్డు బయటపడింది. దీంతో స్పృహ కోల్పోయి పడిపోయిన పద్మకు రక్తస్రావం అధికం కావటంతో ప్రాణాపాయ స్థితికి చేరిన ఆమెను స్థానికులు వెంటనే కొత్తగూడెం వైద్యశాలకు తరలించారు. పద్మ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు. ఈ మేరకు టేకులపల్లి ఎస్‌ఐ గడ్డం ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్యాకేజీని అప్పుడు స్వాగతించి.. ఇప్పుడు డ్రామాలా?

కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయెల్ ధ్వజం

ఆంధ్రభూమి ప్రతినిధి



న్యూఢిల్లీ, జనవరి 7: ఆంధ్రప్రదేశ్‌కు ఎన్డీయే ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వాగతించారని కేంద్ర రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయెల్ అన్నారు. పార్లమెంట్‌లో తెలుగుదేశం సభ్యులు నిరసన తెలుపుతున్న సమయంలో అక్కడికి చేరుకున్న కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు విలేఖరులను పిలిపించుకుని మాట్లాడారు. తెలుగుదేశం పార్లమెంట్ సభ్యుల తీరును మంత్రి తప్పుబట్టారు. ఏపీకి హోదాకు బదులుగా ప్రత్యేక ప్యాకేజీని కేంద్ర ప్రకటించినప్పుడు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంగీకరించారని చెప్పారు. ఇప్పుడు తెలుగుదేశం పార్లమెంట్ సభ్యులు డ్రామాలు చేస్తున్నారని అంటూ నిరసన చేస్తున్న వారిని ఉద్దేశించి పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అప్పుడు ప్యాకేజీని స్వాగతించి సంబరాలు చేసుకున్న ఆ పార్టీ నాయకులు ఇప్పుడు ఆందోళనలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి బుద్ధి చెప్పినట్లే ఏపీలో కూడా ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చేప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. విశాఖ రైల్వేజోన్ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని కేంద్రమంత్రి చెప్పారు.

బెంతు ఒరియాలకు న్యాయం చేస్తా : జగన్


ఇసుకపై కూర్చుని బెంతు ఒరియాల సమస్యలు ఆలకిస్తున్న వైసీపీ అధినేత జగన్

కవిటి, జనవరి 7: ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా వైసీపీ అధినేత జగన్ పాదయాత్ర సోమవారం శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం మాణిక్యపురంలో ప్రారంభమైంది. అక్కడి నుంచి బల్లిపుట్టుగ, కుసుంపురం వరకు సాగి భోజన విరామంఐ కోసం ఆగారు. అనంతరం ప్రారంభమైన పాదయాత్ర బొరివంక, బెజ్జిపుట్టుగ, జగతి గ్రామాల మీదుగా సాగి కొత్తూరు సమీపంలో కొబ్బరితోట వద్ద ఏర్పాటు చేసిన బస వద్ద ముగిసింది. ఈ పాదయాత్రలో జగన్‌కు దారిపొడవునా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. మాణిక్యపురంలోని బెంతు ఒరియా కులానికి చెందిన సంఘ నాయకులు తమ సమస్యలపై జగన్‌కు వినతిని అందించారు. ఈ సందర్భంగా జగన్ అక్కడే ఇసుకపై కూర్చొని వారి సమస్యలు సావధానంగా విని వినతులను తీసుకొని అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరించే విధంగా ప్రయత్నాలు చేస్తానన్నారు. బొరివంక గ్రామం వద్ద ఇద్దివానిపాలెం మత్స్యకార గ్రామానికి చెందిన మత్స్యకారులు జగన్‌ను కలిసి అనాడు వైఎస్ హయంలో 600పైగా ఇళ్లు కేటాయించగా, నేటి వరకు అవి నిర్మాణాలు పూర్తిచేసుకోలేదని, వాటిపై దృష్టి పెట్టి న్యాయం చేయాలని కోరగా, ఆ వినతులను తీసుకొని వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. లోళ్లపుట్టుగ జంక్షన్ వద్ద ఓ వికలాంగ వైసీపీ కార్యకర్తను ఆప్యాయంగా పలకరించి వికలాంగ పింఛన్ పెంపుదల చేసి ఆదుకుంటామన్నారు. బొరివంక, బెజ్జిపుట్టుగ, జగతి తదితర గ్రామాల్లో రహదారులపైకి భారీగా వచ్చిన మహిళలందరికీ జగన్ ఆప్యాయంగా పలకరించారు. సుమారు 9 కిలోమీటర్ల మేర సాగిన ఈ పాదయాత్రలో పార్టీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, రాష్ట్ర కార్యదర్శి నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాల్(లల్లూ) పాల్గొన్నారు.

1వ పేజీ తరువాయి

'హోదా'తో సమానంగా నిధులేవీ?

ప్రకటించిన ప్రత్యేక హోదాను కేంద్రం ఎందుకు అమలుచేయలేదని ప్రశ్నించారు. ప్రత్యేక హోదాకు సమానంగా రూ.16వేల కోట్ల నిధులు ఇస్తామని ప్రకటించి ఇప్పటివరకూ ఎందుకు ఇవ్వలేదని సుజనా చౌదరి ప్రశ్నించారు. వెనకబడిన జిల్లాలకు ఇచ్చిన నిధుల్ని సైతం వెనక్కి ఎందుకు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏపీ నూతన రాజధాని అమరావతికి నిధులు ఎందుకు మంజూరు చేయలేదు, విశాఖలో రైల్వేజోన్ ఎందుకు ఏర్పాటు చేయలేదు అని ప్రశ్నించారు. తమ పార్టీ సభ్యులను అక్రమంగా సస్పెండ్ చేశారని అన్నారు. అగ్రవార్ణాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర మంత్రివర్గం నిర్ణయించిందని, అయితే ఆ రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారో వివరణ ఇవ్వలేదని అన్నారు. రాష్ట్రాల్లోని జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఇచ్చే అవకాశం ఆయా రాష్ట్రాలే కల్పించుకునే విధంగా ఉండాలని కేంద్రాన్ని కోరనున్నట్టు చెప్పారు. ఈబీసీ రిజర్వేషన్లకు తెలుగుదేశం పార్టీ వ్యతిరేకంగా కాదని, కానీ ఎలాంటి అధ్యయనం చేయకుండా హఠాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవడం సరికాదని అన్నారు. సుజనా చౌదరి నివాసంలో జరిగిన విలేఖరుల సమావేశంలో నిమ్మల కిష్టప్ప, మాగంటి బాబు, సీఎం రమేష్, అవంతి శ్రీనివాస్, రామ్మోహన్ నాయుడు, కనకమేడల రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఆర్ వేషంలో శివప్రసాద్

ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని పార్లమెంట్ అవరణలో తెలుగుదేశం ఎంపీలు సోమవారం పార్లమెంట్ అవరణలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్ వేషధారణలో శివప్రసాద్ నిరసన వ్యక్తం చేశారు.

మోదీకి నాపై కక్ష

అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెట్టిన ఏకైక రాష్ట్రం ఏపీ అని అన్నారు. రాష్ట్రానికి నిధులు ఇవ్వాలని అడిగితే మన ఎంపీలపై ఐటీ, ఈడీ దాడులు చేస్తున్నారని ఆరోపించారు. అధికారం కోసం తెలుగు ఆత్మగౌరవాన్ని మంటగలిపానని మోదీ తనపై ఆరోపణ చేశారని, తెలుగువాడి ఆత్మగౌరవాన్ని కించపరిస్తే ఖబడ్దార్ అని హెచ్చరించిన నేత ఎన్టీఆర్ అని, టీడీపీ తెలుగువారి ఆత్మగౌరవం లోంచి పుట్టిందని గుర్తుంచుకోవాలన్నారు. ఎన్టీఆర్ గురించి మాట్లాడే అర్హత మోదీకి లేదని చంద్రబాబు హెచ్చరించారు. మోదీది మొదటి నుంచీ విభజించి పాలించే ధోరణి అని, పెద్ద నోట్ల రద్దు పిచ్చి తుగ్లక్ చర్య అని చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. యుద్ధ విమానాల కొనుగోళ్లలో రూ.43 వేల కోట్లు కొల్లగొట్టిన మోదీని దేశమంతా చోర్ అంటోందని ఆరోపించారు. కేంద్రాన్ని ఎదిరిస్తే కేసులు పెడుతున్నారని, అఖిలేష్, లాలూ, తృణమూల్ కాంగ్రెస్ నేతలపై సీబీఐ కేసులు పెట్టి బెదిరిస్తోందన్నారు. కేసీఆర్‌పై ఉన్న కేసును తొలగించి, రూ.43 వేల కోట్ల అవినీతి కేసులున్న జగన్‌ను తప్పించేందుకు కృషిచేస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టుకు మనం ఖర్చు చేసిన నిధుల్లో ఇంకా రూ.3600 కోట్లు ఇవ్వలేదని, ఆఖరికి ఉపాధి హామీలో కూలీ నిధులు కూడా కేంద్రం ఎగ్గొట్టిందన్నారు. జగన్‌పై కోడి కత్తితో దాడి కేవలం ప్రచారం కోసం చేసుకున్నదేనని ముఖ్యమంత్రి ఆరోపించారు. కోడికత్తి వాళ్ళు, కేంద్రం కలిసి ఎన్ఐఏ సాయంతో రాష్ట్రంపై పెత్తనం చేయాలనుకుంటున్నారన్నారు. గుజరాత్‌లో మోదీ వల్ల 2000 మంది ఊచకోత జరిగితే ఎందుకు ఎన్ఐఏ వేయలేదని చంద్రబాబు ప్రశ్నించారు. రాష్ట్రం జోలికివస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో మోదీ, జగన్, కేసీఆర్ ఆటలు సాగవని చంద్రబాబునాయుడు అన్నారు.

ఆర్టీజీఎస్..ఓ అద్భుతం

రూపకల్పన చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి రాజశేఖర్, సీఈఒ అహ్మద్‌బాబులను ముఖ్యమంత్రి పరిచయం చేశారు. గతంలో టోనీకి తనకు మధ్య ఉన్న సాన్నిహిత్యాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. ప్రపంచంలో టోనీ పాలన గొప్ప ప్రభావాన్ని చూపిందన్నారు. హైదరాబాద్‌లో తాను సృష్టించిన ఎకో సిస్టం ద్వారా జరిగిన అభివృద్ధిని గుర్తుచేసుకున్నారు. విభజన తరువాత నవ్యాంధ్ర అన్ని రంగాల్లో కింది స్థాయి నుంచి పాలనా వ్యవహారాలు మొదలు పెట్టుకోవాల్సి వచ్చిందని తెలిపారు. పరిపాలనలో ఏడు మిషన్లు, ఐదు గ్రిడ్లు నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధిని సాధిస్తున్న విధానాన్ని టోనీబ్లెయిర్‌కు విశదీకరించారు. ఆర్టీజీఎస్ పని తీరుపై అహ్మద్‌బాబు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో ఈ-ఆఫీస్‌ను అమల్లోకి తెచ్చిన విధానాన్ని పరిశీలించారు. బయోమెట్రిక్ విధానం ప్రధానంగా పాఠశాలల్లో సత్ఫలితాలనిస్తోందని చెప్పారు. పరిపాలనకు సంబంధించి ఏపీ క్లౌడ్ హబ్, బిగ్ డేటా సెంటర్‌ను ప్రారంభించనున్నట్టు ముఖ్యమంత్రి వివరించారు. భూగర్భజలాలు, రిజర్వాయర్ల సామర్థ్యం, వర్షపాతం, గాలి సాంద్రత, వాతావరణంపై రియల్‌టైం సమాచారం సేకరిస్తామని వివరించారు. వ్యవసాయరంగంలోనూ ఆర్టీజీఎస్ ఉపయోగిస్తున్న తీరును వ్యవసాయశాఖ కార్యదర్శి రాజశేఖర్ విపులీకరించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో 20వేల సీసీ కెమెరాల ఏర్పాటుపై టోనీ సంభ్రమాశ్చర్యాలను వ్యక్తంచేశారు. నాలుగువేల ప్రభుత్వ పాఠశాలల్లో వర్చువల్ తరగతులు, పాఠ్యాంశాల రూపకల్పనకు ల్యాబ్ ఏర్పాటు, డ్రోన్లు ఉపయోగించి అటవీ ప్రాంతాలు, సుదూర తీరాల్లో ఎత్తయిన కొండల్లో అక్రమంగా పెంచుతున్న గంజాయి పంటను గుర్తించి అధికారులు ధ్వంసం చేస్తున్నారని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.గ్రీవెన్స్ కేంద్రంలో మూడు వేల మంది 1100 పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తారని చెప్పారు. ఇలాంటి ఆర్టీజీఎస్ వ్యవస్థ ప్రపంచంలో ఎక్కడాలేదని టోనీబ్లెయిర్ ప్రశంసించారు. ఈ సందర్భంగా టోనీని ముఖ్యమంత్రి సత్కరించారు. ఆర్గానిక్ అరకు కాఫీ సుప్రసిద్ధమైందని తెలిపారు. అనంతరం టోనీబ్లెయిర్‌కు సీఎం ఆతిథ్యమిచ్చారు. గంటకు పైగా ఆర్టీజీఎస్ కేంద్రంలో గడిపిన టోనీబ్లెయిర్ సందర్శకుల పుస్తకంలో సంతకం చేశారు. మంత్రులు నారా లోకేష్, ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనంద్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి సతీష్ చంద్ర తదితరులు టోనీ బ్లెయిర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేటి నుంచి ఆన్‌లైన్‌లో ఐఐటీ జేఈఈ

అనుమతిస్తారు. వారిని పరీక్ష గదుల్లోకి 8.45కు అనుమతిస్తారు. 9 గంటలకు అభ్యర్థుల డాక్యుమెంట్లను పరిశీలిస్తారు. 9.15కు పర్సనల్ డాటా నింపేందుకు అనుమతిస్తారు. 9.30కు అసలు పరీక్ష మొదలవుతుంది. అదేవిధంగా సాయంత్రం పరీక్ష రాస్తున్న వారు 12.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, 1.45కు పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తారు. 2 గంటలకు అభ్యర్థుల గుర్తింపు కార్డులను, హాల్‌టిక్కెట్లను పరిశీలిస్తారు. 2.15కు కంప్యూటర్ల వద్ద అనుమతించి, 2.30కి పరీక్షను ప్రారంభిస్తారు.

ఆంధ్రాలో 19, తెలంగాణలో 7

ఆంధ్రాలో జేఈఈ పరీక్షకు 19 రీజనల్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, తెలంగాణలో ఏడు రీజనల్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అనంతపురం, బాపట్ల, భీమవరం, చీరాల, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్టణం, విజయనగరం పట్టణాల్లో రీజనల్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి, వరంగల్ పట్టణాల్లో రీజనల్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

రెండోవిడత ఏప్రిల్‌లో

రెండో విడత ఏప్రిల్ 6 నుండి 20 మధ్య నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ఫలితాలను ఏప్రిల్ 30న ప్రకటిస్తారు. అనంతరం రెండుసార్లు నిర్వహించిన జేఈఈ పరీక్ష స్కోర్‌ల ఆధారంగా నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ ఉమ్మడి స్కోర్‌ను ఇస్తుంది. ఈ స్కోర్ ఆధారంగా 2.20 లక్షల మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పోలవరంలో మహాఘట్టం

సిహెచ్ శ్రీధర్ సత్కరించి, మెమొంటో అందజేశారు. మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ప.గో. జిల్లా కలెక్టర్ భాస్కర్, పోలవరం ఈఎన్‌సీ ఎం వెంకటేశ్వరరావు తదితరులను కాంట్రాక్టు సంస్థ తరపున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన మహా కాంక్రీటు పని సోమవారం ఉదయం 8 గంటలకు ముగిసింది. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ ప్రతినిధి, పలువురు ఇంజినీరింగ్ నిపుణుల ఆధ్వర్యంలో ఈ మహాక్రతువు కొనసాగింది. 24 గంటల్లో 28వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు వేయాలని లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగగా, నిర్ణీత సమయంలో 32,315.5 క్యూబిక్ మీటర్లు కాంక్రీటు స్పిల్ ఛానల్‌లో వేసినట్టు గుర్తించారు. దీనితో గతంలో దుబాయ్ సంస్థ ఖాతాలో ఉన్న 21,580 క్యూబిక్ మీటర్ల రికార్డు చెరిగిపోయి, సరికొత్త రికార్డు నెలకొంది.

అగ్రవర్ణాలకూ రిజర్వేషన్

అగ్రవర్ణాల వారికి పది శాతం సీట్లు రిజర్వు చేసేందుకు ఒక ప్రయత్నం జరిగింది. అయితే నరసింహారావు ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల్ని సుప్రీం కోర్టు కొట్టివేయటంతో ఆ ప్రతిపాదన వీగిపోయింది. రిజర్వేషన్లు యాభై శాతానికి మించకూడదనే సిద్ధాంతానికి ఇది విరుద్ధమంటూ సుప్రీం కోర్టు అప్పట్లో నరసింహారావు ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని తోసిపుచ్చింది. బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి, రిపబ్లికన్ పార్టీ నాయకుడు, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలె కూడా చాలాకాలం క్రితం ఉన్నత వర్గాలవారికి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేయటం తెలిసిందే.

గుజరాత్‌కు చెందిన పటేల్ వర్గం, రాజస్థాన్, హర్యానాకు చెందిన జాట్లు, మహారాష్ట్రలో మరాఠాలతో పాటు మరికొన్ని ఉన్నత వర్గాలవారు రిజర్వేషన్ల కోసం పోరాటం చేయటం తెలిసిందే. మరాఠాలకు పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మహారాష్ట్ర మంత్రివర్గం ఇటీవల ఒక నిర్ణయం కూడా తీసుకున్నది. ఇదిలా ఉంటే అగ్రవర్ణాలకు కల్పిస్తున్న పది శాతం రిజర్వేషన్లు కేవలం హిందూ మతంలోని అగ్రవర్ణాల వారికి వర్తిస్తాయా? లేక ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, జైన తదితర మతాలకు చెందిన అగ్రవర్ణాల్లోని బీదవారికి కూడా వర్తిస్తాయా? అనేది స్పష్టం కావటం లేదు.

పల్లెల్లో ప్రగతి బాటలు

రోడ్ల నిర్మాణ కార్యక్రమం పల్లెల రూపురేఖల్ని మార్చేస్తోంది. ప్రతి ఏటా లక్ష్యాన్ని పెంచుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగుతోంది.22,283 కిలోమీటర్ల గ్రామీణ బీటీ రోడ్ల మరమ్మతులు, నిర్వహణకు రూ 2658 కోట్లు కేటాయించారు. రూ 3576 కోట్ల ఏఐఐబీ నిధులతో 4826 కిలోమీటర్ల నూతన రోడ్ల నిర్మాణం చేపట్టారు. శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉన్న 1002 రోడ్ల మరమ్మతు పనుల కోసం రూ 365 కోట్ల నిధులు కేటాయించారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకంలో భాగంగా 390 చోట్ల పనులు జరుగుతున్నాయి. మరో 8వేల కిలోమీటర్ల రహదారులన్నింటినీ సీసీ రహదారులుగా మార్చేయాలని పంచాయతీరాజ్ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పుడు ఉపాధి హామీ పథకం నిధుల వినియోగంలో, పనుల విషయంలో ఏపీ ప్రథమ స్థానంలో నిలిచింది. సీసీ రోడ్ల నిర్మాణం విషయంలోనూ దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ముందుంది. ఒక గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినప్పుడు ముందుగా ఎస్సీ, ఎస్టీ కాలనీల నుంచే ప్రారంభం కావాలని మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఈ పద్ధతిని విధిగా అమలు చేయటంతో మంచి ఫలితాలు సాధించారు. సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం సగం భరిస్తే మిగిలిన సగం గ్రామ పంచాయతీలు భరించాల్సి ఉంది. మైదాన ప్రాంతాల్లోని గ్రామాలకు ఇది వరంగా మారినా మారుమూల గిరిజన ప్రాంతాలకు మాత్రం ఈ పథకంలో లబ్ధి పొందడం సాధ్యం కాలేదు. 50 నుంచి 100 ఇళ్లు మాత్రమే ఉండే గూడెం పంచాయతీలకు 50 శాతం సొమ్ము భరించే శక్తిలేదు. దీంతో ఆయా తండాలకు సీసీ రోడ్లు కలగా మిగిలాయి. ఈ నేపథ్యంలో ఇలాంటి తండాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి 90 శాతం విలువను మెటీరియల్ రూపంలో అందించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చి నిధులు మంజూరు చేస్తోంది. నాణ్యత విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు అనే అంశాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోంది.రోడ్ల నిర్మాణం ఎలా జరుగుతోందో ఎప్పటికప్పుడు పరిశీలించే కార్యక్రమానికి మంత్రి లోకేష్ శ్రీకారం చుట్టారు. తాను దత్తత తీసుకున్న నిమ్మకూరు గ్రామంలో రోడ్ల నిర్మాణాన్ని తొలిసారిగా లోకేష్ పరిశీలించారు. ప్రతి జిల్లాకు రెండు డ్రోన్లను కొనుగోలు చేశారు. సిమెంట్ రహదారులే కాకుండా పరిశుభ్రత, పచ్చదనం తదితర కార్యక్రమాలన్నింటినీ పరిశీలించేందుకు వీలుగా ప్రణాళిక సిద్ధం చేశారు.పల్లెసీమల ప్రగతిపై ఆయన మాటల్లోనే 'పల్లెలకు సేవచేస్తే పరమాత్మకు సేవ చేసినట్టే..గ్రామాలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే పంచాయతీరాజ్‌శాఖ బాధ్యతలు చేపట్టా.. సీసీ రోడ్ల నిర్మాణంలో చరిత్ర సృష్టించాం.. రోడ్ల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీలేదు.. 2019 నాటికి ప్రతి పల్లెలో రోడ్లు ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని' వివరించారు. 'ఒకప్పుడు మా ఊళ్లో వాన కురిస్తే నరకమే.. మట్టి రోడ్డుపై అంతా బురదే.. సైకిళ్లు బురదలో కూరుకుపోయేవి.. నలుగురు తోస్తేకానీ ఆ బురదలో నుంచి సైకిల్ బయటకొచ్చేదికాదు.. ఇప్పుడా పరిస్థితిలేదు.. సిమెంట్ రోడ్లు వేయటంతో వాహనాలు రయ్‌మని దూసుకుపోతున్నాయి' అని పలువురు కాలనీవాసులు హర్షాతిరేకాలను వ్యక్తం చేస్తున్నారు.

క్రీడాభూమి





ఆస్ట్రేలియా గడ్డపై తొలి సిరీస్ విజయం సాధించడంతో మైదానంలోనే డ్యాన్స్ చేస్తున్న భారత జట్టు ఆటగాళ్లు. పక్కన ఆటగాళ్లతో టీమిండియా మేనేజ్‌మెంట్ సిబ్బంది ఫొటో

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీతో భారత జట్టు



చారిత్రాత్మకం

- ఆస్ట్రేలియా గడ్డపై భారత్‌కు తొలి సిరీస్ విజయం
- వర్షంతో డ్రాగా ముగిసిన చివరి టెస్టు
- నాలుగు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ 2-1తో కైవసం
- పుజారాకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్
- సోషల్ మీడియా వేదికగా టీమిండియాకు అభినందనల వెల్లువ

సిడ్నీ, జనవరి 7:

72 ఏళ్ల చరిత్రలో దిగ్గజాలకు సైతం సాధ్యం కాని కలను కోహ్లీ సేన సాకారం చేసింది! ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ గెలవాలన్న దశబ్దాల భారత జట్టు కోరికను 2-1తో సాధించి చరిత్ర సృష్టించింది! మునుపెన్నడూ లేని విధంగా తమ జట్టెంత బలియమైనదో ప్రత్యర్థి జట్లను మరోసారి హెచ్చరించింది! అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌తో ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసి ఆతిథ్య జట్టును 'కంగా రె'త్తించింది! సిడ్నీ వేదికగా జరిగిన చివరి టెస్టు ఐదో రోజు వర్షం కారణంగా మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది! నాలుగు టెస్టుల సిరీస్‌లో భారత్ ఇప్పటికే 2-1తో ముందంజలో ఉండడంతో, సిరీస్ భారత్ వశమైంది! చారిత్రాత్మక సిరీస్ విజయాన్ని సాధించిన టీమిండియాను యావత్ భారత్ ప్రశంసలతో ముంచెత్తింది!

బోర్డర్- గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ వేదికగా జరగుతున్న చివరి టెస్టు వెలుతురు లేమి, వర్షంతో రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లయింది. చివరి టెస్టులో టాస్ గెలిచి మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ ఏడు వికెట్లు కోల్పోయి 622 పరుగుల వద్ద రెండో రోజు డిక్లేర్డ్ చేసింది. ఆ తర్వాత మొదటి ఇన్నింగ్స్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టు నాలుగో రోజు ఆట ప్రారంభమైన కొద్దిసేపటికే పూర్తి వికెట్లు కోల్పోయి 300 పరుగులు చేసింది. అప్పటికే 322 పరుగుల భారీ ఆధిక్యం సాధించిన టీమిండియా ఆస్ట్రేలియాను ఫాలో ఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్ ఆస్ట్రేలియా వికెట్ నష్టపోకుండా 6 పరుగులు సాధించగా ఆటను వరుణుడు అడ్డుకున్నాడు. నాలుగో రోజు కేవలం 25.2 ఓవర్ల పాటు మాత్రమే ఆట సాగింది. ఇక చివరి రోజు వర్షంతో ఆట పూర్తిగా నిలిచిపోవడంతో మ్యాచ్‌ను అంపైర్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో నాలుగు టెస్టుల సిరీస్‌ను భారత్ 2-1తో గెలుచుకుంది. టీమిండియా టెస్టు స్పెషలిస్టు బ్యాట్స్‌మన్ చతేశ్వర్ పుజారాకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ దక్కాయి. ఈ సిరీస్‌లో అత్యధికంగా చటేశ్వర్ పుజారా 521 పరుగులు సాధించగా, బౌలింగ్‌లో జస్ప్రీత్ బూమ్రా 21, మహమ్మద్ షమీ 16, ఇషాంత్ శర్మ 11 వికెట్లు తీశారు.

కోహ్లీ ఖాతాలో రికార్డు..

భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ ఖాతాలో



మరో రికార్డు చేరింది. ఆసియా ఖండంలో ఆసియా జట్టు కెప్టెన్‌గా ఆస్ట్రేలియాను సొంత గడ్డపై ఓడించిన ఘనతను అందుకున్నాడు. ఆసియాన్ జట్లను మినహాయిస్తే ఆస్ట్రేలియాను సొంతగడ్డపై ఇంగ్లాండ్ అత్యధికంగా 13 సార్లు, వెస్టిండీస్ 4 సార్లు, దక్షిణాఫ్రికా 3 సార్లు, న్యూజిలాండ్ ఒకసారి ఓడించాయి.

విదేశీ గడ్డపై నాలుగో సిరీస్ విజయం..

కెప్టెన్ విరాట్ కోహ్లీకి విదేశీ గడ్డపై ఇది నాలుగో సిరీస్ విజయం. 2015లో శ్రీలంక గడ్డపై 2-1తో సిరీస్ గెల్చుకోగా, 2016లో వెస్టిండీస్‌తో జరిగిన రెండు టెస్టుల సిరీస్, 2017లో శ్రీలంకతో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేశారు. తాజాగా ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1తో విజయం సాధించారు.



ఇదే నాకు అతి పెద్ద ఘనత : కోహ్లీ

సిడ్నీ, జనవరి 7: ఆస్ట్రేలియా గడ్డపై 72 ఏళ్ల తర్వాత భారత్ టెస్టు సిరీస్‌ను కైవసం చేసుకోవడం తాను కెప్టెన్‌గా సాధించిన అతి పెద్ద ఘనత అని టీమిండియా సారథి విరాట్ కోహ్లీ అభిప్రాయపడ్డాడు. ఆతిథ్య ఆసిస్‌తో జరిగిన టెస్టు సిరీస్‌ను 2-1తో గెల్చుకోవడంతో ప్రస్తుత టీమ్‌కు దక్కిన 'ప్రత్యేక గుర్తింపు'గా అభివర్ణించాడు. ఎనిమిదేళ్ల క్రితం వాంఖడే స్టేడియంలో కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ నాయకత్వంలోని టీమిండియా తొలిసారిగా ప్రపంచ కప్‌ను గెల్చుకున్న సమయంలో కోహ్లీ జట్టులో అతి చిన్నవాడిగా ఉన్నాడు. ప్రపంచ కప్‌ను గెల్చుకున్న సమయంలో టీమ్‌లోని మిగిలిన ఆటగాళ్లు భావోద్వేగానికి గురైన సందర్భాన్ని కోహ్లీ గుర్తు చేసుకున్నాడు. 'ఒక ప్రత్యేకతను సాధించినపుడు సగర్వంగా తలెత్తుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ఇపుడు తన కెప్టెన్సీలో ఇపుడు అలాంటి అరుదైన, అద్భుతమైన ఘట్టాన్ని ఆవిష్కరించినందుకు ఎంతో పట్టరాని సంతోషంగా ఉంది' అని మ్యాచ్ ముగిసిన అనంతరం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సందర్భంగా కోహ్లీ పేర్కొన్నాడు. భారత క్రికెట్ చరిత్రలో సిడ్నీ మైదానంలో కొత్త అధ్యాయాన్ని లిఖించినందుకు గర్వంగా ఫీలవుతున్నామని అన్నాడు. 'నేను టెస్టు కెప్టెన్‌గా ఆస్ట్రేలియా గడ్డపై కాలుమోపాను. ఇక్కడి నుంచే మార్పు ప్రారంభమైంది. ఈ విజయం నాకెంతో ప్రత్యేకమైనది' అని కోహ్లీ పేర్కొన్నాడు. 'మా ఆటగాళ్లను చూసి నేను ఎంతో గర్వంగా ఫీలవుతున్నాను. ఈ అతి పెద్ద విజయం వారి విజయమే. ఇంతకుముందెన్నడూ మా బౌలర్లు ఇంతటి అద్భుతంగా రాణించలేదు. ఈ విజయం మా యువజట్టుకు పునాదిరాయి వంటిది' అని ప్రశంసించాడు. ముఖ్యంగా చటేశ్వర్ పుజారా, జస్ప్రీత్ బుమ్రా ఆటతీరును ప్రత్యేకంగా కోహ్లీ కొనియాడాడు. అదేవిధంగా యువ బ్యాట్స్‌మెన్ మయాంక్ అగర్వాల్, రిషబ్ పంత్‌ను సైతం భారత సారథి అభినందించాడు. గత ఏడాది దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ టూర్‌లలో సైతం తాము అద్భుతంగా రాణించామన్న కోహ్లీ సరైన పద్ధతిలో పనిచేస్తేనే భగవంతుడు కూడా నిజాయితీని తెలుసుకుంటాడని అన్నాడు. అంతకుముందు విజయం అనంతరం కోహ్లీ తన సతీమణి అనుష్కశర్మతో కలిసి విక్టరీ వాక్ చేశారు.

టీమిండియాలో భాగస్వామిని కావడం గర్వకారణం

- చటేశ్వర్ పుజారా

సిడ్నీ, జనవరి 7: ఆస్ట్రేలియా గడ్డపై బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని ముద్దాడిన టీమిండియాలో తాను కూడా భాగస్వామినైనందుకు ఎంతో గర్వంగా ఉందని సిరీస్‌లో అత్యధిక పరుగుల వీరుడు చటేశ్వర్ పుజారా అన్నాడు. ఆసిస్‌తో తలపడిన టెస్టు సిరీస్‌లో మూడు శతకాలతోపాటు 74 సగటున 521 పరుగులు చేసిన పుజారా చారిత్రాత్మక సిరీస్‌ను భారత్ కైవసం చేసుకోవడంలో కీలక భూమిక పోషించాడు. టెస్టు సిరీస్‌లో గెల్చినందుకు పుజారా 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్', 'మ్యాన్ ఆఫ్ ప్లేయర్' అవార్డులను అందుకున్నాడు. 'ఈ అద్భుత గెలుపును మేము గొప్పగా అనుభవిస్తున్నాం. జట్టు సభ్యులందరి సమష్టి కృషితోనే ఈ ఘన విజయం సాధ్యమైంది. ఆసిస్‌పై సిరీస్ గెలవడం అంత సులువు కాదు. చరిత్రలో లిఖించదగ్గ సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన జట్టులో భాగస్వామినైనందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ ఘనత సాధించిన సభ్యులందరికీ అభినందనలు' అని పుజారా పేర్కొన్నాడు. ఆసియా గడ్డపై టెస్టు సిరీస్ గెలిచిన తొలి ఆసియా జట్టుగా నిలిచిన కోహ్లీసేన 71 ఏళ్ల తర్వాత ఆసిస్ మైదానంలో 2-1తో ఘన విజయం సాధించడంలో బౌలర్ల సామర్థ్యాన్ని ప్రస్తుతించాడు. 'నలుగురు బౌలర్లతో 20 వికెట్లు తీయడం అనుకున్నంత ఈజీ కాదు. కానీ క్రెడిట్ అంతా మా ఫాస్ట్ బౌలర్లు, స్పిన్నర్లకే దక్కుతుంది.



ఇది చెప్పుకోదగ్గ, చిరస్మరణీయ ఘట్టం' అని పుజారా పేర్కొన్నాడు. ఒక బ్యాట్స్‌మన్‌గా తన శక్తిమేరకు జట్టును ఆదుకునేందుకు కృషి చేశానని, గతంలో దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ టూర్‌లలో నేర్చుకున్న మెళకువలు ఇపుడు ఎంతో దోహదపడ్డాయని అన్నాడు.

వరుసగా రెండోరోజూ లాభాల్లో ఈక్విటీలు

- 155 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్
- దోహదం చేసిన అంతర్జాతీయ మార్కెట్ స్థితిగతులు



ముంబయి, జనవరి 7: ఈక్విటీ బెంచ్ మార్కు సెన్సెక్స్ సోమవారం 155 పాయింట్లు ఎగబాకి 35,850 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న సానుకూల పరిణామాలు ఇందుకు దోహదం చేశాయని, ప్రధానంగా చైనా-అమెరికా వాణిజ్య బంధాలు మెరుగవుతాయన్న సంకేతాలు భారత మార్కెట్లకు ఊతమిచ్చాయని ఆర్థిక రంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. దేశీయ మార్కెట్లలో ద్రవ్య లభ్యత, రానున్న రోజుల్లో అధిక లాభాలు వచ్చే అవకాశాలున్నాయన్న అంచనాలు మదుపర్ల సెంటిమెంటును ప్రభావితం చేసిందని అంటున్నారు. 30 షేర్ల సూచీ సెన్సెక్స్ తొలుత తన లాభాల పరుగుకు కొనసాగింపుగా ఆరంభమై 36,000 మార్కును మళ్లీ దాటి 36,076.95 వద్ద పరుగులు తీసింది. ఐతే చివరి నిమిషాల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు పాల్పడడంతోబాటు, యూరోపియన్ మార్కెట్లలో బలహీన పరిస్థితులు నెలకొనడంతో సెన్సెక్స్ స్వల్పంగా దిద్దుబాటుకు గురై 155.06 పాయింట్లు అధిక్యంతో 0.43 శాతం లాభాలతో 35,850.16 వద్ద స్థిరపడింది. గత శుక్రవారం సెన్సెక్స్ 181 పాయింట్లు లాభపడిన సంగతి తెలిసిందే. కాగా 50 షేర్ల సూచీ నిఫ్టీ సైతం 44.45 పాయింట్లు ఆధిక్యంతో 0.41 శాతం లాభపడి 10,771.80 వద్ద ముగిసింది. ఒక దశలో 10,835.95 పాయింట్లకు ఎగబాకిన నిఫ్టీ కొంత దిదుబాటుకు గురైంది.


ఈక్రమంలో రియాల్టీ, సాంకేతిక, ఐటీ, విద్యుత్, వినిమయ వస్తువులు, బ్యాంకింగ్, చమురు, గ్యాస్ షేర్లు లాభాలను ఆర్జించాయి. అలాగే అమెరికా, చైనాలు తమ ధరల యుద్ధ సమస్యను ఉభయ తారకంగా పరిష్కరించుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ సోమ, మంగళవారాల్లో చర్చలు జరిపేందుకు నిర్ణయించడం మార్కెట్లకు ఊతం ఇచ్చింది. ఈనేపథ్యంలోనే చమురు ధరలు సైతం సరఫరాకు సంబంధించి కొంత లాభాలను చవిచూశాయి. దేశీయంగా ద్రవ్యలభ్యతను సరళతరం చేసేందుకు ఆర్బీఐ చర్యలు చేపట్టడం, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, ప్రైవేటు బ్యాంకుల్లో పెట్టుబడులు భవిష్యత్తులో లాభాలను పంచవచ్చన్న అంచనాలు మార్కెట్‌కు సానుకూలంగా మారాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ రీసెర్చ్ విభాగం అధిపతి వినోద్ నాయర్ తెలిపారు. కాగా మన దేశంలోని టాప్ సాఫ్ట్‌వేర్ సేవా రంగ ఎగుమతిదారులు టీసీఎస్, ఇన్ఫోసిస్‌లు ఈనెల 10,11 తేదీల్లో తమ త్రైమాసిక ఫలితాల నివేదికలను విడుదల చేయనున్నాయి. అలాగే చైనా సెంట్రల్ బ్యాంకు శుక్రవార విధాన నిర్ణయం (ఫ్రైడే పాలసీ)లో సౌలభ్యాన్ని ప్రకటించడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. ఈ బ్యాంకు నిల్వల్లో 100 బేసిస్ పాయింట్లు తగ్గించుకునేందుకు అంగీకరించింది.

లాభాల్లో అగ్రగామి యాక్సిస్ బ్యాంకు

సోమవారం సెన్సెక్స్‌లో లాభపడిన సంస్థల్లో ప్రైవేటు బ్యాంకు యాక్సిస్ బ్యాంకు 2.84 లాభాలతో అగ్రస్థానంలో నిలిచింది. రెండో స్థానంలో 2.64 శాతంతో టాటా మోటార్స్ నిలిచింది. అలాగే ఇన్ఫోసిస్, మారుతీ సుజుకీ, ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ, టీసీఎస్, పవర్‌గ్రిడ్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఆసియన్ పెయింట్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండియా లిమిటెడ్, ఐటీసీ లిమిటెడ్, భారతీ ఎయిర్‌టెల్, హిందూ యునీలీవర్, వేదాంత, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, కోటక్ బ్యాంకులు సైతం 1.57 శాతం లాభాలను కూడగట్టాయి.



నష్టాల్లో బజాజ్ ఆటో, యెస్ బ్యాంకు



సోమవారం మార్కెట్లో నష్టాలు చవిచూసిన సంస్థల్లో బజాజ్ ఆటో, యెస్ బ్యాంకు, హీరో మోటోకార్ప్, బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, ఎస్‌బీఐ, కోల్ ఇండియా, ఎల్ అండ్ టీ, టాటా స్టీల్ ఉన్నాయి. ఈ కంపెనీలు 2.82 శాతం నష్టాలను చవిచూశాయి. కాగా గృహ నిర్మాణం రంగం 1.55 శాతం లాభాలను, సాంకేతిక రంగం 1.16 శాతం, ఐటీ రంగం 1.11 శాతం, వినిమయ వస్తువుల రంగం 1.06 శాతం, విద్యుత్ రంగం 1.03 శాతం, బ్యాంకింగ్ రంగం 0.37 వాతం, ఎఫ్ఎంసీజీ 0.25 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ రంగం 0.18 శాతం వంతున లాభపడ్డాయి. ఐతే ఆరోగ్య, లోహ, ఆటోమొబైల్ రంగాలు నష్టాల బాటలో నడిచాయి.

వాణిజ్యభూమి

ఫెడెక్స్‌కు ఫార్చ్యూన్ మేగజైన్ గుర్తింపు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 7: పెడెక్స్‌కు ఫార్చ్యూన్ మేగజైన్ గుర్తింపు లభించింది. 2018 బెస్ట్ వర్క్‌ప్లేసెస్ ఫర్ డైవర్సిటీ జాబితాలో (వైవిధ్యత గల ఉత్తమ కార్యాలయాలు 2018లో) స్థానం లభించింది. మహిళలు ఎదుర్కొన్న అనుభవాలు, వ్యక్తుల వర్ణం (లెస్బియన్, గే, బై-సెక్సువల్, ట్రాన్స్ జెండర్, క్వీర్) సమాజంలోని సభ్యులు, బూమర్స్ (1946-55 మధ్య జన్మించిన వారు), వయో వృద్ధుల సంఖ్య ఆధారంగా వైవిధ్యతను గుర్తిస్తుందని ఫెడెక్స్ ఒక ప్రకటనలో పేర్కొంది. వైవిధ్యాన్ని, అన్ని వర్గాల వారిని మిళితం చేయడంలో తాము చూపిన నిబద్ధత కారణంగానే ఈ గుర్తింపు లభించడం సంతోషంగా ఉందని తెలిపింది. సంస్థలోని సభ్యులే, అత్యుత్తమ ఆస్థి అని భావిస్తున్నామని పెడెక్స్ పేర్కొంది.



సోమవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్

బులియన్

ముంబయిలో

బంగారం (22 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,128.00
8 గ్రాములు:	రూ.25,024.00
10 గ్రాములు:	రూ. 31,280.00
100 గ్రాములు:	రూ.3,12,800.00
బంగారం (24 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,345.455
8 గ్రాములు:	రూ. 26,763.64
10 గ్రాములు:	రూ. 33,454.55
100 గ్రాములు:	రూ. 3,34,545.5
వెండి	
8 గ్రాములు:	రూ. 330.40
10 గ్రాములు:	రూ. 413.00
100 గ్రాములు:	రూ. 4,130.00
ఒక కిలో:	రూ. 41,300.00

హైదరాబాద్‌లో

బంగారం (22 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,021.00
8 గ్రాములు:	రూ. 24,168.00
10 గ్రాములు:	రూ. 30,210.00
100 గ్రాములు:	రూ. 3,02,100.00
బంగారం (24 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,231.016
8 గ్రాములు:	రూ. 25,848.128
10 గ్రాములు:	రూ. 32,310.16
100 గ్రాములు:	రూ. 3,23,101.6
వెండి	
8 గ్రాములు:	రూ. 330.40
10 గ్రాములు:	రూ. 413.00
100 గ్రాములు:	రూ. 4,130.00
ఒక కిలో:	రూ. 41,300.00

ద్రవ్యలోటు లేదు

- ఒకవేళ సమస్య వస్తే సెంట్రల్ బ్యాంకు చర్యలు తీసుకుంటుంది
- రిజర్వు బ్యాంకు గవర్నర్ దాస్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జనవరి 7: ప్రస్తుతం దేశానికి అవసరమైన మేరకు కరెన్సీని అందుబాటులో ఉంచామని, ఒకవేళ ఆర్థిక రంగంలోద్రవ్యలోటు ఏర్పడే పక్షంలో సెంట్రల్ బ్యాంకు దానిపై చర్యలు తీసుకుంటుందని రిజర్వు బ్యాంకు గవర్నర్ శక్తికాంత దాస్ సోమవారం నాడిక్కడ స్పష్టం చేశారు. ముంబైలో మంగళవారం తాను నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం అవుతానని, ఆ కంపెనీలకు తలెత్తుతున్న ద్రవ్యలోటు సమస్యపై చర్చిస్తానని ఆయన తెలిపారు. ఇప్పటికే ఈ రంగంలో ద్రవ్య లభ్యతపై సమగ్రంగా మానిటర్ చేస్తున్నామని, ఒకవేళ ద్రవ్యలోటు తలెత్తితే ఆ సమస్యను పరిష్కరించేందుకు రిజర్వుబ్యాంకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అదే సమయంలో ద్రవ్యలభ్యత కారణంగా ధన నష్టాన్ని చవిచూసేందుకు రిజర్వుబ్యాంకు సిద్ధంగా లేదని దాస్ చెప్పారు. ద్రవ్యలభ్యతను పెంచేందుకు అదనంగా ధనాన్ని సమకూర్చే సమయంలో అత్యంత జాగరూకతతో వ్యవహరిచాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. అదనపుద్రవ్యలభ్యత కొన్ని అనర్థాలకు దారితీసే ప్రమాదం ఉందని తెలిపారు. మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటప్రైజెస్ (ఎంఎస్ఎంఈ)ల ప్రతినిధులతో సమావేశమైన అనంతరం రిజర్వు బ్యాంకు గవర్నర్ దాస్ విలేఖరులతో మాట్లాడారు. ద్రవ్య లభ్యతకు సంబంధించి ఎంఎస్ఎంఈల ప్రతినిధులు ఏమైనా మీ దృష్టికి తెచ్చారా? అని దాస్‌ను విలేఖరులు ప్రశ్నించగా ఇది ప్రత్యేకించి ఓ రంగానికే పరిమితం కాదన్నారు. మార్కెట్‌కు సంబంధించిన అంశమని, ఈ సమయంలో తానేమి చెప్పినా మార్కెట్ స్థితిగతులను ప్రభావితం చేసే అవకాశం ఉందని సమాధానం ఇచ్చారు. వివిధ కంపెనీలు, పెట్టుబడిదారుల అవసరాలను తెలుసుకున్న అనంతరం ఓపెన్ మార్కెట్ ఆపరేషన్ (ఓఎంఓ)కు అదనంగా 60 వేల కోట్ల రూపాయలను గత డిసెంబర్, ప్రస్తుత జనవరి మాసాలకుగాను రిజర్వు బ్యాంకు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్థిక సంస్థలకు సంబంధించినంత వరకు ద్రవ్యలోటును పూర్తిగా భర్తీ చేయడం జరిగిందన్నారు. తదుపరి కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ రంగం (ఎన్‌బీఎఫ్‌సీ) ప్రతినిధులతో సమావేశాలు కొనసాగిస్తామని గవర్నర్ తెలిపారు. మంగళవారం వీరితో జరిగే సమావేశంలో అన్ని సమస్యలపై సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. గత నెలలో కొత్త గవర్నర్ ప్రభుత్వ రంగ, ప్రైవేటు, సహకార బ్యాంకుల అధికారులతో సమావేశమైన సంగతి తెలిసిందే. కాగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సమస్యలపై సోమవారం (ఎంఎస్ఎంఈ) ప్రతినిధుల సమావేశంలో ఇటీవల రిజర్వుబ్యాంకుప్రకటించిన రుణాల పునర్వ్యవస్థాపక పథకాలను గురించి చర్చించడం జరిగిందని ఆయన చెప్పారు. మొత్తం రెండు గంటలపాటు జరిగిన ఈ చర్చలు తనకెంతో ఉపయుక్తంగా ఉంటాయని భావిస్తున్నాని గవర్నర్ దాస్ తెలిపారు. ఎంఎస్ఎంఈల మానసిక స్థితిని మాత్రం తాను గోప్యంగా ఉంచదలిచానని ఆయన స్పష్టం చేశారు. ఎంఎస్ఎంఈల్లో ద్రవ్యలోటు సమస్యను పరిష్కరించేందుకు గత వారం ఆర్బీఐ రూ. 25 కోట్ల వరకు గల మొండి రుణాలను ఏకదఫా పునర్వ్యవస్థీకరించేందుకు అనుమతించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దీనిపై అత్యధిక శాతం సంస్థలు లబ్ధిపొందేలా చూసేందుకు కృషి చేస్తున్నామన్నారు. మార్గదర్శకాలను రూపొందించి ఆర్బీఐ బోర్డు ముందుంచాల్సిందిగా బ్యాంకులను కోరామని దాస్ చెప్పారు.

మంచు



దేశ రాజధాని నగరమైన ఢిల్లీ వాసులను ఇటు పొగ మంచు.. అటు ఎముకలు కొరికేసే చలి గత కొన్ని రోజులుగా వణికించేస్తోంది. ముందేముందో తెలియనంతగా దట్టంగా వ్యాపించిన ఈ మంచులోనే రాజ్‌పథ్ రోడ్‌లో సోమవారం ఉదయం నత్తనడకన సాగుతున్న వాహనాలు

కురిసిన వేళ



అసలే చలికాలం.. అందులోనూ అది సిమ్లా. గడ్డకట్టిన మంచుకు కొదువేముంటుంది? నిరంతరం ధారగా కురుస్తోన్న మంచు సిమ్లాలోని ప్రతి ప్రాంతాన్ని కమ్మేసింది. ప్రకృతి శోభకు నిలయం కావడంతో సిమ్లాకు వచ్చే టూరిస్టు రాక తప్పలేదు. మరి వాహనాలు నడపలేని పరిస్థితుల్లో ఇటు టూరిస్టులకు కంచర గాడిదలే శరణ్యమయ్యాయి. వాటిపైనే ముందుకు సాగుతూ సిమ్లా అందాలను ఆస్వాదించారు.

రాజ్యసభలో ఎస్పీ సభ్యుల నిరసన

నినాదాల హోరు.. నేటికి వాయిదా

ఆంధ్రభూమి ప్రతినిధి



న్యూఢిల్లీ, జనవరి 7: ప్రతిపక్షాల ఆందోళనలతో రాజ్యసభ మంగళవారానికి వాయిదా పడింది. మైనింగ్ అక్రమాలకు పాల్పడ్డారని యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌పై సీబీఐని ప్రేరేపిస్తున్నారని, శబరిమల అలయంలోకి మహిళల ప్రవేశం వివాదంలో కేరళలో బీజేపీ దాడులకు పాల్పడుతోందని, రాఫెల్‌పై చర్చ జరిగాలని విపక్ష సభ్యులు రాజ్యసభలో సోమవారం ఆందోళనలు నిర్వహించడంతో సభ మూడుసార్లు వాయిదా పండింది. రాజ్యసభ సోమవారం ప్రారంభం కాగానే చైర్మన్ వెంకయ్య నాయుడు వివిధ మంత్రిత్వ శాఖలు, కమిటీలకు సంబంధించిన పత్రాలను సభకు సమర్పింపజేశారు. అనంతరం జీరో అవర్‌ను ప్రారంభించేందుకు ప్రయత్నించారు. అయితే సమాజ్‌వాదీ పార్టీకి చెందిన సభ్యులు తమ స్థానాల్లో నిలబడి నిరసనను వ్యక్తం చేశారు. అఖిలేష్ యాదవ్‌పై సీబీఐతో దాడులు చేయిస్తున్నారని ఆరోపిస్తూ కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. ఈ నిరసనకు బీఎస్పీ, తృణముల్ కాంగ్రెస్ ఎంపీలు కూడా సంఘీభావం తెలిపారు. తమ రాష్ట్రంలో బీజేపీ అల్లర్లు సృష్టిస్తోందని కేరళకు చెందిన వామపక్షాల సభ్యులు ఆందళన వ్యక్తం చేశారు. రాఫెల్ చర్చించాలని కాంగ్రెస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. రూల్స్ ప్రకారం అన్ని అంశాలను చర్చిస్తామని.. ఇలా నిరసనలు చేయడం సరికాదని ఎంపీలను చైర్మన్ వారించారు.

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy**, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

లోక్‌సభలో మళ్లీ గొడవ..

నలుగురు సస్పెన్షన్

❖ ముగ్గురు అన్నాడీఎంకే.. టీడీపీ సభ్యుడిపై వేటు ❖ ప్లకార్డులతో పోడియం వద్ద నిరసన.. ❖ ఆగ్రహించిన స్పీకర్ సుమిత్ర

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 7: ప్రతిపక్షాలు సోమవారం కూడా లోక్‌సభలో గందరగోళం సృష్టించి సభా కార్యక్రమాలకు అడ్డుతగిలాయి. పోడియం వద్ద నిలబడి ప్లకార్డులు ప్రదర్శిస్తూ గొడవచేసిన ముగ్గురు అన్నాడీఎంకే సభ్యులు, ఒక తెలుగుదేశం సభ్యుడిని స్పీకర్ సుమిత్రా మహాజన్ రెండు రోజులపాటు సస్పెండ్ చేశారు. రాఫెల్ ఒప్పందం, మేకదాటు నీటిపారుదల ప్రాజెక్టు, ఏపీకి ప్రత్యేక హోదా, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌కు సీబీఐ నోటీసులు తదితర అంశాలపై ప్రతిపక్షాలు లోక్‌సభలో గొడవ చేశాయి. తెలుగుదేశం సభ్యుడు శివప్రసాద్, అన్నాడీఎంకే సభ్యులు కె.ఎన్.రామచంద్రన్, పి.వేణుగోపాల్, కె.కె.గోపాల్‌ను సభనుండి సస్పెండ్ చేశారు.

లోక్‌సభ ఉదయం పదకొండు గంటలకు సమావేశం కాగానే స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రయత్నించారు. కాంగ్రెస్, ఎస్పీ, అన్నాడీఎంకే, తెలుగుదేశం తదితర ప్రతిపక్షాల సభ్యులు పోడియం వద్దకు దూసుకొచ్చి గొడవకు దిగారు. అఖిలేష్ యాదవ్‌కు సీబీఐ నోటీసులు జారీ చేయటం ద్వారా ఎన్‌డీఏ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఎస్పీ సభ్యులు ఆరోపించారు. హెచ్‌ఏఎల్ సంస్థకు ఇచ్చిన ఆర్డర్ల విషయంలో రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభను తప్పుదోవ పట్టించారని కాంగ్రెస్ సభ్యులు దుయ్యబట్టారు. రాఫెల్ ఒప్పందంపై దర్యాప్తు జరిపేందుకు జేపీసీని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సభ్యులు డిమాండ్ చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని ఎంజీఆర్ వేషధారణలో వచ్చిన తెలుగుదేశం సభ్యుడు శివప్రసాద్ డిమాండ్ చేశారు. కర్నాటక ప్రభుత్వం కావేరీ నదిపై చేపట్టిన మేకదాటు నీటిపారుదల ప్రాజెక్టును వెంటనే నిలిపివేయాలని అన్నాడీఎంకే సభ్యులు డిమాండ్





చేశారు. ప్రతిపక్షం సభ్యులు పోడియం వద్ద సృష్టించిన గందరగోళం మూలంగా సభ స్తంభించిపోయింది. దీనితో సుమిత్రా మహాజన్ లోక్‌సభను మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి సమావేశం కాగానే సుమిత్రా మహాజన్ ప్రభుత్వ పత్రాలను సభకు సమర్పింజేశారు. హెచ్‌ఏఎల్ సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లపై వివరణ ఇచ్చేందుకు రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు స్పీకర్ అవకాశం ఇచ్చారు. ఎన్‌డిఏ ప్రభుత్వం హెచ్‌ఏఎల్‌కు 2014-18 మధ్య రూ.26వేల కోట్ల విలువ చేసే ఆర్డర్లు ఇచ్చింది.. మరో రూ.73వేల కోట్లకు సంబంధించిన ఆర్డర్లు ఇచ్చే విషయం పరిశీలనలో ఉన్నదని వివరించారు. తాను మొన్న లోక్‌సభకు ఇదే విషయం చెప్పాను తప్ప తప్పుదోవ పట్టించలేదని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పక్షం నాయకుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ తమ సిబ్బందికి వేతనాలు చెల్లిచేందుకు బ్యాంకుల నుండి వెయ్యి కోట్ల రుణం తీసుకున్నట్లు హెచ్‌ఏఎల్ చైర్మన్ మాధవన్ ప్రకటించారని చెప్పారు. దీనికి పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ స్పందిస్తూ తాను చెబుతున్నది నిజమేనని ఖర్గే హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సుమిత్రా మహాజన్ ప్రతిపక్షం సభ్యుల గొడవ మధ్యనే ముందు నిర్ణయించిన కార్యక్రమాలపై చర్చ కొనసాగించారు.

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

మంగళవారం, 8 జనవరి 2019

తీపి, కారాల సంక్రాంతి



అతి పెద్ద పండుగల్లో మొదటిగా చెప్పుకునేది సంక్రాంతి పండుగనే.. కొత్త పంటలు ఇంటికి వచ్చి ప్రతి ఇల్లూ ధనధాన్యాలతో, భోగభాగ్యాలతో కళకళలాడుతుంటుంది. మరి అలాంటి ఆనందకరమైన రోజుల్లో పిండి వంటలు లేకపోతే ఎలా? అందుకే సంక్రాంతి రోజు రకరకాల పిండివంటలను తప్పనిసరిగా చేసుకుంటారు తెలుగువారు. అందులో ముఖ్యమైనవి అరిసెలు, సకినాలు, జంతికలు.. ఇవి లేకుండా సంక్రాంతి పండుగ జరగదంటే అతిశయోక్తి కాదు. మరి అవి ఎలా చేయాలో ఒకసారి చూసేద్దామా..

నేతి అరిసెలు



కావలసిన పదార్థాలు
బియ్యం: అరకిలో
బెల్లం: అరకిలో
నూనె: వేయించడానికి
నెయ్యి: వేయించడానికి
తెల్ల నువ్వులు: 100 గ్రాములు

తయారుచేసే విధానం

ముందుగా బియ్యాన్ని నాన బెట్టుకోవాలి. తరువాత నానిన బియ్యాన్ని పిండి కొట్టించుకోవాలి. బెల్లాని మెత్తగా తురుముకుని ఒక గిన్నెలో వేసి కొద్దిగా నీళ్లను పోసి స్టవ్‌పై ఉంచాలి. నెమ్మదిగా కలుపుతూ ఉండ పాకాన్ని రానివ్వాలి. తరువాత ఈ పాకంలో నెమ్మదిగా బియ్యప్పిండిని వేస్తూ బాగా కలపాలి. దీనిలో నువ్వులను కూడా వేసి ముద్దగా తయారుచేయాలి. ఇలా తయారైన ముద్దను చలిమిడి అంటారు. ఈ చలిమిడిని చిన్న చిన్న ఉండలుగా చేసి చేతితో గుండ్రంగా వత్తుకోవాలి. తరువాత స్టవ్‌పై బాణలిని ఉంచి సగం నూనె, సగం నెయ్యిని వేసి వేడి చేసుకోవాలి. చేసుకున్న అరిసెలను ఇందులో వేసి బంగారు రంగు వచ్చేంతవరకు వేయించి తీసేసుకోవాలి. ఇలా బయటకు తీసిన వాటిని అరిసెల గరిటెతో గట్టిగా వత్తి ఒక గంట ఆరబెట్టాలి. తరువాత గాలి చొరబడని డబ్బాల్లో నిల్వ చేయాలి. ఇవి చాలా రోజుల వరకు నిల్వ ఉంటాయి. వేడివేడిగా అరిసెలు చేసుకుని అప్పటికప్పుడు తినాలనుకునేవారు పాకం పట్టిన చలిమిడిని ఫ్రిజ్‌లో నిల్వ ఉంచుకుని ఎప్పుడు కావాలంటే అప్పుడు చేసుకోవచ్చు. అరిసెలను నేతితోనే కాల్చుకోవాలనుకునేవారు నూనెను వాడాల్సిన అవసరం లేదు.

కారం సకినాలు

కావలసిన పదార్థాలు
బియ్యం: నాలుగు కప్పులు
నువ్వులు: అరకప్పు
వాము: మూడు చెంచాలు
ఉప్పు: తగినంత
నూనె: వేయించడానికి సరిపడా
కారం: రెండు చెంచాలు
జీలకర్రపొడి: రెండు చెంచాలు
వెల్లుల్లి ముద్ద: పావు కప్పు
తయారుచేసే విధానం

బియ్యాన్ని కడిగి నీళ్లలో నాలుగైదు గంటలు నానబెట్టాలి. తరువాత నీళ్లు వంపేసి బియ్యాన్ని బట్టపై ఆరబెట్టాలి. బియ్యంలోని నీరంతా పోయి బియ్యం కాస్త తడిగా ఉన్నప్పుడే పిండి పట్టించుకోవాలి. లేదా మిక్సీలో వేసి మెత్తని పిండిలా చేసుకోవాలి. తరువాత బాణలిలో నూనె వెయ్యకుండా నువ్వుల్ని వేయించుకుని బియ్యప్పిండిలో వేయాలి. ఇందులోనే వాము, తగినంత ఉప్పు, వెల్లుల్లి ముద్ద, కారం, జీలకర్ర పొడి వేసి నీళ్లు పోసుకుంటూ మురుకుల పిండిలా కలిపి పెట్టుకోవాలి. నిమ్మకాయంత సైజులో పిండిని తీసుకుని వేళ్లతో తడిబట్టపై గుండ్రంగా మూడు, నాలుగు చుట్లు వచ్చేలా చుట్టుకోవాలి. ఇలా మిగిలిన పిండినీ చేసుకుని నూనెలో ఒకటి రెండు చొప్పున వేసి వేయించుకుని తీసుకోవాలి. చల్లారాక ఎయిర్ టైట్ కంటైనర్‌లో వేసుకుంటే వారం, పదిరోజుల వరకు నిల్వ ఉంటాయి.



కోవా కజ్జికాయలు



కావలసిన పదార్థాలు
మైదాపిండి: నాలుగు కప్పులు
నెయ్యి: నాలుగు చెంచాలు
కోవా: రెండున్నర కప్పులు
కొబ్బరి తురుము: కప్పు
యాలకులపొడి: చెంచా
బాదం ముక్కలు: నాలుగు చెంచాలు
జీడిపప్పు ముక్కలు: నాలుగు చెంచాలు
ఎండుద్రాక్ష: నాలుగు చెంచాలు
పంచదార: ఒకటింపావు కప్పు
తయారుచేసే విధానం

ముందుగా ఒక గిన్నెలోకి మైదాను తీసుకుని అందులో నెయ్యివేసి కలపాలి. తరువాత కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ పిండిని మృదువుగా, చపాతీపిండిలా కలపాలి. పిండికి పైన కొద్దిగా నెయ్యిరాసి, పిండిపై తడిబట్ట వేసి కప్పి పక్కన ఉంచాలి. మరో గిన్నెలోకి కోవాను తీసుకుని మెత్తగా చిదమాలి. స్టవ్‌పై పాన్ ఉంచి అందులో కొద్దిగా నెయ్యి వేసుకోవాలి. కాగాక ఇందులో కోవాను వేసి అది గోధుమ రంగులోకి వచ్చేవరకు వేయించాలి. ఇందులో పంచదార పొడి, యాలకులపొడి వేసి కలపాలి. తరువాత దీనిలో బాదం, జీడిపప్పుముక్కలు, కొబ్బరి తురుము, ఎండుద్రాక్ష వేసి రెండు నిముషాలు వేయించి, దించి చల్లారనివ్వాలి. ముందుగా కలిపి ఉంచుకున్న మైదాపిండిని చిన్న చిన్న ముద్దలు చేసుకుని చిన్న చిన్న పూరీల్లా వత్తుకోవాలి. ఒక్కోదాంట్లో కాస్త కోవా మిశ్రమాన్ని వేసి కజ్జికాయల మాదిరిగానే వేళ్లతో కాస్త మెలిపెట్టినట్లుగా అంచుల్ని నొక్కాలి. అన్నింటినీ ఇలాగే చేసుకుని నెయ్యి లేదా నూనెలో వేయించి తీసి సర్వ్ చేసుకోవచ్చు.

మినప్పప్పు జంతికలు

కావలసిన పదార్థాలు
బియ్యప్పిండి: నాలుగు కప్పులు
మినప్పప్పు: కప్పు
వాము: ఒక చెంచా
వెన్న: పావు కప్పు
ఉప్పు: తగినంత
కారం: అరచెంచా
నూనె: వేయించడానికి సరిపడా
తయారుచేసే విధానం

మినప్పప్పును రెండు గ్లాసులు నీళ్లు పోసి కుక్కర్‌లో మూడుకూతలు వచ్చేవరకు ఉడికించుకుని తీసుకోవాలి. తరువాత నీటిని వంపేసి అందులో బియ్యప్పిండి, మిగిలిన పదార్థాలన్నీ వేసుకుని జంతికల పిండిలా కలుపుకోవాలి. ఈ పిండిని జంతికల గొట్టంలో కొద్దిగా తీసుకుని కాగుతున్న నూనెలో జంతికల్లా వేసుకుని దోరగా వేగాక తీసేస్తే కరకరలాడే మినప్పప్పు జంతికలు రెడీ.



సగ్గుబియ్యం చెక్కలు

కావలసిన పదార్థాలు
బియ్యం: మూడు కప్పులు
పెసరపప్పు: కప్పు
సగ్గుబియ్యం: అరకప్పు
నువ్వులు: రెండు చెంచాలు
జీలకర్ర: చెంచా
వెన్న: చెంచా
కారం: తగినంత
ఉప్పు: తగినంత
నూనె: వేయించడానికి సరిపడా

తయారుచేసే విధానం

బియ్యం, పెసరపప్పు, సగ్గుబియ్యాన్ని కలిపి మెత్తగా పిండిలా చేసుకోవాలి. ఈ పిండిలో నువ్వులు, జీలకర్ర, తగినంత ఉప్పు, కారం, వెన్న వేసుకుని బాగా కలపాలి. ఇందులో తగిననన్ని నీళ్లు పోసుకుని చపాతీ పిండిలా కలపాలి. ఐదు నిముషాల తర్వాత ఈ పిండిని చిన్న చిన్న చెక్కల్లా ఒత్తుకుని కాగిన నూనెలో వేసి, కాస్త రంగు మారాక తీసేసుకుంటే కరకరలాడే సగ్గుబియ్యం చెక్కలు రెడీ.

పుట్నాల జంతికలు



కావలసిన పదార్థాలు
పుట్నాల పిండి: కప్పు
సెనగపిండి: కప్పు
కారం: తగినంత
ఉప్పు: సరిపడా
వాము: ఒక చెంచా
నూనె: వేయించడానికి సరిపడా
తయారుచేసే విధానం

ఒక గిన్నెలో పుట్నాల పిండి, సెనగపిండి, తగినంత ఉప్పు, కారం, వాము, రెండు చెంచాల నూనె వేసి బాగా కలిపి సరిపడా నీళ్లతో జంతికల పిండిలా కలుపుకోవాలి. ఇప్పుడు పిండిని కొంచెం కొంచెంగా జంతికల గొట్టంలో పెట్టి కాగిన నూనెలో జంతికల్లా వత్తుకుని వేగాక తీసుకోవాలి. అంతే ఎంతో రుచికరమైన, కరకరలాడే పుట్నాల జంతికలు రెడీ.

షేర్ చేసే ముందు ఆలోచించండి!

భారత రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్, సైనిక దుస్తుల్లో ఉన్న ఒక యువతితో తీసుకున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫొటోలో ఆమెతో పాటు ఉన్న ఒక మహిళా సైనికాధికారిని నిర్మలా సీతారామన్ కుమార్తె అనీ, ఆమె ఇండియన్ ఆర్మీలో పనిచేస్తున్నారనీ సోషల్ మీడియాలో ఓ న్యూస్ వచ్చింది. కానీ ఓ న్యూస్ చానెల్ చేసిన పరిశోధనలో ఈ ఫొటోతో జరుగుతున్న ప్రచారం తప్పని తేలింది. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఈ ఫొటోలో ఉన్న యువతి పేరు నికితా వీరయ్య.

* * *



రక్షణ మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం.. వైరల్ అవుతున్న ఫొటోలో కనిపిస్తున్న మహిళా ఆఫీసర్ నికితా వీరయ్యను రక్షణ మంత్రికి అధికారిగా నియమించారు. ఫేస్‌బుక్‌లో ఉన్న ఆమె పబ్లిక్ ప్రొఫైల్ ద్వారా ఫొటోలో రక్షణమంత్రి నిర్మలా సీతారామన్‌తో ఉన్నది నికితనే అని ధ్రువీకరించుకున్నారు. ఫేస్‌బుక్ ప్రొఫైల్ ప్రకారం నికిత కర్ణాటకలోని మంగుళూరుకు చెందినది. 2016లో ఆమె ఇండియన్ ఆర్మీలో చేరింది. సైన్యంలో చేరడానికి ముందు నికిత ఇంగ్లీషు టీచరుగా పని చేసిందట. రక్షణ మంత్రిత్వశాఖ ప్రతినిధి కూడా ట్విట్టర్ ద్వారా ఈ వైరల్ ఫొటోపై స్పష్టతనిచ్చారు. 'ఇటీవల ఒక అధికారిక పర్యటనకు వెళ్లిన సమయంలో ఒక మహిళా అధికారి కోరికపై ఈ ఫొటోను తీశారట. కొంతమంది సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నట్లు ఈ మహిళా అధికారి రక్షణ మంత్రి కుమార్తె కాదు' అని రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి తెలిపారు. డిసెంబర్ 27న ఈ ఫొటో మొదటిసారి సోషల్ మీడియాలో షేర్ అయింది. ఆ తర్వాత ఈ ఫొటో ఇప్పటికీ అంటే ఈ రోజుకీ వాట్సాప్‌లో షేర్ అవుతూనే ఉంది. ఇదో ఫేక్ న్యూసండీ బాబూ.. అని ఎంతమంది చెబుతున్నా, ఎన్ని వెబ్‌సైట్లు, పత్రికలు తూర్పారబట్టినా సరే.. ఇలాంటి ఫేక్‌న్యూస్‌లు, ఫొటోలు వేలాదిగా షేర్ అవుతూనే ఉన్నాయి.. లైకుల వరద ముంచెత్తుతూనే ఉంది.. వాట్సాప్ గ్రూపులు మారుమోగుతూనే ఉంటున్నాయి.. ఎవడో, పనీపాటా లేనివాడో, అభిమానో.. అజ్ఞానంతోనో, ఉద్దేశపూర్వకంగానో ఓ తప్పుడు వార్తను ప్రచారంలోకి తీసుకొచ్చాడనే అనుకుందాం.. కానీ అన్నీ తెలిసిన జనాలకు ఏమైందో తెలియదు.. వేలంవెర్రిగా అందరూ దాన్ని ఎందుకు షేర్ చేస్తారో అర్థం కాదు. ఇదీ అలాంటిదే.. సాక్షాత్తూ రక్షణ మంత్రిత్వ శాఖాధికారి అధికారికంగా ప్రకటించినా సరే.. ఈ ఫొటో వైరల్ అవుతూనే ఉంది.


నికితా వీరయ్య

అప్పటినుంచి నిర్మలా సీతారామన్ పిల్లలు ఎవరు? ఎంతమంది? అని సెర్చ్ ఇంజిన్స్‌లో ఒకటే సెర్చింగ్.. ఎంపీగా కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన వివరాల ప్రకారం ఆమె కుమార్తె పేరు వాఙ్మయి పరకాల. ఢిల్లీలో తల్లితో ఉంటూ ఉన్నత చదువులు చదువుకుంటోంది.. మరింతగా చదువుకోవాలన్నది ఆమె లక్ష్యం.


చదివారుగా.. ఇలాంటి ఫేక్‌న్యూస్‌లను తయారుచేస్తున్నవారు, వాటిని షేర్ చేస్తున్నవారు కూడా నేరస్తులేగా.. కాదంటారా?

-మహి

రంగవల్లి

సందు చుక్క - 15 చుక్కలు 8 వరకు

ఎం.శంతన (ఇందుకూరుపేట, నెల్లూరు జిల్లా)



ముగ్గులకు ఆహ్వానం

నింగిలోని హరివిల్లులను నేలపైన పేర్చి.. కనులకింపైన రంగుల్ని అందంగా అద్దితే అది రంగుల మాలికవుతుంది. ముంగిట్లో రంగవల్లిక అవుతుంది. ధనుర్మాసం సందర్భంగా తెలుగు ముంగిళ్లలో రంగవల్లులను తీర్చిదిద్దడం ఆనవాయితీ.. ఆ సందర్భంగా ముగ్గులకు ఆహ్వానం పలుకుతోంది మాతృభూమి. ఆసక్తి కలవారు కింది చిరునామాకు ముగ్గులను పంపగలరు.

సూచనలు

✻ ముగ్గులను పంపేవారు ఎ4 సైజు తెల్లకాగితంపై వేయాలి.

✻ ముందుగా నల్లని ఇంక్‌తో ఔట్ లైన్ గీసిన తరువాత అందులో రంగుల్ని నింపాలి.

✻ ఎన్ని చుక్కలను పెట్టి ముగ్గులు వేశారో.. అంటే సరిచుక్కలా, బేసి చుక్కలా, సందు చుక్కలా.. అనే విషయం స్పష్టంగా రాయాలి.

✻ ముగ్గుతో పాటు, మీ పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫొటోని, చిరునామాని జతచేయాలి.

✻ డౌన్‌లోడ్ చేసిన ముగ్గులు కాక, స్వయంగా చేతితో వేసిన ముగ్గులనే పంపాలి. అదీ చుక్కల ముగ్గులకే ఆహ్వానం.

ముగ్గులు పంపాల్సిన చిరునామా:
ఎడిటర్,
ఆంధ్రభూమి దినపత్రిక, సరోజినీదేవి రోడ్,
సికింద్రాబాద్- 500 003.

కర్మభూమి

రచనో, చిత్రమో నాట్యమొ
రుచి పెంచెడి కర్మమొకటి ఋతమై నిలుచున్
శుచియౌ ప్రేరణ నొసగుచు
కాముచుబ్రోచుచు మనుజుల కాంక్షలు తీర్చున్

ఆంధ్రభూమి మంగళవారం, 8 జనవరి 2019

శ్రీనరసింహ శతకము

సీ. తల్లిదండ్రులు భార్య - తనయులాప్తులు బావ
మఱఁదులన్నలు మేనమామనగారు,
ఘనముగా బంధువుల్ -గల్గినప్పటికైన
దాను దర్లగ వెంటఁ దగిలిరారు
యముని దూతలు ప్రాణమపహరించుకపోవ
మమతతోఁబోరాడి మాన్పలేరు
బలగ మందఱు దుఃఖపడుట మాత్రమె కాని
యించుక నాయుష్య మియ్యలేరు

తే. చుట్టములమీది భ్రమదీసి చూరఁబెట్టి
సంతతము మిమ్ము నమ్ముట సార్థకంబు
భూషణ వికాస! శ్రీ ధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

భావం: ఓ నరసింహస్వామీ! తల్లీ, తండ్రీ, ఇల్లాలు, పిల్లలూ అన్నదమ్ములూ.. మొదలైన మొదలైనవారు ఎందరున్నా చనిపోయేటప్పుడు వెంటవచ్చే వారెవ్వరులేరు. ప్రాణాల్ని హరించుకుని పోయే యమదూతల్ని అడ్డగించి నిలపే వారొక్కరు లేరు. వీరందరూ ఏడ్చేవారే గాని ఆయుస్సు నిచ్చేవారు గారు. కాబట్టి ఈ బంధువులపై మమకారం విడిచి ముక్తి ప్రదాతవైన నిన్ను నమ్ముకోవటమే మంచిది.

అనంతం

30 -గోపరాజు నాగేశ్వరరావు

"జన సంచారం ఎక్కువగా వున్న ప్రాంతాల్లో కలివికోడి ఉండదు. దానికి మనుషుల పొడే గిట్టదు. నల్లకొండ దగ్గర మానవ సంచారం తక్కువగా వుంటుంది కనుక అవ్వి యీ ప్రాంతాల్లో ఉండే అవకాశం వుంది!

ఇకపోతే, కొండ గుహల్లో నివాసముండే అవకాశం ఇక్కడుంది కనుక అవ్వి యీ ప్రాంతానికి చేరవచ్చు.

నీటి కొలనులో దాహం తీర్చుకొంటూ, నల్లకొండ గుహల్లో నివాసముంటూ యీ చుట్టుప్రక్కల సంచరిస్తుండాలి.

నెమలి గుట్ట దగ్గర పురుగులు, క్రిమికీటకాలు అసంఖ్యాకంగా వుండి వుండాలి.... లేకపోతే అన్ని నెమళ్ళు అక్కడ వుండవు. కలివికోళ్ళ ఆహారం కూడా పురుగులు కీటకాలే కనుక వాటికోసం కలివికోళ్ళు ఇక్కడికి దాపులో వుండాలి.

ప్రమాదం లేని అనువైన నివాసం, ఆహారం, నీళ్ళు అందుబాట్లోవున్న ప్రాంతాల్లోనే జీవరాసులు కుదురుకుంటాయి! కనుక, నల్లకొండ గుహల్లో నివాసం వుంటూ, నెమలి గుట్ట దగ్గర ఆహారం తింటూ, కొలనునీళ్ళు తాగుతూ అవ్వీ ప్రాంతంలోనే దాగి ఉంటాయి" అని చెప్పాడు గరుడాచలం.

రాగ్యా ఆశ్చర్యంగా అతని వైపే చూస్తున్నాడు!

అడవిలో పుట్టి అడవిలో పెరిగిన తనకే ఇన్ని విషయాలు తెలియవు. పట్నం వాడు, గరుడాచలానికెలా తెలుసు?

పట్నంవాళ్ళు తెలివిగల వాళ్ళన్నది అందుకేనేమో!

"మనఁవ్ అడివంతా యతకాల్నా?" అని రాగ్యా అడిగాడు.

"కోళ్ళు కనిపించేదాకా వెదికే అవసరం లేదు. వాటి జాడలు కనిపిస్తే చాలు"

"ఎట్టా కనిపిత్తయ్యి."

"అవ్వి నడిచేప్పుడు నేలమీద పాదముద్రలు పడొచ్చు. ఈకలు రాలొచ్చు. కూతలు వినిపించొచ్చు."

"అంతా అయ్యేపాలికి ఎన్ని దినాలు పట్టుద్దో."

"ఎన్ని రోజులు పట్టినా తప్పదు" అన్నాడు గరుడాచలం.

"ఎప్పుడు బోవాలి మనఁవ్ అడివికి" రాగ్యా అడిగాడు.

"ఎప్పుడోనా? ఇప్పుడు బయల్దేరాలి. దేవర జాతరలోగా అన్ని పనులూ సవ్యంగా పూర్తయితేనే చాంద్‌నీ నీకు దక్కేది."

రాగ్యా కళ్ళుమెరిసాయి!

చాందినీ పేరువినగానే వొళ్ళు జలదరించింది! నరాలు లాగాయి.

"యల్దాంవా సారూ" అని అడిగాడు రాగ్యా.

గరుడాచలం, రాగ్యా అడవికి బయల్దేరారు!



సాయుధ పోలీసులు రక్షణగా బయల్దేరితే వాళ్ళను అప్పుడు వారించలేదు గరుడాచలం.

ఎప్పుడు సెక్యూరిటీ అవసరమో, ఎప్పుడు అనవసరమో.

ఎలాంటి పరిస్థితుల్లో ఎవరికి సెక్యూరిటీ ఇవ్వాలో గ్రహించాలి!

మూర్ఖంగా ప్రవర్తిస్తే చేతులుకాలాక ఆకులు పట్టుకోవాలి!

రాగ్యాకోసం అడవి పుత్రులు వేటాడుతున్నారు. కనిపిస్తే బంధించి తీసుకొని వెళ్తారు. పంచాయితీ పెట్టి కఠినంగా శిక్షిస్తారు.

అదీ కాకుండా వాళ్ళకు తన మీద కూడా కోపం వుండి వుంటుంది!

చాంద్‌నీ అన్ని విషయాలూ వాళ్ళకి చెప్పే వుంటుంది.

బయల్దేరారు.

గుడారాలు దాటారు.

అడవి అంచులు దాటి కారడివిలో అదృశ్యమయ్యారు.

కీ.శే.పెద్దిరెడ్డి కొడుకు ఎమ్మెల్లే పెంటారెడ్డి, వాళ్ళు అడవిలోకి వెళ్ళేదాకా గుడారం ముందు నిలబడి చూస్తూనే ఉన్నాడు!

దుర్గమారణ్యం!

లోపలికి పోను పోను అడుగు తీసి అడుగు వెయ్యటమే కష్టంగా వుంది. గుబురు ముళ్ళ పొదలు చెట్ల కొమ్మలు దారికి అడ్డొస్తున్నాయి!

రాగ్యా అందరికన్నా ముందు నడుస్తున్నాడు.

అతనిచేతిలో పదునైన వేట కొడవలి వుంది.

ముళ్ళ కంపలూ, అడవి ఈగలు, చెట్టుకొమ్మలూ కొడవలితో నరికి దూరంగా పారేస్తూ- దారి చేస్తున్నాడు రాగ్యా.

గురుడాచలం, నలుగురు సాయుధ పోలీసులు రాగ్యా చూపించిన దారిలో నడుస్తూ సాగిపోతున్నారు.

లోపలికి వెళ్తున్నకొద్దీ క్రమంగా వెల్తురు పల్చబడి, చీకట్లు ముసురుకొంటున్నాయి.

పొడవుగా సాగిన గుబురు కొమ్మలు గాలికి కదుల్తూ ఆకాశంలో కసువూడుస్తున్నట్టుంది!

కదిలే ఆకుల సందుల్లోనుంచి దొంగచాటుగా అడవిలోకి ప్రవేశించాలని ప్రయత్నిస్తూ- సూర్య కిరణాలు విఫలమౌతోన్నాయి.

వాళ్ళు అలాగే ముందుకు సాగిపోతున్నారు.

పాదాల క్రింద నలిగిన ఎండుటాకుల చప్పుళ్ళకు ఉడుతలు, కుందేళ్ళూ ఛెంగున దూకి పొదల్లోకి పారిపోతున్నాయి.

గూటి పక్షుల మౌన ధ్యానం భగ్నమై గడగడలాడుతున్నాయి.

ఒకచోట ఆగాడు!

ఒకటే దుర్వాసన!

జంతువు వేటాడి చంపినమనిషో.. మనిషి వేటాడి చంపిన జంతువో- కుళ్ళి కళేబరం నుంచి వస్తున్నదా వాసన.

ముక్కులు మూసుకొని గబగబా నడుస్తూ ముందుకు సాగిపోయాడు..కొంతదూరం నడిచాడు..

కొద్దిపాటి మైదానం వచ్చింది!


చెట్లు అడ్డు లేకపోవటంతో గాలి ధారాళంగా వీస్తూ హాయనిపించింది.. తృప్తిగా గాలి పీల్చున్నారు.

ముందుకు కదిలారు. మైదానం దాటి వెళ్తున్నారు!

ఒక చోట ఎందుకో రాగ్యా 'అక్కడే ఆగండి' అన్నట్టు చేత్తో సైగ చేసాడు.

(ఇంకా ఉంది)

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండుటచే మానసికానందాన్ని పొందుతారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లో మంచి గుర్తింపు లభిస్తుంది. నిన్నటివరకు వాయిదా వేయబడిన కొన్ని పనులు ఈ రోజు పూర్తిచేసుకోగలుగుతారు. ముఖ్యమైన వ్యక్తుల్ని కలుస్తారు.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**నూతన కార్యాలు ఆలస్యంగా ప్రారంభిస్తారు. అల్పభోజనంవల్ల అనారోగ్యాన్ని పొందుతారు. ఏదో ఒక విషయం మిమ్మల్ని మనస్తాపానికి గురిచేస్తుంది. వీలైనంతవరకు అసత్యానికి దూరంగా నుండుట మంచిది. అనవసర భయాందోళనలకు లోనవుతారు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**ఆకస్మిక ధనలాభయోగముంటుంది. కుటుంబంలో సంతృప్తికరంగా ఉంటారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. సంఘంలో గౌరవ మర్యాదలుంటాయి. అంతటా అనుకూల వాతావరణ మేర్పడుతుంది. స్త్రీలు సౌభాగ్యాన్ని పొందుతారు. బంధు, మిత్రులు కలుస్తారు.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**వృత్తిరీత్యా అనుకూల స్థానచలనం ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. పోట్లాటలకు దూరంగా నుండుట మంచిది. అనారోగ్య బాధలధిగమించుటకు ఔషధసేవ తప్పదు. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో తొందరపాటు పనికిరాదు.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. బంధు, మిత్రులతో విరోధమేర్పడే అవకాశాలుంటాయి. స్త్రీల మూలకంగా శతృబాధలనుభవిస్తారు. ఏదో ఒక విషయం మనస్తాపానికి గురిచేస్తుంది. పిల్లలపట్ల మిక్కిలి పట్టుదల పనికిరాదు. పగ సాధించు ప్రయత్నాన్ని వదిలివేయడం మంచిది.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవుతుంది. అనారోగ్య బాధలు స్వల్పంగా వున్నాయి. వేళ ప్రకారం భుజించుటకు ప్రాధాన్యమిస్తారు. చంచలంవల్ల కొన్ని ఇబ్బందులెదురవుతాయి. మనోనిగ్రహానికి ప్రయత్నించాలి. పిల్లలపట్ల ఏ మాత్రం అశ్రద్ధ పనికిరాదు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**కళాకారులకు, మీడియా రంగాలవారికి మంచి అవకాశాలు లభిస్తాయి. దేహాలంకరణకు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులను కలుస్తారు. పేరు, ప్రతిష్ఠలు సంపాదిస్తారు. నూతన వస్తు, వస్త్ర, ఆభరణాలను పొందుతారు.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటారు. వృత్తి, ఉద్యోగ రంగాల్లో నష్టపోయే అవకాశముంటుంది. కుటుంబంలో మార్పులు కోరుకుంటారు. ఒక మంచి అవకాశాన్ని జారవిడుచుకుంటారు. ఆకస్మిక ధననష్టంపట్ల అప్రమత్తంగా నుండుట అవసరం.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)** ఋణప్రయత్నాలు తొందరగా ఫలిస్తాయి. స్థానచలన సూచనలుంటాయి. శుభకార్యాల మూలకంగా ధనవ్యయం అధికమవుతుంది. ప్రయాణాలెక్కువ చేస్తారు. అనారోగ్యమేర్పడకుండా జాగ్రత్త అవసరం.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**ఆరోగ్యం గూర్చి జాగ్రత్తపడుట మంచిది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. విదేశయాన ప్రయత్నాలకు మార్గం సుగమమవుతుంది. కుటుంబ కలహాలకు దూరంగా వుంటే మేలు. సహనం అన్నివిధాలా శ్రేయస్కరం. డబ్బును పొదుపుగా వాడతారు.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబంలో ఆనందోత్సాహాలు లభిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు. సమాజంలో గౌరవం లభిస్తుంది. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ప్రతి విషయంలో అభివృద్ధి ఉంటుంది. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**పిల్లలవల్ల ఇబ్బందులనెదుర్కొంటారు. అధికారులతో గౌరవింపబడతారు. పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకుంటారు. అనారోగ్య బాధలు తొలగిపోతాయి. ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. నూతన వ్యక్తులు పరిచయమవుతారు.

మాటాట

నిర్వహణ: సుధామ 1840

	■	2	3			■
	■	■		■	■	4
5	6	■		■	7	
■	8		■	9		■
10		■	11	■	12	13
	■	■		■	■	
■		14			■	

ఆధారాలు

అడ్డం

1. వయోధికులు
4. వగతో ఒక రుచి
5. ఆలయము
6. వృశ్చికము
9. క్షణకాలము
10. తీగెలాగితే ఇదంతాకదిలిదింట!
12. సంపద
14. ఉత్తర భారతీయ సంగీతం

నిలువు

1. దధి
2. సముద్రము
3. రోజారమణి కొడుకు సినీ హీరో
4. వస్త్రము
7. క్షమ, ఓరుపు
8. క్షుత్తు
11. హిందీ కథ
13. యుద్ధపు బంటు

మాటాట-1839 సమాధానాలు

అడ్డం: 2. తిరుగలి, 5. త్రప, 7. గోవు, 8. శుక్తి, 9. మైదా, 10. లావు, 12. రిక్ష, 14. గోనెసంచి

నిలువు: 1. చరిత్ర, 3. రుద్రాణి, 4. గావు, 6. పశువు, 7. గోదారి, 10. లారీ, 11. కుబుసం, 13. క్షవరం

భారతీయ సంస్కృతీ మూల సూత్రాలు

భారతీయ అనే మాటకు 'భ'అనే ధాతువు ఆధారం. భ యంటే ప్రకాశించు అని అర్థం. సమ్యక్ కృత అంటే బాగుగా చేయబడిన అని తాత్పర్యం. మానవుడు ప్రకృతిసిద్ధంగా సాగిపోతుంటాడు. అందుకు భిన్నంగా జీవిస్తే వికృతి. ప్రాకృతిక జీవనం సానపట్టినట్లయితే సంస్కృతి భారతీయ సంస్కృతిని శ్రేయస్సు అభ్యుదయము అనే రెండు మూలసూత్రాలపై ఆధారపడింది. సుఖము శాంతి రెండింటినీ లక్ష్యంగా చేసుకున్నది. సుఖము శరీర ధర్మము- శాంతి మనోధర్మము- శరీరము- మనస్సు- బుద్ధి- ఆత్మ నాల్గింటి సంతులనాన్ని భారతీయ సంస్కృతి సాధిస్తున్నది. ఇందుకు మూల సూత్రాలు వేదములలో ఉపనిషత్తులలో చెప్పబడ్డాయి. ఈ గ్రంథాలు భారతదేశంలోనే పుట్టినా వాటి ప్రయోజనం విశ్వమానవాళిని ఉద్దేశించినవే.

"సర్వేజనాఃసుఖినోభవంతు
సర్వేః సంతునిరామయాః
సర్వేభద్రాణి మశ్యంతు
మాకశ్చిత్ యఃఖ భాన్ భవేత్"

ఈ మూల సూత్రంతో భారతీయ ధర్మం నిలబడింది. దేశంలో ఒక మనిషి కాదు, కుక్క పస్తుపడుకున్నా స్వాతంత్ర్యం వచ్చినట్లు కాదు అన్నాడు స్వామి వివేకానంద. శ్రుతులు శాశ్వతము స్మృతులు దేశకాలముల కనుగుణంగా మారుతాయి. ధర్మార్థ కామమోక్ష చతుర్విధ పురుషార్థ సాధన మానవ జీవన లక్ష్యంగా మనవారు నిర్వచించారు.

"ఒక జాతి అనేక కాలములలో పురోగమించిన సంవిధానమునందు సముద్భవించిన సౌమసేన విశేషమే సంస్కృతి."

ఈ వాక్యానికి అర్థం ఏమిటంటే ఒక జాతి తన జీవన ప్రవాహంలో అనేక ఘట్టములను దాటి ముందుకు సాగిపోతున్నప్పుడు కాలక్రమంలో గుబాళించిన మానవీయ మూల్యములు మూలములు పాలపై మీగడ తరగలవలె మిగిలినవి. సంస్కృతిగా నిర్వచింపబడుతాయి. ఇట్టి సంస్కృతి ప్రతి జాతికీ ఆయా జాతుల జీవనక్రమాన్నిబట్టి రూపొందింపబడుతుంది. ప్రతి జాతిలోను కొందరు మహాపురుషులు జన్మిస్తారు. వారి త్యాగములు జీవనశైలి తర్వాతి తరముల వారికి పాథేయముగా ఉపాదేయముగా మిగిలిపోతుంది. ఈ మార్గదర్శక మూల సూత్రములనే సంస్కృతి అంటున్నాము. ఈ జీవ భావగతమైన ప్రేరణ క్లిష్ట పరిస్థితులలో ఆయా ఋషులు ఎలా ఆవిష్కరించారో దానిని ధర్మము అని నిర్వచిస్తున్నాము. ధర్మము వ్యక్తిగతమైనది కావచ్చు. జాతిగతమైనది కావచ్చు. ప్రాచీన కాలంలో ధర్మము అనే పదం ఎక్కువ ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నది. నేడు సంస్కృతి అనే మాట ఆ స్థానాన్ని ఆక్రమించింది. ధర్మశబ్దం తెలుగులోవాడే అర్థం వేరు. హిందీలో అర్థం వేరు. హిందీలో 'ధర్మం' అంటే మతం అనే అర్థంలో ప్రయోగిస్తున్నారు (రెలిజియన్). ఈ సంస్కార సారాంశమే సంస్కృతి. సంస్కృతి లేనివాడు సంస్కారహీనుడు. అట్టి వాడు నేడు భారత జాతిలో ఉన్నాడు. అమెరికా గడ్డపై నిలిచినప్పుడు ఆ జాతిలోని పుణ్యపురుషులైన లింకన్ ప్రభృతులను గౌరవించటం సంస్కృతి. మరి భారతదేశంలో ఉన్నప్పుడు ఈ జాతిని నిర్మించిన ప్రాచీన మహాకవులు వ్యాస భాస వాల్మీకులును ఈ జాతి దేవతలుగా భావించిన రామకృష్ణ పరమహంసను గౌరవించవలసిన బాధ్యత ఈ జాతీయుల మీద ఉంది. అందుకు భిన్నంగా ప్రవర్తిస్తే సంస్కారహీనులు అనిపించుకుంటారు.

ఇలియడ్ రచించిన ట్రామ్ కథ గమనించాలి. అందలి కథానాయిక హెలెన్ వారి సంస్కృతికి చిహ్నము. భారతీయుల రామాయణం చూడండి. మన రామాయణంలోని సీత భారతీయుల సంస్కృతికి సంకేతము. ఎడ్వర్డు చక్రవర్తి ప్రేమకోసం సింహాసనం త్యజించాడు. రాముడు ధర్మంకోసం భార్యను త్యజించాడు. 'ఆరాధనాయ లోకస్య'అనే రాముని ధర్మం ఇది భారతీయ ఆదర్శం.

అహింసా పరమోధర్మః అని భారతీయ వేదాంత ఆదర్శము ఐతే రాముడు కేవలం ఒక్క స్త్రీకోసం అంతటి లంకానగరిని ధ్వంసంచేయటం తగునా? అని కొందరు ప్రశ్నిస్తున్నారు. మహాత్మాగాంధీ అహింసా సిద్ధాంతములో స్వాతంత్ర్య సముపార్జన చేశారు కదా- అని ఉదాహరణ చూపిస్తున్నారు. మహాత్ముడు నౌకాళీ దురాగతాలు జరిగిన తర్వాత అక్కడికివెళ్లి చూచాడు. ఎందరో స్త్రీలు చెరచబడ్డారు. ఎందరి ఆస్తులో ధ్వంసమైనాయి. ఎందరినో పాకిస్తానీయులు పొట్టనబెట్టుకున్నారు. 'ఏమయ్యా' మీకింత అన్యాయం జరుగుతుంటే ఎట్లా సహించి ఊరుకున్నారు? అని ప్రశ్నిస్తే మీరేకదా స్వామీ! అహింసా బోధ చేశారు. అని వారు ఎదురుప్రశ్న వేశారు. 'అయ్యో నేను జీవించి ఉండగానే నా అహింసామార్గం ఇంతటి వక్ర భాష్యానికి గురిఅయిందే' అని గాంధీగారు విలపించారు కాబట్టి భారతీయులలో హింస, శక్తిహీన సంస్కృతి కాదని తాత్పర్యం.

భారతీయ సంస్కృతికి స్త్రీ గోవు, వేదము మాన బిందువులు. వాటికి అవమానము జరిగినప్పుడు చేసెడి హింస అహింసయేనని ధర్మసూక్ష్మము.

వ్యక్తిశీలము గొప్పది. సమాజశీలము ఇంకా గొప్పది. ఇదొక ధర్మసూక్ష్మము. శరణాగతి భారతీయ సంస్కృతి. ఐతే గోరీ మహమ్మద్‌ను పృథ్వీరాజ్ క్షమించి వదిలిపెట్టటం శరణాగతి కిందికి రాదు. ఇదొక ధార్మిక అపార్థము. స్వతంత్ర వీర సావర్కార్ భాషలో "సజ్జన వికృతి.", విగ్రహారాధన మన సంస్కృతిలో భాగము. ఐతే నాస్తికులు దీనిని పరిహసిస్తారు. విగ్రహంముందు నిల్చొని భక్తుడు 'సహస్ర శీర్షం దేవం'అని మంత్రము చదువుతాడు. అంటే జనతా జనార్థన భావము ఇందులో దీని ప్రబోధము. ఇదే ఆలయ సంస్కృతీ సందేశము. ఐతే అదికూడా అఖండ భారత సంస్కృతిలో అంతర్భాగమే. సంస్కృతి ఆ జాతి సంగీతంలో సాహిత్యంలో జీవన విధానంలో కూడా ప్రతిబింబిస్తుంది. ఒక యుగంలోని ఒక దేశంలోని సాహిత్యాన్నిబట్టి ఆ యుగపు దేశపు సంస్కృతీ స్థాయిని మనం నిర్ధారింపవచ్చు.

ఆధునిక యుగంలో మనపై సాంస్కృతిక మతపరమైన దాడులు ఉధృతమైనాయి. ఇట్టి దశలో మహాకవులు తమ కలాలను గళాలను విప్పారు.

"అతి మనోబుద్ధ్య హంకృతులొపనిషదు
వాత్తగండూషికత్రము లౌర్వవహ్ని
గర్భితాంతః తపస్కులు ఘనులు ఋషుల
కెవ్వరు విరోధి, తద్వధ కెత్తినయది"అని విశ్వనాథ సత్యనారాయణగారు తన లేఖిని చూపించారు.

సంస్కృతి ఒక జాతియొక్క సర్వభావ సమాహారదృ వ్యక్తి- సమష్టి- సృష్టి- పరమేష్టి ఈ నాల్గింటి సమన్వయాన్ని భారతీయ సంస్కృతి సాధిస్తుంది. మానవునికి శరీరం ఉన్నట్లే ఒక దేశానికి భూభాగం (టెర్రిటరీ) ఉంటుంది. అందుకే రెండువేల సంవత్సరాల తర్వాత కూడా వారు కలియ గలిగారు. సంస్కృతి శిల్పంలో చిత్రలేఖనంలో సాహిత్య సంగీత రూపకాలల్లో ప్రతిబింబిస్తుంది. మన సమకాలీన సాహిత్య సంగీతాలనుబట్టి మన సంస్కృతిని అంచనా వేయవచ్చు.

-ప్రొ. ముదిగొండ శివప్రసాద్

ప్రజల మనిషి

-వట్టికోట ఆళ్వారుస్వామి

వినమరుగైన..

-సి.రాఘవాచారి

సాంప్రదాయక విద్యలకు దూరమైనప్పటికీ లోకానుభవం చేత, విజ్ఞతచేత తాను గ్రహించిన విజ్ఞానాన్ని ఆ వూరి ప్రజల అభ్యున్నతికి వినియోగించటానికి ఆయన సమకడతాడు. ముఖ్యంగా ఇందులో గమనించవలసిన విషయం తెలంగాణ ఉద్యమానికి ఆలంబనమైనటువంటి గ్రంథాలయోద్యమం మనకు అనుశ్రుతంగా కనిపిస్తుంది. నిజామాబాద్‌లో జరపదలచిన గ్రంథాలయ మహాసభలకు నిజాం ప్రభువు అనుమతి నిరాకరించటం దగ్గర నుంచి తన వూళ్లో గ్రంథాలయం అక్కడి పీడిత ప్రజలకు తమ జీవన సమస్యల చర్చలకు కేంద్రం కావటం నుండి చివరికి విజయపతాక కూడా అక్కడే ఎగరవేయటం గ్రంథాలయ ప్రాశస్త్యాన్ని తెలియజేస్తుంది. ముఖ్యంగా తెలుగు ప్రజలో సాంస్కృతిక అణచివేతకు తార్కాణమైనటువంటి ఆ నిజాం పాలనకు వ్యతిరేకంగా వట్టికోట ఆళ్వారుస్వామిగారు తెలుగు ప్రజల సమైక్య సాంస్కృతిక ఉద్దీపనానికి ఈనవల ఒక సాధానంగా వాడారు.

సాహిత్యం సమాజహితాన్ని కోరితే ప్రజల మనిషి ప్రజల సమభ్యున్నతిలో సాహిత్య సాంస్కృతిక పార్శ్వంతోపాటు భూస్వామ్య దోపిడీ నుంచి ప్రజలు విముక్తం కావలసిన అంశాన్ని మరింత స్పష్టం చేసింది. ఇందులో చాలా చాలా ఉపఘట్టాలుగా చెప్పవలసినవి చాలా ఉన్నాయి. ఒకటి పేదవారి యొక్క వారి నిరాశ్రయుతను ఆధారం చేసుకుని వారికి భూమి, పుట్ర, చదువు, ఉద్యోగం ప్రలోభం చూపి వారిని తమ మతంలోనికి మార్చుకోవటానికి ఇత్సే ముస్లిమీన్ అంటే రజాకార్లు చేసిన ప్రయత్నాల్ని చాలా అద్భుతంగా వారు చిత్రించారు. అలాగే క్రైస్తవ మిషనరీలు చేసినటువంటి ఈ మతాంతరీకరణ చర్యల పట్ల కూడా ఒక రకమైనటువంటి ఆక్షేపణను వారు పొందుపరచారు. ఆనాటి నిజాం పాలనలో అన్నివర్గాలవారు కూడా ఎట్లాంటి మినహాయింపు లేకుండా వెట్టి చాకిరీకి లోనైనటువంటి విషయాన్ని వేదాల రఘునాథాచారి గారి భార్య ఆండాళమ్మ దొరవారి ఇంట్లో పెళ్లికి విస్తరాకులు కుట్టడం దగ్గరనుంచి కింది స్థాయి వరకు అందరు ఎలా ప్రతిఫలం లేకుండా పనిచేయవలసి చూపారు.

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన - శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

-సశేషం

ధర్మభూమి

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవిసేయకునికి
పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్

ఆంధ్రభూమి మంగళవారం, 8 జనవరి 2019

హితవాక్యం

సహసా విదధీత న క్రియాం అవివేకః పరమాపదాం పదం
వృణతే హి విమృశ్య కారిణం గుణలుబ్ధాః స్వయమేవ సంపదః

భవ్య కవితాభాస్కరుడైన 'భారవి' మహాకవి వెలయించిన పదమాలిక యిది. 'కిరతార్జునీయం'లోని సన్నివేశం.

పాండవులు కానల్లో కోనల్లో కటిక చీకట్లలో బాధలు పడుతూ బరువుగా కాలాన్ని గడుపుతున్నారు. రాజనీతిని అనుసరించి ధర్మరాజు ఒక వనేచరుణ్ణి హస్తినాపురం పంపాడు. రాజ్యంలోని పరిపాలనా విశేషాల్ని రహస్యంగా తెలుసుకొని రమ్మన్నాడు. కొంతకాలం తర్వాత వనేచరుడు ద్వైతవనంలో వున్న ధర్మరాజును కలుసుకున్నాడు. చాలా సమర్థవంతంగా సుయోధనుడు పరిపాలిస్తున్నాడని చెప్పి విశేషాల్ని వివరించి వెళ్లిపోయాడు. అంతా విన్న ద్రౌపది ధర్మరాజును ఎత్తిపొడుపు మాటల్తో ఉద్రేకింపజేయాలని ప్రయత్నించింది. "నువ్వు వేసిన తప్పటడుగువల్లనే మేమింత దురవస్థను అనుభవిస్తున్నాం" అన్నది. తర్వాత భీమసేనుడందుకొని "ప్రతీకారం తీర్చటమే పురుష లక్షణం" అంటూ కన్నెర్రజేశాడు. యుద్ధానికి సన్నద్ధులు కావటమే కర్తవ్యమని గర్జించాడు. ఆ మాటలన్నీ ప్రశాంతంగా విని ధర్మరాజు ప్రసన్న దృక్కులతో పాంచాలి వైపు తిరిగి యిలా అన్నాడు.

"అనుకున్న వెంటనే చేయరాదు. ఆలోచన ఆచరణలోకి రావటానికి ముందు మంచి చెడుల వివేచన కావాలి. అది లేకపోవటం అవివేకం. అది ఎన్నో అనర్థాలకు దారితీస్తుంది. గుణవంతుల్ని వరించే శీలంగల సంపదలు వివేకశీలుణ్ణి స్వయంగా వచ్చి వరిస్తాయి. కాబట్టి ఏ పని చెయ్యాలన్నా ముందుగా దానివల్ల కలిగే లాభనష్టాల్ని గురించి వివేచించాలి. అదే మన విజయానికి ఉత్తమమైన మార్గం".

-వ్యాఖ్యాత:డి.ఎన్.దీక్షిత్

శ్రీకాళహస్తీశ్వరా!

- కొడుకుల్ పుట్టరటంచు నేడు రవివేకుల్ జీవనభ్రాంతులై!
కొడుకుల్ పుట్టరె కౌరవేంద్రున కనేకుల్, వారిచే నేగతుల్
వడసెన్? పుత్రులు లేని యా శుకునకున్ వాటిల్లెనే దుర్గతుల్
చెడునే మోక్షపదం బపుత్రునకున్ శ్రీ కాళహస్తీశ్వరా!

భావం:ఈశ్వరా! లోకంలోని జనులు ఎంత అవివేకులు! కొడుకులు పుట్టలేదని, తమకు ఉత్తమగతులు లేవని అజ్ఞానంతో ఏడుస్తున్నారు. కౌరవ చక్రవర్తి ధృతరాష్ట్రునకు వందమంది కొడుకులు పుట్టారు కదా! వారి వల్ల అతడు ఎంత ఉత్తమగతిని పొందాడు. బ్రహ్మచారిగా ఉండి అపుత్రకుడైన శుక మహర్షికి ఏ దుర్గతులు కలిగెను. ఇదంతా భ్రాంతి తప్ప మరొకటి కాదు. అపుత్రకుడైనవానికి మోక్షమార్గము మూసుకొని పోవునా? వట్టిది. 'జ్ఞానేనహి నృణాం మోక్షః'.

- గ్రహదోషంబులు దుర్నిమిత్తములు నీ కల్యాణనామంబు ప్ర
త్యహమున్ బేర్కొను నుత్తమోత్తముల బాధంబెట్టగా నోపునే?
దహనుం గప్పఁగఁ జాలునే శలభ సంతానంబు? నీ సేవఁచే
సి హతక్లేశులుగారుగాక మనుజుల్ ఓ శ్రీకాళహస్తీశ్వరా!

భావం:ఈశ్వరా!విషమ స్థానంలో నుండి గ్రహములు కలిగించు బాధలుగానీ, అపశకునములుగానీ, రోజూ నీ నామస్మరణం చేయు పుణ్యపుషులను కష్టపెట్టగలవా? ఏమిటో ఈ ప్రజలు అజ్ఞానంలో పడి నిన్ను సేవించక దుఃఖములను అనుభవిస్తున్నారు గానీ, మిడుతుల దండు అగ్నిని ఆవరింపలేదని గ్రహించపలేకున్నారేమి? ఇదెంత చిత్రమైన విషయము?

- అడుగం బో నిక నన్యమార్గరతులం ప్రాణావనోత్సాహినై,
యడుగంబోయినఁ బోదుఁ నీదు పద పద్మారాధక శ్రేణీయు
న్నెడకున్, నిన్నుభజింపగాఁ గనియు నాకేలా పరాపేక్ష కో
రెడి దింకేమి? భవత్ప్రసాదమె తగున్ శ్రీ కాళహస్తీశ్వరా!

భావం:ఈశ్వరా! నా జీవనయాత్ర సాగుటకై శైవులు గాక ఇతర మార్గానుసారులను యాచించను. ఒకవేళ యాచించినా, నీ చరణదాసులైన భక్తులనే యాచిస్తాను. అయినా, నిన్ను సేవించు పద్ధతులు తెలుసుకొన్న నాకు ఇతరులను యాచించు అవసరమేమి ఉన్నది? నీ అనుగ్రహము కలిగినచో ఈ అల్పములైన ప్రాపంచిన సుఖములు ఎందుకు కోరతాను? అసలు కోరుటకు వీనిలో సారం ఏమున్నది.

జాపకోపాఖ్యానము



మహాభారతంలో ఉపాఖ్యానాలు

డాక్టర్ ముదిగొండ ఉమాదేవి

నేను మాట తప్పను. నీవు నీ మాట పాటించు. అసత్యమాడకు. నేను ఇస్తానన్నాను కనుక నీవు స్వీకరించవలసిందే. నీవు అడిగిన మాట మీద స్థిరంగా ఉండు. ఎందుకంటే అసత్యవాదులకు ఇహపరాలు రెండూ ఉండవు. అతడు పితరులను, భవిష్యతరాలను కూడా తరింపచేయలేడు. ఎన్ని తపస్సులు ఎంత చేసినా అవి సత్యాన్ని మించిపోలేవు. సత్యమే అక్షర బ్రహ్మ. సత్యమే నశించని తపస్సు. సత్యమే అక్షర యజ్ఞం. సత్యమే అక్షర వేదం. సత్యం యొక్క ఫలమే సర్వ శ్రేష్ఠమైన ఫలం. ఈ జగత్తు అంతా సత్యం మీద ఆధారపడి ఉన్నది. సత్యమే వేదం. సత్యమే వేదాంగాలు. సత్యమే సర్వవిద్యలు.

సత్యమే విధి

సత్యమే ఓం కారం

సత్యం వల్లనే గాలి వీస్తున్నది

సత్యం వల్లనే సూర్యుడు ఉదయిస్తున్నాడు, అగ్ని దహిస్తున్నది

స్వర్గం సత్యమందే నిలిచి ఉంటుంది.

వేదాలు, యజ్ఞాలు, తపస్సు, మంత్రాలు, సరస్వతి - ఇవన్నీ సత్య స్వరూపాలే. ధర్మం సదా సత్యం వైపే ఉంటుంది.

కనుక రాజా! అసత్యమైన కర్మని చేయకు. యాచన ఇష్టం లేని వాడివి 'దేహి' అని నా తపఃఫలం యాచించావెందుకు? నేను ఇచ్చినది స్వీకరించకపోతే ధర్మభ్రష్టుడవై తిరుగుతూ ఉంటావు. మాట ఇచ్చి దానం చేయనివాడూ దానం అడిగి స్వీకరించనివాడు - ఇద్దరూ అసత్యవాదులే అవుతారు. కనుక ఈ విషయాన్ని అసత్యం చేయకు".

రాజు ఇలా అన్నాడు - "ప్రజారక్షణము, యుద్ధము- ఈ రెండూ క్షత్రియ ధర్మాలే కదా! మరి నీవు ఇచ్చే దానాన్ని ఎలా స్వీకరించను?"

బ్రాహ్మణుడు - "దానం స్వీకరించమని నేను నీ దగ్గరకు వచ్చి ప్రాధేయ పడలేదు. నీవే నా జప ఫలాన్ని దానంగా ఇమ్మని అడిగావు. మరెందుకు స్వీకరించవు?"

అప్పుడు ధర్ముడు వారి మధ్యకు వచ్చి ఇలా అన్నాడు -

"మీ ఇద్దరూ వాదించుకోవద్దు. సాక్షాత్తు ధర్ముడను మీ ముందు ఉన్నాను. రాజు తపః ఫలాన్ని స్వీకరించవచ్చు."

అప్పుడు సశరీరంగా స్వర్గమే వచ్చి వారి ముందు నిలిచి ఇలా అంది - "మీరిద్దరూ ఆ ఫలితాన్ని సమానంగా పొందండి"

అప్పుడు రాజు ఇలా అన్నాడు - "నాకు స్వర్గంతో పనిలేదు. విప్రుడు వెళ్ళదలిస్తే నేను సంపాదించిన పుణ్యాన్ని కూడా స్వీకరించవచ్చు".

దానికి బ్రాహ్మణుడు ఇలా అన్నాడు - "నేను చిన్నతనంలో తెలియక చేయి జాపి ఉండవచ్చు. కాని ప్రస్తుతం నేను గాయత్రీ మంత్రం జపిస్తూ నివృత్తి మార్గంలో ఉన్నాను. కనుక నన్ను ప్రలోభపెట్టవద్దు. నా పని నేను సాధించుకోగలను. నీ ఫలితం నాకు అవసరం లేదు. నేను తపస్సునందు, స్వాధ్యాయమందు లగ్నమైనవాడిని. ప్రతిగ్రహాన్ని విడిచి పెట్టినవాడిని."

అప్పుడు రాజ ఇలా అన్నాడు - "నీవు నీ జప ఫలాన్ని పరిత్యజిస్తే ఇలా చేద్దాం. మనం ఇద్దరం సాధించిన పుణ్యఫలాన్ని సమానంగా అనుభవిద్దాం. క్షత్రియులు దానం చేయగలిగినవారు, బ్రాహ్మణులు దానం గ్రహించేవారు. కనుక ఫలితాన్ని సమానంగా అనుభవిద్దాము. నీ కిష్టం లేకపోతే అలా చేయవలసిన పని లేదు. నా పుణ్యఫలాన్ని స్వీకరించు".

ఆ సమయంలో వికృత రూపులైన ఇద్దరు పురుషులు అక్కడికి వచ్చారు. వారు మలిన వస్త్రాలు ధరించి ఒకరి నొకరు కౌగిలించుకొన్నారు. నీవు నాకు బాకీ లేదు అని ఒకడు, కాదు బాకీ ఉన్నాను అని రెండవ వాడు వాదించుకుంటున్నారు. వారిద్దరూ రాజు దగ్గరకు వచ్చి తమకు సరియైన తీర్పు ఇవ్వమని కోరారు.



అందులో ఒకడు విరూపుడు, రెండవ వాడు వికృతుడు.

విరూపుడు ఇలా అన్నాడు "రాజా! నేను వికృతుడికి ఒక గోదాన ఫలం బాకీ ఉన్నాను. నేను బాకీ తీరుస్తాను అంటే అతను స్వీకరించడం లేదు."

అప్పుడు వికృతుడిలా అన్నాడు - "నాకు అసలు విరూపుడు బాకీయే లేడు. నేనెలా స్వీకరిస్తాను?"

రాజు విరూపుడు వికృతునికి ఏమి బాకీ ఉన్నాడో చెప్పుమనగా అతను ఇలా చెప్పాడు - "రాజా! బాకీ గురించి చెప్తాను విను. వికృతుడు తపస్స్వాధ్యాయ సంపన్నుడైన బ్రాహ్మణునికి ఒక గోవును దానం చేశాడు. నేను వికృతుని ఇంటికి పోయి ఆ గోదాన ఫలాన్ని యాచించాను. అతను నాకు ఆ ఫలితాన్ని నాకు దానం చేశాడు. తర్వాత నేను ఒక బీద బ్రాహ్మణునికి రెండు కపిల గోవులు దానం చేశాను. ఆ గోదాన ఫలితాన్ని వికృతునికి ఇవ్వదలిచాను. నేను స్వీకరించిన దానికి రెట్టింపు ఫలాన్ని ఇస్తున్నాను. ఇందులో దోషి ఎవరో మీరే నిర్ణయించాలి. మాకు న్యాయం చేయాలి. అతను దానమిచ్చినట్లే నేను కూడా దానమిస్తున్నాను. మరి అతను ఎందుకు స్వీకరించడం లేదు?"

రాజు వికృతుని అడిగాడు - "వికృతా! నీవు అతని దానాన్ని ఎందుకు స్వీకరించడం లేదు? నీది అతను తీసుకున్నట్లే అతను ఇచ్చింది నీవు తీసుకో!"

వికృతుడు ఇలా అన్నాడు - "విరూపుడు నాకు బాకీ ఉన్నానని అంటున్నాడు. కాని నేను దానమిచ్చాను కనుక బాకీ ప్రసక్తి లేదు. కనుక నాకు ఏమీ ఇవ్వనక్కర్లేదు".

రాజు - "అతను ఇస్తానంటే నీవు వద్దంటున్నావు అది తప్పు. నిన్ను శిక్షించవలసి వస్తుంది."

వికృతుడన్నాడు - "రాజర్షీ! నేను అతనికి దానం చేసిన దానిని తిరిగి ఎలా తీసుకుంటాను, ఇచ్చిన దానిని మళ్ళీ తీసుకోలేను. కనుక నన్ను శిక్షించండి."


విరూపుడు - "నేను ఇచ్చిన దాన్ని నీవు స్వీకరించకపోతే రాజు నిన్ను శిక్షిస్తాడు".

వికృతుడు - "నేను నీకు ధనాన్ని అప్పుగా ఇవ్వలేదు. దానంగా ఇచ్చాను. కనుక నువ్వు నాకు ఏమీ బాకీ లేవు. నీవు వెళ్ళవచ్చు."

వారి వాదన విన్న బ్రాహ్మణుడు రాజుతో ఇలా అన్నాడు - "రాజా! వీరిద్దరి మాటలు విన్నావు కదా! ఇప్పుడు నిస్సంకోచంగా నా దానాన్ని స్వీకరించు".

ఇంకావుంది...

సుందరకాండ



హంసలచే మోయబడుతోంది.

ఈ శ్లోకంలో 'సువర్ణ' శబ్దానికి పదహారు అచ్చులని అర్థం.

అలాగే 'మహత్'అంటే ఆకాశం. అందువల ఈ శ్లోకం 'విశుద్ధి'స్థానంలో ఉన్న స్వామిని చూపెడుతున్నది.

అలాగే-

యధా నగాగ్రం బహుధాతు చిత్రం
యధా నభశ్చ గ్రహ చన్ద్ర చిత్రం
దదర్శ యుక్తీకృత మేఘ చిత్రం
విమాన రత్నం బహురత్న చిత్రమ్

రకరకాల ధాతువుల (ఖనిజ లవణాలు)తో అందంగా ఉన్న పర్వతాగ్రాలు నానా గ్రహతారక చన్ద్రాదులతో కూడిన ఆకాశం అంతలో మేఘాలు క్రమ్ముకొన్న విచిత్రం- ఇలా నక్షత్ర శాలలోనికి అడుగుపెట్టిన స్థితి. అలాగే

మహీకృతా పర్వత రాజిపూర్ణాః
శైలా కృతావృక్ష వితాన పూర్ణాః
వృక్షాః కృతా పుష్ప వితాన పూర్ణాః
పుష్పం కృతం కేసర పత్రపూర్ణాః

పర్వత సమూహాలతోకూడిన భూమి- ఇంతలో అడుగు ముందుకువేస్తే

వృక్ష పూర్ణాలయిన పర్వతాలు- మరొక అడుగు ముందుకువేస్తే పుష్ప పరిపూర్ణాలయిన వృక్షాలు- మరొక్క అడుగువేస్తే

కేసర పత్ర పూర్ణాలుగా - పుష్పాలు కనబడతాయట.

మనోహర శిల్పమయంగా ఉంది. అద్భుత స్వరూపంగా ఉంది.

సాక్షాత్తు బ్రహ్మ నిర్మితంగానే ఉంది. ఆ రాక్షస రాజుయొక్క ఆత్మబల రూపంగా ఉంది. అంత మనోహరమైన విమానాన్ని చూస్తూనే ఉన్నాడు. అయినా- తానూ చూస్తూన్నదంతా సీత కోసమే.

ఆ విషయంలో స్వామి-

కృతాత్ముడు (నిశిత బుద్ధి) స్థూల సూక్ష్మ దర్శనం చేయగల సుచక్షువు.

సదాచార రూపమైన సువర్ణునుడు- కాని

అపశ్యతో భవదతి దుఃఖితం మనః

అయినా తత్పరత ఉన్నవాడు కనుక దీక్షనుండి విరమించలేదు.

అన్వేషణ కొనసాగిస్తానే ఉన్నాడు.

అర్థయోజన విస్తీర్ణము యోజనం వెడల్పు ఉన్న ఉత్తమ రాక్షసావాసమైన రావణ భవనంలో ప్రవేశించేడు.

అది సాక్షాత్తు రావణ భవనం కనుక పరమ మనోహరంగా ఉంది. ఐహిక భోగ సౌందర్యాలు మూర్తీభవించి ఉన్నాయి. పాన ద్రవ్యాలనుండి భక్ష్యాన్నాల నుండి వచ్చేది దివ్యగంధాలతో

సగం ధస్తం మహాసత్త్వం బంధుర్భంధుమివోత్తమం

ఇత ఏహీత్యువాచేన యత్ర తత్ర సరావణః- ఆ గంధాలు

వీధిలో ఇంటికొరకు వెదకికొంటూన్న బంధువును బంధువు పిలుస్తూన్నట్లు

ఇలారా! ఇలారా! అని స్వామిని పిలుస్తున్నాయట

మణి సోపానాలతో బంగారు అలంకరణలతో స్ఫటిక నేలలతో

అక్కడక్కడ అలంకరింపబడిన దంతపు బొమ్మలతో

రావణ మనఃకాంతలా ఉంది.

మహత్యా కుథయాస్తీర్ణం పృథివీలక్షణాంకయా
పృథివీ మివ విస్తీర్ణాం సరాష్ట్ర గృహమాలినీమ్

ఈ విధంగా కుథ (కార్పెట్) ఆ భవనంలో పరచబడి ఉంది. దాని మీద పర్వత అరణ్యా నదీ సముద్ర పర్యంతమైన ప్రపంచం చిత్రింపబడి ఉంది. దేశ విభజనతో గృహ సముదాయాలతో చిత్రంగా ఉంది. రావణుడు దానిమీద నుండి నడుచుకొంటూ శయన మందిరంలోకి వెడుతాడన్నమాట. ఇదే రాక్షస ప్రవృత్తి.

తన నిలకడకు స్థాన భూతమైన దానియందు కూడా గౌరవభావం లేకపోవటం.

సముద్రవసనే దేవి పర్వతస్తనమండలే


విష్ణుపత్ని సమస్తుభ్యం పాదాహతిం క్షమస్వ మే- అంటూ

ఉదయం లేవగానే భూమి మీద కాలు మోపకుండగానే భూదేవిని శరణు వేడుకొనే సంస్కారం మనది. పటంలో ఇది గంగ పుటిటన చోటు అని చూపెట్టగానే కృతజ్ఞతా భావంతో చేతుల్ని జోడించే జాతి మనది. తమ మనుగడకు కారణమైన మట్టిని భోగ వస్తువుగా భావించే తామస ప్రకృతే రాక్షసం. అటువంటి వాళ్ళు తమ జన్మ భూమిని తాకట్టు పెట్ట గలరు. అమ్మివేయనూ గలరు. వాని ముందు దేశ భక్తి వెట్టివాని ఆలోచనగా ఉంటుంది.

ఈ భవనం పుష్పక విమానంలో భాగంగా అటువంటి రావణ భవనం. ఇహిక తృప్తికి పరాకాష్టగా ఉంది.

ఇంకావుంది...

పరమహంస బోధామృతము



తత్త్వజ్ఞానము, బ్రహ్మానంద ప్రాప్తి మొదలగునవి మనకు సాధ్యమగుట మాయవలననే. అటులు కానియెడల వీనినన్నిటిని ఎవ్వరు కలనైనను తెలపగలరు? ద్వైతభావమును ఈ దృశ్య ప్రపంచమును మాయనుండియే పుట్టుచున్నవి. మాయకవ్వల భోక్త, భోగ్యము అనునవి లేనే లేవు.

65.పిల్లి తన కూనలను పండ్లతో కరచి పట్టుకొనునపుడు ఆ కూనలకే అపాయము నుండదు. కాని ఆ పిల్లి ఎలుకనట్లు పట్టుకొనునేని అది చచ్చును. అటులనే మాయ యితరులను నాశనము చేయును కాని భక్తులనెన్నడును నశింపజేయదు.

మూడవ ప్రకరణము

మాయ: కామినీకాంచనములు

కామమే బంధకారము -కామము: ఆత్మ వికాసము - కామమును జయించుటెట్లు? కాంచన మోహమును జయించుటెట్లు?

కామమే బంధకారణము

66.మాయ యనగా నేమి? పారమార్థిక సాధనకు - ఆత్మ వికాసమునకు- అడువచ్చుచుండు కామమే మాయ.

67.సర్వము ధ్వంసము చేయుదానిని మాయ యనవలయునా, మదనాగ్ని యనవలయునా?

68.కామినీ కాంచనములందరి మోహముచే సంసార బద్ధులగు నరులు వానిమూలమున వేన వేలు అవమానములను పొందుచున్నను వాని బంధమును విదళించుకొని మనస్సును భగవంతునివైపు త్రిప్పజాలకున్నారు.

69.సంసారులారా! కామినులను నమ్మకుడు, అతిక పటముగా వారు మిమ్ము లోబరచుకొందరు!

70. నీవెంత నాగరూకతతో మెలగువాడవైనను పొగచూరి మసిపాటియున్న గదిలో వాసము చేయుచున్న పక్షమున కొంచెమో గొప్పయో మసి డాగులు పడకుండ తప్పించుకోలేవు. ఎంత నిగ్రహ సంపన్నుడైనను, ఎంత బుద్ధిమంతుడైనను నరుడు కాంతాజనము నడుమ నివసించునెడల ఏ కొలదిగనైనను కామచింతలు వాని మనసున పొడసూపక మానవు.

71.సన్నిపాత జ్వరముచే బాధపడుచు సంధించియున్న వానిచెంతను బిందెల కొలది చల్లని మంచి నీరును జాడీలకొలది రుచికరములగు నూరుగాయలను బెట్టియుంచినయెల వాని నారగింపవలయునను ఉద్రేకమును ఆపుకొనగలడా? అటులనే కామజ్వరముతో కొట్టుకొనుచు, ఇంద్రియ సుఖములకై ఉబలాటపడువానికి ఒకవైపున కామినులటక్కులను మరొక వైపున ధనాకర్షణలును సిద్ధమైనచో వాని నాతడు నిగ్రహించుకోజాలడు; భక్తిమార్గ భ్రష్టుడై పెడచోవ త్రొక్కుట నిశ్చయము.

72.ఒక మార్వాడీ శ్రీరామకృష్ణుని సందర్శించి యిట్లు ప్రశ్నించెను. "నేనన్నిటిని త్యజించినాను, ఐనను నాకు భగవత్సాక్షాత్కారము కలుగకుండుటకు హేతువేమి?"

శ్రీ గురుదేవుడ్లి సమాధాన మొసగెను: "నూనె పోసి యుంచుకొను తోలుతిత్తులను జూచియుదురు కదా? అట్టితిత్తినుండి నూనెనంతయు కార్చివేసి చూడుడు. దాని యడుగునను ప్రక్కలను ఏ కొంచెమో నూనె అంటి పట్టుకొనియే యుండును. కావున నూనె వాసన దానిని విడిచిపోనేపోదు. అదే విధమున కొంత సంసార వాసన మీయందింకను మిగిలియున్నది".

73.కామినియు కాంచనమును నరులను నారాయణుని యెడ విముఖులనుజేసి సంసారమున ముంచివలేయునని జ్ఞప్తినుంచుకొనుడు. తనభార్య మంచిదైనను చెడ్డదైనను మరియెట్టిదైనను నరుడామెను పొగడుచునే యుండుట కడు విచిత్రము!

74.కోతి వేట కాని కాళ్లకడ పడి ప్రాణములు విడుచు రీతిని పురుషుడు సుందరాంగి చరణములకడ బలియగుచున్నాడు.

కామము:ఆత్మవికాసము

75.భక్తిసాధనలను సాగించి భగవంతుని బొందగోరు వారు కామినీ కాంచనముల యొక్క వలలో బడకుండ కడు జాగరూకులై మెలగవలయును. లేనియెడల యెన్నటికిని సిద్ధిపొందజాలరు.

76.శ్రీ చైతన్యుని నిత్యానందుడిట్లడిగెను: "నేను చేయు భక్తి బోధనలన్నియు నరుల మానస మూలం దెట్టి ప్రత్యక్షమగు మార్పును గలిగింపజాలకుండుటకు హేతువేమి?" అందులకు శ్రీ చైతన్యుడిట్లనియెను: "స్త్రీలతోడి సాంగత్యమువలన వారు ఎట్టి తత్త్వబోధనలను మనసులో నిలుపుకొనజాలకున్నారు. తమ్ముడా! నిత్యానందా! వినుము, సంసారమోహితులకు ముక్తిలేదు."

శ్రీ రామకృష్ణ బోధామృతము - పరిశోధితమగు 112 మహోపదేశములుగల శ్రీరామకృష్ణ వాక్య రత్నాకరము - సంగ్రహ జీవిత సహితము - అనువాదకుడు: శ్రీ చిరంతనానందస్వామి

స్వాధ్యాయ సందోహం

హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ
తెలుగు అనువాదం: డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

189

ఓ ప్రభూ! నీవు సమస్త జీవులకు పోషకుడవని చెబుతారు. అలా ఎందుకు చెబుతున్నారు? నేనాకలితో చచ్చిపోతున్నా. నీ వెవరిని రక్షిస్తూ ఉన్నావు? అందరిని కదా. మరి నన్నేల రక్షింపవు? ఆకలి మరణానికి నన్ను నీవు వదిలివేసావు. నాపై నీ కేల దయ రాదు? ఓ సంరక్షకా! 'శిశయం త్వా శ్రుణోమి' "నీవు వెంటనే సంరక్షించేవాడవని విన్నాను" నేను అలసుడను. ఆపద వచ్చినపుడు చింతింపవచ్చును లేనని సోమరిగా ఉండే దీర్ఘసూత్రుడను. నీవో! కనురెప్పపాటులో ప్రళయాన్ని సృష్టింపగల సమర్థుడవు. నాకు యుగాలు గడిచిపోయాయి. నీ పరంధామంనుండి నేనీ లోకంలోనికి వచ్చి ఎన్ని యుగాలు గడచిపోయాయో! ఎన్ని కల్పాలు గతించిపోయాయో! కాని నీ పరంధామానికి తిరిగి చేరుకోలేకపోయాను. చివరకు నేనా మార్గంలో నడుస్తున్నానో లేదో కూడ నాకు తెలియదు. ఓ జగత్పితా! 'శిశీహి మా' "నాకు శక్తినిమ్ము" నీవు నాకు మంచి బుద్ధిని కూడ ఇచ్చావు. దానిని వినియోగించి ఏమీ పొందలేకపోయాను. కాబట్టి 'అప్నస్వతీ మమ ధీరస్తు శక్ర' "ఓ శక్తిశాలీ! భగవాన్! నా బుద్ధిని సత్కర్మకు సుముఖంగా వెంటనే చేయి" నీకు కర్మమార్గం ఇష్టమని విన్నాను. నన్నా కర్మమార్గంలో పెట్టు. కాని ఏది సుకర్మయో ఏది దుష్కర్మయో నీవే ప్రబోధించు. దానివలన దుష్కర్మనాచరించి నీ ఆగ్రహానికి గురికాకుండా ఉంటాను.

ఓ అష్టైశ్వర్య సంపన్నుడా! నా జీవిత సౌఖ్యానికి ధనమెంతో అవసరం. కాని నీవు 'ధనం న స్పంద్రం బహుళమ్' "ధనం అత్యంత చంచలం"అన్న భ్రాంతిని కలిగించి భయపెట్టావు. కాని ధనకాంక్షనుమాత్రం పోగొట్టలేదు. అందువలన ఓ మహాదేవా! 'వసువిదం భగమింద్రా భరా నః' "ధనాన్నిపొందే సౌభాగ్యాన్ని మాకిమ్ము" నాకొక్కడికే కాదు. అందరకూ ఇమ్ము. ఓ ప్రభూ! నీవు భక్తుల పాలిట కల్పవృక్షమవు. 'కృధీ ధియం జరిత్రే వాజరత్నామ్' "భక్తులకు నీవే జ్ఞాన ధనమైయున్నావు' కాబట్టి జ్ఞానధనాన్ని భక్తులకు నీవే అనుగ్రహించు. మా అందరకు ఆ జ్ఞాన ధనమే కావాలి. ఓ జ్ఞాననిధీ! భక్తులకు నీవు జ్ఞాన ధనాన్ని ప్రదానంచేసినా అది ఎన్నటికి తరగదు. నిండుగానే ఉంటుంది.

పరమాత్మకు ప్రేమ పాత్రులు

న తం జినంతి బహవో న దభ్రా ఉర్వస్మా అదితి. శర్మ యంసత్।

ప్రియః సుకృత్ప్రియ ఇంద్రే మనాయుఃప్రియః సుప్రావీః ప్రియో అస్య సోమ॥

భావం:- సత్కర్మాచరణుడు, నిరంతర దైవధ్యాన తత్పరుడు, సర్వజీవ సంరక్షకుడు, శాంతశీలుడు అయినవాడే భగవంతునకు ప్రియమైనవాడు. అట్టి వానికి జగన్మాత భూలోకంలో చిరకాల సుఖజీవన సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుంది. ఎంతమంది కూడినా అట్టివానికి కించిత్తు అపకారాన్ని చేయజాలరు.

వివరణ:- లోకంలో అందరు భగవంతుడు తన ఎడల సంప్రీతుడై అనుగ్రహించాలని కోరుకొంటారు. కాని ఆయనావిధంగా తన ఎడల ప్రీతి జనించే సద్గుణాలేమైనా తనలో ఉన్నాయా? అని ఆత్మవిమర్శ చేసుకోరు. ప్రస్తుత మంత్రం తన ఎడల దైవానికి సంప్రీతి కలగాలంటే ముఖ్యంగా ఉండవలసిన సద్గుణాలేమిటో వివరిస్తూంది. అవి 1.సుకృత్ 2. మనాయు. 3. సుప్రావీ. 4. సోమీ.

సుకృత్:- సత్కర్మల నాచరించేవాడు సుకృత్తు. దైవమే స్వయంగా సత్కర్మాచరణశీలి. 'సమానశీల వ్యసనేషు సఖ్యమ్' "ఒకే శీలంగలవారి మధ్యగాని ఒకే ఆపద నెదుర్కొనేవారి మధ్యగాని మిత్రత్వమేర్పడుతుంది" అన్న వచనానుసారం సత్కర్మాచరణ శీలి (స్వపాః) అయిన సర్వేశ్వరుడితో సుకృత్తు అయినవానికిగాక దుష్కృతుడికి మిత్రత్వం గాని, ప్రీతిగాని ఎలా ఏర్పడుతుంది? ఋతగామి అయినవానితోనే పరమాత్మకు సఖ్యం లేదా ప్రతి ఉంటుందని-

ఋతస్య పంథాం న తరంతి దుష్కృతః

"ఋతమార్గాన్ని (సృష్టినియమాలు, శాసనాలు, ధర్మాలు) దుష్కర్ములు అనుసరించరు"అన్న ఋగ్వేద వచనానుసారం సుకర్ములతో గాక దుష్కర్మలతో పరమాత్మకు సఖ్యంగా ప్రీతిగాని కలుగదు. కాబట్టి సుకృత్తు= సత్కర్మశీలుని ఎడల మాత్రమే భగవత్ప్రీతి జనిస్తుంది.

మనాయుః:- సదా భగవత్ స్మరణచేయువాడే మనాయువు. అతడియందు కలిగే ప్రీతి కలలోనైన దైవచింతన చేయని మూఢమతి ఎడల భగవంతుని కేవిధంగా జనిస్తుంది? భగవచ్చింతన ఎవరికైనా భగవత్కథాశ్రవణం తరువాతనే కలుగుతుంది. శ్రవణమే చేయనివాడు ఎవరిని గురించి చింతన చేస్తాడు? దైవకథాశ్రవణం దైవచింతనకు ప్రేరణ కలిగిస్తుంది. అట్టి దైవచింతనుని ఎడల పరమాత్మకు సంప్రీతి జనిస్తుంది. అది ఆ జీవుని ఆత్మోద్ధరణకు దోహదపడుతుంది.

సుప్రావీః:- సర్వజీవులు భగవత్ప్రతిరూపాలన్న ఉదారాశయంతో వారికి సేవ చేసేవాడు సుప్రావి. ఎవరైనా సుప్రావియై భగవత్ప్రీతిపాత్రుడు కావాలని వాంఛించేవాడు భగవత్ప్రతి రూపమైన సర్వజీవుల ఎడల ప్రేమ భావమూ, ఆపత్సమయాలలో వారి రక్షణభారమూ వహించే సుశీలి కావాలి. ఈ సౌశీల్యాన్ని మనిషి ప్రయత్నపూర్వకంగా ఆచరించాలి.

ఇంకావుంది...

ఆంధ్రభూమి

చిత్రభూమి

జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!

మంగళవారం 8, జనవరి 2019

పెళ్లా.. నిజంగానా?



టాప్ హీరోయిన్ శృతిహాసన్ సినిమాలు తగ్గించిన సంగతి తెలిసిందే. కొందరేమో శృతికి ఆఫర్లు తగ్గిపోయాయంటారు. ఇంకొందరు మాత్రం తనే సినిమాలను తగ్గించేసిందని, కారణం బాయ్‌ఫ్రెండ్ మైఖేల్ కోర్సలే అంటారు. ఏదేమైనా శృతి స్క్రీన్‌కు కొంత దూరంగా ఉంటున్న మాట వాస్తవం. ఇదిలా ఉంటే ఈమధ్య లండన్‌లో తన ప్రేమికుడు మైఖేల్‌తో గడిపిన తీపి గుర్తులైన ఫొటోలను అదే పనిగా సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో -శృతి మైఖేల్‌ను పెళ్లి చేసుకోబోతోందని నెటిజనులు అనుకున్నారు. ఇక ఒక తెలుగు వెబ్‌సైట్ అయితే కాస్త ఆవేశపడి 2019లో శృతి పెళ్ళిచేసుకోబోతోందని ఆర్టికల్ రాసేసింది. ఆ ఆర్టికల్ లింక్‌ను తన ట్విట్టర్ ఖాతా ద్వారా కోట్ చేస్తూ... 'నిజంగానా... అయితే ఇది నాకు న్యూసే' అంటూ ఒక సెటైర్ వేసింది శృతి. ఈ లెక్కన పెళ్లి సంగతి ఇంకా కన్ఫర్మ్ కానట్టేనా. శృతి పెళ్లి సంగతి పక్కనబెడితే ఈమధ్యే ఒక బాలీవుడ్‌లో ఓ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందట శృతి. వరుస ప్రాజెక్టుల మీద ఫోకస్ పెడుతుందేమో చూడాలి.

ఈమే.. విజయమ్మ



దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర ఘట్టం 'యాత్ర'గా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. మహి వి రాఘవన్ తెరకెక్కిస్తున్న చిత్రంలో వైఎస్సార్ పాత్రను మమ్ముట్టి పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్, టీజర్‌కు అనూహ్య స్పందన వస్తోంది. అయితే వైఎస్ సతీమణి విజయమ్మ పాత్రను పోషిస్తున్న ఆశ్రిత వేముగంటి లుక్‌ను తాజాగా చిత్రబృందం విడుదల చేసింది. అచ్చంగా విజయమ్మను పోలిన ఆహార్యంతో ఆకట్టుకున్న ఆశ్రిత, పాత్ర పోషణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారట. మమ్ముటి లాంటి దిగ్గజ నటుడి సరసన పోషించనున్న విజయమ్మ పాత్ర కోసం చాలానే కసరత్తులు చేశారట. ఫిబ్రవరి 8న సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో సోమవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో రాజకీయ నేపథ్యంతో వస్తున్న వైఎస్ 'యాత్ర' ఆసక్తి రేకెత్తిస్తోంది.

'..ప్రైమ్ మినిస్టర్'కు ఊరట




భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ రాజకీయ జీవితంలోని ముఖ్య ఘట్టాలతో తెరకెక్కిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'కు ఊరట లభించింది. వివాదాస్పదమైన ట్రైలర్‌ను నిషేధించాలంటూ ఢిల్లీ ఫ్యాషన్ డిజైనర్ పూజా మహాజన్ వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ప్రతిష్టాత్మక వ్యక్తి జీవితంలోని అవాస్తవాలను తెరకెక్కించినట్టు ట్రైలర్ చూస్తే అర్థమవుతుందంటూ కాంగ్రెస్ శ్రేణులు కొద్దికాలంగా వివాదం రేపుతోన్న విషయం తెలిసిందే. మరో రెండు రోజుల్లో సినిమా విడుదలకానున్న తరుణంలో న్యాయస్థానంలో పిటీషన్ పడటంతో -సినిమా విడుదల కష్టమేనన్న ప్రచారం జరిగిపోయింది. ఒక వ్యక్తి జీవితం ఆధారంగా సినిమా తీసినపుడు సెక్షన్ 416 ప్రకారం ఆ వ్యక్తినుంచి 'అభ్యంతరం లేదన్న' అనుమతిని తీసుకోవాలని, అటువంటిదేమీ చేయకుండానే చిత్రబృందం అతిక్రమణకు పాల్పడుతోందని డిజైనర్ పూజ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, పిటిషన్ తరపు వాదనలు విన్న హైకోర్టు మాత్రం ఈ అంశాన్ని తోసిపుచ్చింది. సినిమాకు ఫ్యాషన్ డిజైనర్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఏ ఆసక్తితో ఆమె పిటిషన్ వేశారంటూ కోర్టు నిలదీసింది. ట్రైలర్‌ను నిషేధించే ఉత్తర్వులు ఏమాత్రం ఇవ్వలేమంటూ కోర్టు స్పష్టం చేసింది. విజయ్ రత్నాకర్ తెరకెక్కించిన 'ది యాక్సిడెంటల్ ప్రేమ్‌మినిస్టర్' చిత్రం 11న విడుదల కానుండటం తెలిసిందే. మాజీ ప్రధాని మన్మోహన్ వద్ద జాతీయ భద్రతా సలహాదారుగా పని చేసిన సంజయ్ బారూ రాసిన పుస్తకం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మన్మోహన్ పాత్రలో అనుపమ్ ఖేర్, సంజయ్ బారూ పాత్రలో అక్షయ్ ఖన్నా నటించారు. మన్మోహన్ రాజకీయ నేపథ్యాన్ని చిత్రంలో ఎలా చూపించారోనన్న ఆసక్తి కనిపిస్తోంది.

మజ్ను.. నాలో నీకు..



అఖిల్ అక్కినేని హీరోగా శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పి పతాకంపై 'తొలిప్రేమ' ఫేం వెంకీ అట్లూరి దర్శకత్వంలో భారీ నిర్మాత బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ మజ్ను'. షూటింగ్ చివరి దశకు రావడంతో, అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి జనవరి 25న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించి విడుదలైన 'ఏమైనదో.. ఏమైనదో.. పలుకు మరచినట్టు పెదవికేమైనదో..' టైటిల్ సాంగ్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఆ ఉత్సాహంతో హార్ట్ బ్రేక్ సాంగ్ 'నాలో నీకు.. నీలో నాకు ఇక సెలవేనా..' విడుదల చేశారు. అఖిల్ అక్కినేని సరసన నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రంలో నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

ఈ జంట.. జంటగా



అటు జాతీయ, ఇటు ప్రాంతీయ పరిశ్రమల్లో దొంతరలు దొంతరలుగా బయోపిక్‌లు తెరకెక్కుతున్నాయి. ఒక్క ఈ ఏడాదిలోనే కనీసం పదిహేను ప్రముఖుల జీవిత కథలు ఆడియన్స్ ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే కోవలో లెజండరీ క్రికెటర్ కపిల్‌దేవ్ లైఫ్ ఇన్సిడెంట్స్‌ని కబీర్ ఖాన్ తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. కపిల్ సారథ్యంలో భారత్ ప్రపంచ కప్ సాధించిన 1983లోని '83'ని సినిమాకు టైటిల్‌గా గతంలోనే ఫిక్స్ చేశారు. కపిల్ పాత్రను బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ పోషిస్తున్నాడు. తాజా సమాచారం ఏటంటే -రియల్ లైఫ్‌లో కపిల్ భార్య రోమీ పాత్రను రీల్‌లైఫ్‌లో దీపిక పోషించనుందట. రియల్ లైఫ్‌లో ఈమధ్యనే ఒక్కటైన జంట దీప్‌వీర్ -రీల్‌లైఫ్‌లోనూ జంటగా నటించబోతోందన్న మాట. రోమీ భాటియా పాత్ర విషయంలో చిత్రబృందం ఇప్పటికే దీపికతో చర్చలు జరిపిందని, ఆమె కూడా ఈ పాత్ర పోషించేందుకు అంగీకరించినట్టు బాలీవుడ్‌లో టాక్. 1983లో ప్రపంచ కప్ ఫైనల్ ఆడుతున్నపుడు -ఆట చివరిక్షణంలో తలెత్తిన అనేక భావోద్వేగాలను రోమీ (దీపిక) పాత్రలో చూపించేందుకు కబీర్‌ఖాన్ స్కెచ్ ప్రిపేర్ చేసినట్టు తెలుస్తోంది. ఆటుపోట్లు మధ్య సాగిన ఆటలో చివరకు తన భర్త కపిల్ సాధించిన కప్‌ను ముద్దాడుతున్న టైంలో కంట తడి పెట్టిన రోమీ సన్నివేశాన్ని దీపిక అద్భుతంగా పలికించగలదని చిత్రబృందం ఆశిస్తోంది.


కోచ్‌గా.. విజయ్



'సర్కార్' తరువాత ఇళయదళపతి విజయ్ నటించనున్న 63వ చిత్రం ఇటీవలే లాంచ్ అయ్యింది. విజయ్‌కి 'తెరి, మెర్సల్' రూపంలో రెండు బ్లాక్‌బ్లాస్టర్ విజయాలు అందించిన యువ దర్శకుడు అట్లీ ఈ చిత్రాన్నీ తెరకెక్కించనున్నాడు. జనవరి 21నుంచి షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. మొదటి షెడ్యూల్ కోసం ఆర్ట్ డైరెక్టర్ ముత్తురాజ్ భారీ సెట్‌ను నిర్మిస్తున్నారు.

స్పోర్ట్స్ నేపథ్యంలో తెరకెక్కనున్న చిత్రంలో విజయ్ కోచ్ పాత్రలో కొత్తలుక్‌లో కనిపిస్తాడట. భారీ బడ్జెట్‌తో ఏజిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తున్న చిత్రంలో నయనతార హీరోయిన్. ఎఆర్ రెహమాన్ సంగీతం సమకూరుస్తున్నాడు. ఇక దీపావళికి విజయ్ నటించిన సినిమాలు విడుదలై మంచి విజయం సాధించడంతో, ఈ చిత్రాన్నీ అదే సమయానికి విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నట్టు టీం చెబుతోంది.

నిన్ను తలచి..



ఎస్ఎల్ఎం, నేదురుమల్లి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం -నిన్ను తలచి. అనిల్ తోట దర్శకత్వంలో నేదురుమల్లి అజిత్‌రెడ్డి నిర్మిస్తున్న చిత్రంలో వంశీ, స్టెఫీ పాటిల్ హీరో హీరోయిన్లు. చిత్రానికి సంబంధించి ప్రసాద్ ల్యాబ్‌లో ఫస్ట్‌లుక్‌ను లాంచ్ చేశారు. అనంతరం మీడియా సమావేశంలో నిర్మాత అజిత్ మాట్లాడుతూ కొత్త బ్యానర్‌తోపాటు కొత్త హీరో హీరోయిన్లతో కలిసి చేస్తున్న సినిమా నిన్ను తలచి. ఈ ప్రాజెక్టుతో అందరికీ మంచి పేరు రావాలని ఆకాంక్షిస్తున్నా అన్నారు. హీరోయిన్ స్టెఫీ పాటిల్ మాట్లాడుతూ టాలీవుడ్‌లో అవకాశమిచ్చిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు. అడ్వాన్స్ సంక్రాంతి శుభాకాంక్షలు అన్నారు. దర్శకుడు అనిల్ మాట్లాడుతూ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాం. ప్రాజెక్టులో అవకాశమిచ్చిన నిర్మాతలకు థాంక్స్. వైవిధ్యమైన కథను అద్భుతంగా తెరకెక్కించాం. పోస్ట్ ప్రొడక్షన్స్ జరుపుకుంటున్న చిత్రాన్ని ఫిబ్రవరిలో విడుదల చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. పూర్ణచారి మాట్లాడుతూ టైటిల్‌పెట్టిన దగ్గరినుంచీ మంచి సినిమా చేస్తున్నామనే కాన్ఫిడెన్స్ పెరిగింది. మంచి సినిమాలో తనను భాగం చేసినందుకు దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు. హీరో హీరోయిన్ బాగా చేశారు. మంచి సంగీతం కుదిరింది. సినిమాలో అన్ని క్రాఫ్టులు కష్టపడ్డాయి. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ అన్నారు. హీరో వంశీ మాట్లాడుతూ అవకాశమిచ్చిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడి చేసిన సినిమాను ఆడియన్స్ ఆదరించాలని కోరుకున్నారు.

లక్కీ జిలేబీ

మెగాస్టార్ చిన్నల్లుడు కళ్యాణ్‌దేవ్ హీరోగా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. గత ఏడాది 'విజేత'నంటూ హీరో ఎంట్రీ ఇచ్చినా, ప్రేక్షకులను మెప్పించలేకపోయాడు. దీంతో కాస్త గ్యాప్ తీసుకున్న కళ్యాణ్‌దేవ్ ఇప్పుడు పులి వాస దర్శకత్వంలో రెండో సినిమాలో నటించేందుకు సిద్ధమవుతున్నాడట. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్స్ జరుగుతున్నాయి. కళ్యాణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ రియా చక్రవర్తిని హీరోయిన్‌గా ఫైనలైజ్ చేశారట. హిందీలో హాఫ్ గర్ల్ ఫ్రెండ్, బ్యాంక్ చోర్, జలేబిలాంటి సినిమాల్లో నటించి మెప్పించింది. తెలుగులోనూ 'తూనీగా తూనీగా' సినిమా చేసింది. 'జిలేబీ'లో హీరోకిచ్చిన జిమ్నాస్టిక్ కిస్సులు ఆమెకు గుర్తింపు తెచ్చాయి. ఇప్పుడు కళ్యాణ్‌దేవ్ సినిమా ద్వారా మెగా కాంపౌండ్‌లోకి ఎంట్రీ ఇస్తే మంచి బ్రేక్ దొరకడం ఖాయమే. రాజేంద్రప్రసాద్, పోసాని కృష్ణమురళి ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తారట. సినిమాకు థమన్ సంగీతం సమకూరుస్తున్నాడు. మ్యూజిక్ సిట్టింగ్స్ సైతం పూర్తైనట్టు చెబుతున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించడానికి సన్నాహాలు జరుగున్నాయని సమాచారం.



పేట.. కోట దాటేదే..



రజనీకాంత్ లీడ్‌రోడ్ చేసిన చిత్రం 'పేట'. సిమ్రన్, త్రిష హీరోయిన్లు. కార్తిక్ సుబ్బరాజ్ దర్శకుడు. అశోక్ వల్లభనేని నిర్మాత. సినిమా ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అంబికా కృష్ణ, జెమిని కిరణ్, వైవీయస్ చౌదరి, ప్రసన్నకుమార్ ఫస్ట్ టికెట్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నిర్మాత అశోక్ వల్లభనేని మాట్లాడుతూ 'పేటను సొంతంగా విడుదల చేయడానికి తీసుకున్నా. ఫస్ట్‌డేకి వచ్చిన టాక్‌తోనైనా సినిమాకు ఎక్కువ థియేటర్లు ఇస్తారని ఆశిస్తున్నా. కార్యక్రమానికి హాజరైన శ్రీకాంత్, వైవీయస్ చౌదరి, జెమిని కిరణ్, ఎఫ్‌డీసీ చైర్మన్ అంబికా కృష్ణ, అనిరుథ్, హీరోయిన్లకు కృతజ్ఞతలు. యువీ క్రియేషన్స్, దిల్‌రాజు, అల్లు అరవింద్ వంటి నిర్మాతలు థియేటర్లతోనే పుట్టినట్టు ప్రవర్తిస్తున్నారు. థియేటర్లు ఇవ్వడానికి చాలామందిని ఇబ్బంది పెడుతున్నారు. అలాంటి వారికి బుద్ధిచెప్పి ప్రభుత్వాలు అందరికీ థియేటర్లు దక్కేలా చేయకపోతే, పరిశ్రమ కుదేలైపోవడం ఖాయం. ఈ విషయంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబు ఆలోచించాలి' అని కోరారు. శ్రీకాంత్ మాట్లాడుతూ 'అశోక్ వల్లభనేని నా స్నేహితుడు. ధైర్యం ఎక్కువ. ఇటీవలే సర్కార్ విడుదల చేశారు. ఈ సంక్రాంతి బరిలో పేటను విడుదల చేస్తున్నారు. పోటీ పడగలదన్న నమ్మకం కలుగుతుంది' అన్నారు. చిరంజీవి, రజనీలాంటి ఆర్టిస్టులు చిన్న ఆర్టిస్టులకు స్ఫూర్తి అన్నారు. అంబికాకృష్ణ మాట్లాడుతూ జపాన్‌లో తొలి సారి ఫ్యాన్ బేస్ సాధించిన దక్షిణాది హీరో రజనీ. ఆయన సినిమాలు, స్టైల్ చూస్తూ పెరిగాం. వల్లభనేని విడుదల చేస్తున్న పేట, పండుగ సీజన్‌లో తన సత్తా చాటుతుందన్న భావన కలుగుతోంది. దర్శకుడు కార్తిక్ సుబ్బరాజ్ మంచి దర్శకుడు. కాలక్షేపానికి కాకుండా, హాంటింగ్ చేసే సినిమాలను తీస్తాడు. దమ్మున్న చిత్రానికి కార్తీక్ అందించిన సంగీతం ఆకట్టుకుంటుంది అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ తొలి సినిమా పిజ్జాను తెలుగులోనూ ఆదరించారని గుర్తు చేసుకున్నాడు. తలైవా సినిమా కోసం హైదరాబాద్‌కు వచ్చానని, ఇది అందరికీ డ్రీమ్ ప్రాజెక్ట్ అన్నారు. సన్ పిక్చర్స్‌కి ధన్యవాదాలు చబుతూ, అశోక్ సినిమాను తెలుగులో విడుదల చేయడం హ్యాపీగా ఉందన్నారు. స్ట్రాంగ్ స్టోరీ, పైగా ఫ్యామిలీ ఓరియంటెడ్ ఎంటర్‌టైనర్ అన్నారు. రజనీ సరికొత్త మొమెంట్స్ ఇందులో ఉంటాయని, హెవీ కాంపిటీషన్ మధ్య ఫెస్టివల్ సినిమాగా నిలుస్తుందన్న నమ్మకం ఉందన్నారు.